fb/prajasakti, www.prajasakti.com

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 72 | విజయవాడ, బుధవారం 14 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



## అప్పటివరకూ ఆధార్ తప్పనిసరి కాదు

### తుది తీర్పు వచ్చే వరకు 'నో డెడ్ లైన్'

### సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం

**న్యూఢిల్లీ :** ఆధార్ అనుసంధానం విషయంలో సామాన్యులకు ఊరట కల్గించే విధంగా సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఆధార్ చెల్లుబాటుపై సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ మిగతా 9లో

# హోదా ఎందుకివ్వరూ!

## కేంద్రం తీరును నిరసిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం



ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గుంటూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు

### రాష్ట్రం పట్ల హేళనగా మాట్లాడుతున్నారు : చంద్రబాబు

### అన్నీ చేస్తున్నా నిందలు సరికాదు : విష్ణుకుమార్‌రాజు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలు, అప్పటి ప్రధాని ఇచ్చిన హామీల అమల్లో జరుగుతున్న జాప్యం విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి పట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేంద్ర తీరును నిరశిస్తూ మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై మంగళవారం అసెంబ్లీలో లఘు మిగతా 2లో



శాసన సభ్యత్వాల రద్దు, సభ్యుల సస్పెన్షన్‌కు నిరసనగా నిరాహార దీక్ష చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# కోమటి రెడ్డి సభ్యత్వం రద్దు

### మరో ఎమ్మెల్యేపై కూడా వేటు

### ఉభయ సభల్లో కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్

### నిరాహార దీక్షకు దిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉభయ సభల్లో కాంగ్రెస్ సభ్యులపై వేటు పడింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేసినట్టు స్పీకర్ మధుసూధనాచారి ప్రకటించారు. శాసనసభలో సిఎల్పి నేత జానారెడ్డి సహా మిగిలిన 11 మంది సభ్యులను బడ్జెట్ సెషన్ ముగిసే వరకూ సస్పెండ్ చేశారు. అదే విధంగా శాసనమండలిలో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్‌అలీతో సహా ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్సీలపై ఈ సమావేశాలు ముగిసే వరకూ వేటు వేశారు. తమను సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 48 గంటల 'ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహారదీక్ష' కు దిగారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో సోమవారం రభస జరిగిన సంగతి తెలిసిందే. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగిస్తుండగా..కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసనలో భాగంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విసిరిన హెడ్‌ఫోన్స్ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలి కంటికి గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వం సిసి పుటేజీలు పరిశీలించిన అనంతరం కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం మిగతా 9లో

# మరో భారీ స్కాం

### 6వేల కోట్లు మింగేసిన ది ఇండియన్ టెక్నోమాక్

### బ్యాంకులకు 4 వేల కోట్ల ఎగవేత

### సిపిఎం సభ్యుని ప్రశ్నతో వెలుగులోకి

**సిమ్లా :** నీరవ్‌మోడీ, రోటోమోక్ తరహాలోనే మరో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ది ఇండియన్ టెక్నోమాక్ కంపెనీ 6 వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడినట్లు తేలింది. 2014లో మూతపడిన ఆ సంస్థ బ్యాంకుల నుండి 4 వేల కోట్ల రూపాయల రుణంగా తీసుకుందని, వివిధ ప్రభుత్వ శాఖలకు 2 వేల కోట్ల రూపాయల మేర పన్నులు చెల్లించాల్సిఉందని అధికారులు తేల్చారు. ఆ సంస్థ కార్యకలాపాలపై రాష్ట్ర శాసనసభలో సిపిఎం సభ్యుడు రాకేష సింగ్హా అడిగిన ప్రశ్నతో ఈ కుంభకోణం డొంక కదిలింది. ఏళ్ల తరబడి సాగుతున్న ఈ వ్యవహారంపై పోలీసు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని, అవసరాన్ని బట్టి ఇడితో పాటు ఇతర దర్యాప్తు సంస్థలకు కేసును బదిలీ చేస్తామని తెలిపారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల మిగతా 9లో



జవాన్ల మృతదేహాలు ఇన్‌సెట్లో తునాతునకలైన యాంటీ ల్యాండ్‌మైన్ ప్రూఫ్ వాహనం

# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల మందుపాతర

### 9 మంది జవాన్లు బలి

### ఇద్దరికి తీవ్రగాయాలు

### గాల్లో ఎగిరిపడిన యాంటీ ల్యాండ్‌మైన్ ప్రూఫ్ వాహనం

**ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)**

ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా గొల్లపల్లి కిష్టారం సమీపంలోని పలోడి అడవుల వద్ద మంగళవారం మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు తొమ్మిదిమంది సిఆర్‌పిఎఫ్ కోబ్రా జవాన్లు బలయ్యారు. ఆ ప్రాంతమంతా రక్తసిక్తమై, తెగిపడిన జవాన్ల మృతదేహాలతో భయానకంగా తయారైంది. మరో ఇద్దరు జవాన్లు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మంగళవారం ఉదయం సిఆర్‌పిఎఫ్ 212 బెటాలియన్‌కు చెందిన జవాన్లు యాంటీ ల్యాండ్ మైన్‌ప్రూఫ్ వాహనంలో కూంబింగ్‌కు వెళ్లి తిరిగి మిగతా 9లో

# ఏపి, తెలంగాణకు వేర్వేరుగా బార్ కౌన్సిళ్లు

### తెలుగు రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

రెండు రాష్ట్రాలుగా విడిపోయిన అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల మధ్య పంపకాలు జరగాల్సినవి కొన్ని ఇంకా మిగిలే ఉన్నాయి. ఇప్పటికీ కొన్ని ఇరు రాష్ట్రాలకు ఉమ్మడిగానే కొనసాగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు హైకోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున విభజన అనంతరం ఏపి హైకోర్టును కూడా ఇక్కడే కొనసాగించారు. అయితే తమకు ప్రత్యేక హైకోర్టు కావాలని తెలంగాణ ప్రభుత్వం ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తోంది. కాగా సుప్రీం కోర్టు దీనిపై కొంత సానుకూలంగా స్పందించింది. ఏపి, తెలంగాణకు మిగతా 9లో

# 25 కోట్ల మందికి ఊరట



### కనీస నిల్వ ఛార్జీలకు ఎస్‌బిఐ కోత

### పెనాల్టీలు 75% వరకు తగ్గింపు

### గ్రామీణ ప్రాంతాల్లో వారికి గరిష్టంగా రూ.10

### ఏప్రిల్ నుంచి అమల్లోకి

6


# ప్రతిపక్ష నేతలకు సోనియా విందు

### 20 పార్టీలు హాజరు



విందుకు హాజరైన ప్రతిపక్ష నేతలతో సోనియా గాంధీ

**న్యూఢిల్లీ :** దేశంలో వివిధ ప్రతిపక్ష పార్టీ నేతలకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, యుపిఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం సాయంత్రం ఇక్కడి 10 జనపథ్‌లోని తన నివాసంలో విందు ఇచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఎదుర్కొవడంపై చర్చిండానికి ఈ విందును ఏర్పాటు చేసినట్లు భావిస్తున్నారు. అయితే ఇది రాజకీయ కార్యక్రమం కాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా తెలిపారు. 'పార్టీలతో మరింత సమర్థవంతమైన సంభాషణల కోసం, స్నేహం కోసం ఈ విందును ఏర్పాటు చేసినట్లు' అని విందు అనంతరం విలేకరులకు సుర్జేవాలా తెలిపారు. దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, వేలాది కోట్ల రూపాయలు దేశం నుంచి వెళ్లిపోతున్నాయని వీటిపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ విందుకు 20 ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధ్యక్షులు శరద్ పవార్, మిగతా 9లో



















## జోన్‌పై హోం కార్యదర్శి ప్రకటనలతో ఉద్రిక్తతలు

### రైల్వే మంత్రికి ఎంపి రామ్మోహన్ లేఖ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

విశాఖపట్నం రైల్వే జోన్‌పై కేంద్ర హోం కార్యదర్శి ప్రకటనలతో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తే ప్రమాదముందని టిడిపి ఎంపి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఈమేరకు ఆయన కేంద్ర రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్‌కు లేఖ రాశారు. "ఏపి పునర్ విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో రైల్వేజోన్ అంశం ఉంది. వాల్తేర్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను కలిపి విశాఖ జోన్ ఏర్పాటు చేయాలని ఏపి ప్రభుత్వం ఇప్పటికే సూచించింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఇది ఏపి ప్రజల జీవన్మరణ సమస్య, వీలైనంత తొందరగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి" అని ఆయన లేఖలో పేర్కొన్నారు.




**మోడీ - పకోడి**

నెల్లూరులో మంగళవారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పకోడాలు వేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపిన విద్యార్థులు

## బహిరంగ సభకు భద్రత కల్పించండి

- వ్యక్తిగత భద్రతను కొనసాగించండి
- డిజిపికి పవన్ కల్యాణ్ లేఖ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

జనసేన ఆవిర్భావ సందర్భంగా బుధవారం గుంటూరు జిల్లా కాజలో జరుగనున్న బహిరంగ సభకు భద్రత కల్పించాలని, వ్యక్తిగత భద్రతను కొనసాగించాలని కోరుతూ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ డిజిపికి లేఖ రాశారు. తన మీద ఏదైనా దాడి జరిగితే అది ప్రజా జీవితం పై ప్రభావం చూపే అవకాశముందన్నారు. తాను భద్రతను కోరుతున్నది కుతూహలంతో కాదన్నారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న కుల ఉద్యమాలు, వర్గ పోరాటాలు, రాజకీయ అణచివేతల నడుమ తన భద్రత సున్నితమైన సామాజిక, రాజకీయ సమస్యలతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. గతంలో భీమవరం ఫ్లెక్సీని చింపేసినందుకు రెండు వేల మంది తన అభిమానులు ధర్నా చేశారని, శాంతి భద్రతలకు విఘాతం అవుతుందనే ఉద్దేశంతో పోలీసులు కొంత మందిని అదుపులోకి తీసుకున్నారని, ఈ విషయాలు మీ దృష్టికి వచ్చే ఉంటాయని లేఖలో పేర్కొన్నారు. కాకినాడ సభ ప్రాంగణంలో జరిగిన తొక్కిసలాట, విజయవాడలో ఉద్దానం బాధితుల విషయమై సిఎంను కలిసేందుకు వచ్చినప్పుడు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్థంభించి ప్రజలు ఇబ్బంది పడిన సంఘటన, ఇటీవలే అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నప్పుడు జరిగిన తొక్కిసలాట సంఘటనలను దృష్టిలో ఉంచుకుని భద్రతను కోరుతున్నట్టు పేర్కొన్నారు. అలాకాకుండా పోలీసులు భద్రత అందించడంలో తమ నిస్సహాయతని ప్రకటిస్తే, తాను పర్యటిస్తున్న సమయంలో అనివార్యమైన సంఘటనలు ఏదైనా జరిగితే వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పవన్ పేర్కొన్నారు.



## ఆగ్నేయ అరేబియాలో వాయుగుండం

### 48 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మార్పు

**ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి**

ఆగ్నేయ అరేబియాలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం మంగళవారం నాటికి వాయుగుండంగా మారింది. హిందూ మహాసముద్రంలోని భూమధ్య రేఖా ప్రాంతం నుంచి వాయువ్య దిశగా ముందుకు కదులుతోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతానికి ఇది కేరళ రాజధాని తిరువనంతపురానికి దక్షిణ-నైరుతి దిశలో 280కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. 48 గంటల్లో ఇది మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**రాష్ట్రంలో పొడి వాతావరణమే**

అరేబియాలో వాయుగుండం ఏర్పడినా రాష్ట్రంలో పొడి వాతావరణమే కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. పలుచోట్ల 35 నుంచి 37 డిగ్రీలు, అక్కడక్కడా 38 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. ఉత్తర కోస్తాలో వాయుగుండం ప్రభావంతో వేడి గాలులు వీచే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం విశ్రాంత డైరెక్టర్ రాళ్లపల్లి మురళీకృష్ణ తెలిపారు. దక్షిణ కోస్తా, రాయలసీమలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

# హోదా ఎందుకివ్వరూ!

**మొదటి పేజీ తరువాయి**

చర్చను ప్రతిపాదించారు. దీనిపై వాడీవేడి చర్చ జరిగింది. రాష్ట్రం పట్ల చులకనగా మాట్లాడుతున్నారని, హేళన చేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. హోదా ద్వారా వచ్చే రాయితీలను కొన్ని రాష్ట్రాలకు అమలు చేస్తూ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. రైల్వేజోన్ ఇవ్వడం కుదరదంటున్నారని, ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటున్నారని, ఓడరేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారని, పెట్రోకెమికల్ పరిశ్రమలకు ఐదువేల కోట్ల గ్యాప్ ఫండింగ్ రాష్ట్రం భరించాలంటున్నారని, విద్యా సంస్థలకు కేటాయింపులు లేవని, ఈ తరహా కేటాయింపులు చేస్తే పూర్తయ్యేందుకు 20 ఏళ్లు పడుతుందని తీర్మానంలో పేర్కొన్నారు. మంగళవారం చర్చ ప్రారంభమైన వెంటనే చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఎందుకు రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు సాయం చేయడంలేదన్నారు. యుసిల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. జీవనాడిలాంటి పోలవరానికి అందాల్సిన సాయం మందగించడం దురదృష్టకరమని సిఎం వ్యాఖ్యానించారు. ఇప్పటికి రెండున్నరవేల కోట్లు రాష్ట్రం చేసిన ఖర్చు రావాల్సి ఉందన్నారు. 14వ ఆర్థిక సంఘం హోదా ఇవ్వొద్దందని చెబుతున్నారని, కానీ సంఘం అధ్యక్షుడు మాత్రం అలా చెప్పలేదని స్పష్టం చేశారని పేర్కొన్నారు. హోదా మన హక్కని, హక్కుల విషయంలో రాజీ పడబోమని చంద్రబాబు పేర్కొన్నారు. హోదా ఇవ్వబోమని, ఇవ్వాల్సిన నిధులు కూడా ఇచ్చేశామని బిజెపి నాయకులు అన్యాయంగా మాట్లాడుతున్నారన్నారు. హోదాతో వచ్చేవన్నీ ప్యాకేజీతో ఇస్తామంటేనే ఒప్పుకున్నామన్నారు. తలసరి ఆదాయం బాగుంది కాబట్టి హోదా మీకెందుకివ్వాలని అంటున్నారంటే యుపి, బీహార్‌లాగా పేదరికంలోకి వెళ్లాలని కేంద్రం ఉద్దేశమా అని ఆయన ప్రశ్నించారు. షెడ్యూల్ 9, 10 సంస్థల విషయంలో ఇప్పటి వరకూ విభజన జరగలేదని, రూ.30 వేల కోట్లు కంబైండ్ అకౌంట్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వాలు కొన్ని రాజకీయ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని, అందులో విఫలమైతే కష్టమని తెలిపారు. చివరి బడ్జెట్‌లో ఏపీ పేరే పెట్టలేదంటే ఏ విధంగా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. బిజెపి నాయకులు తెస్తామంటున్నారని, తీసుకొస్తే సంతోషిస్తామని తెలిపారు. సమైఖ్యాంధ్ర కోరిన వ్యక్తి నేడు రోడ్లు పట్టుకుని తిరుగుతున్నాడన్నారు. న్యాయం చేయాలని, సెంటిమెంట్‌ను గౌరవించాలని కోరుతున్నానన్నారు. సెంటిమెంట్ వల్ల నిధులివ్వం అంటున్నారని, సెంటిమెంట్‌తోనే తెలంగాణ ఇచ్చిన వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పోలవరానికి పెరిగే ఖర్చు భరిస్తామని చెప్పి తరువాత ఖర్చు పెరిగితే సంబంధం లేదని అంటున్నారన్నారు. అసెంబ్లీ స్థానాలను పెంచేందుకు చాలా అడ్డంకులొచ్చాయని, ప్రజలు గెలిపించాలనుకుంటే ఎన్ని సీట్లయినా ఒకటేనన్నారు.

**రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**
**బిజెపి శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు**

రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని బిజెపి శాసనసభాపక్షనేత విష్ణుకుమార్ రాజు వెల్లడించారు. హోదా అంటే తెలీని వారు చాలా మంది ఉన్నారని, ఏపీకి ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. హోదా ఇస్తే కేంద్ర ప్రాజెక్టులు, పథకాలకు 90 శాతం నిధుల్ని కేంద్రమే ఇస్తుందని, హోదా లేని రాష్ట్రాలకు 60 శాతం మాత్రమే ఇస్తుందని తెలిపారు. ప్యాకేజీ ద్వారా మిగిలిన 30 శాతం కూడా ఇస్తామన్నారు. స్వదేశీ ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకునే అవకాశాన్ని కల్పించాలని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి సిఎం లేఖరాశారని, స్పెషల్ పర్పస్ వెహికల్ లాంటి కార్పొరేషన్ ద్వారా ఆ పని చేయాలని కేంద్రం చెప్పిందన్నారు. కానీ ఇప్పటి వరకూ రాష్ట్రం నుంచి స్పందన లేదని, రాజకీయ కారణంతోనే స్పందన లేదన్న అనుమానం ఉందన్నారు. రుణమాఫీ, పెన్షన్‌ల మొత్తాన్ని రెవెన్యూ లోటులో కలిపారని, నిజానికి రూ.4117 కోట్లు లోటు మాత్రమే ఉందని, ఇప్పటికే 3900 కోట్లు ఇచ్చేశామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఎక్కువ నిధులు పంపడంలో తప్పులేదన్నారు. కేంద్రం ఏమీ చేయకుండానే రెండంకెల వృద్ధి వచ్చేసిందనడం ఎంత వరకు సమంజసమన్నారు. జాతీయ రహదారుల పనులు చేస్తోంది కేంద్రం కాదా అని ఆయన ప్రశ్నించారు. రైల్వే జోన్ వచ్చి తీరుతుందని, లేని అనుమానాలు రేకెత్తించి ప్రజల్లో అభద్రతా భావాన్ని తీసుకొస్తున్నారన్నారు. జగన్‌తో ఎలాంటి సీక్రెట్ డీలింగ్ లేదని, ఉంటే అందరికీ తప్పకుండా చెప్తామన్నారు.

**కాంగ్రెస్‌ది మోసం...బిజెపిది ద్రోహం**

అంతకు ముందు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ మాట్లాడుతూ విభజన సమయంలో ఆంధ్రులకు కాంగ్రెస్ ద్రోహం చేస్తే, అనంతరం బిజెపి మోసం చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఆదుకునే ఆలోచన కేంద్రానికి లేదన్నారు. చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి ముఖాన కొట్టి వెళ్లారని విమర్శించారు. కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా మాట్లాడుతూ మూడేళ్లయినా కేంద్రం రాష్ట్రానికి నిధుల విడుదలలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా రూ.1.91లక్షల కోట్ల జంబో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘన సిఎం చంద్రబాబుదన్నారు. హోదా ఆంధ్రుల హక్కన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత మాట్లాడుతూ బిజెపి రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధుల తీరు పావల..అణా..అర్ధణా..తరహాలో ఉందని, వేల కోట్లు ఇవ్వాల్సిన ప్రాజెక్టులకు వందల కోట్లు ఇవ్వడమే ఇందుకు నిదర్శమన్నారు. భారీ విగ్రహాల నిర్మాణానికి వేలాది కోట్లు ఖర్చు పెడుతున్న కేంద్రం, రాష్ట్ర రాజధానికి నిధులివ్వలేదా అని ఆమె ప్రశ్నించారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్రానికి రూ.3.50 లక్షల కోట్లు కేటాయించినట్లు బిజెపి నేతలు చేస్తున్న ప్రకటనల్లో వాస్తవం లేదన్నారు. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం చేయాల్సిన సాయమంతా చేస్తోందన్నారు. ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన బీమా ప్రీమియం లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం మంచి పరిణామంగా ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సహచర టిడిపి ఎమ్మెల్యేల నుంచి ఆయనకు తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయి. కొందరు ఎమ్మెల్యేలు మోసం, ద్రోహం అని పెద్దగా అంటూ కేంద్రంపై తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. దీంతో అవాక్కయిన బిజెపి ఎమ్మెల్యే ఆకుల తాను రాష్ట్ర ప్రభుత్వం గురించి మంచి చెబుతున్నా అడ్డుకుంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొడుతున్నారు

### బిజెపిపై టిడిపి ఎమ్మెల్యే ఆరోపణ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

బిజెపి నేతలు రాష్ట్రంలో ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొడుతూ ఢిల్లీలో కూర్చుని తమాషాలు చూస్తున్నారని ఎమ్మెల్యే ఎస్వీ మోహనరెడ్డి ఆరోపించారు. బడ్జెట్‌కు సంబంధించి సాధారణ చర్చలో భాగంగా సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ఏమిచ్చారని రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారని ఆయన ప్రశ్నించారు. రాయలసీమలోని వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్‌లాగా రూ.24,000 కోట్లు ఇవ్వాల్సి ఉన్నా రూ.400 కోట్లు ఇచ్చి సిగ్గులేకుండా డిక్లరేషన్ ప్రకటించారని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమను ప్రారంభిస్తామని చెప్పి, కనీసం దాని తుప్పు కూడా తుడవలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర సహకారం లేకుండా అభివృద్ధి సాధిస్తుంటే అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇవ్వడం కేంద్రం బాధ్యత అని, అది మన హక్కని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం సిఇవోలా సిఎం చంద్రబాబు ఆరు గంటలు నిలబడి పని చేస్తున్నారన్నారు. రాజధాని ప్రాంతంలో వైసిపి పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి ఐదేళ్లు పట్టిందని, ఇంకా రాజధాని కట్టలేదని ప్రతిపక్ష నేత జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందని మోహనరెడ్డి పేర్కొన్నారు. సిఎం కుర్చీ తప్ప జగన్‌కు ఏమీ కనబడటం లేదన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కొందరు ఎమ్మెల్యేలు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకూ అనుకూలమైన బడ్జెట్‌లో పేదలకు పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే ఆంజనేయులు పేర్కొన్నారు. చేనేతలకు, మైనారిటీలకు ఎంతో ఉపయుక్తమైన బడ్జెట్ అని ఎమ్మెల్యే చిరంజీవులు అన్నారు. స్వయం సహాయ గ్రూపులకు ఆర్థిక చేయూతనిచ్చే బడ్జెట్ అని మాజీ మంత్రి మృణాళిని ప్రశంసించారు. ప్రతి గ్రామంలో స్మశానాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందని ఆమె తెలిపారు. అదే విధంగా శానిటరీ న్యాప్‌కిన్స్ ఇవ్వాలని నిర్ణయించడం గొప్ప విషయమని ఆమె పేర్కొన్నారు.

## ప్రజ్ఞ

1. అత్యాధునిక ఆయుధాల సమీకరణలో భాగంగా ధ్వని కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో దూసుకువెళ్లగలిగే హైపర్‌సోనిక్ క్షిపణి 'కింఝాల్' (డాగర్) ని పరీక్షించిన దేశం ?
2. ప్రపంచంలోనే అత్యంత హింసాత్మకమైన నగరం?
3. 'ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా జాతీయ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ఏవరికి లభించింది ?
4. దేశవ్యాప్తంగా ఎంత మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు ?
5. నోబెల్ శాంతి గ్రహీత మలాలాపై దాడికి కారణమైన తాలిబన్ నేత మౌలానా ఫజలుల్లాను పట్టించిన వారికి అమెరికా ప్రభుత్వం ప్రకటించిన రివార్డు ?

సమాధానాలు 7లో

# వివరణివ్వండి

### వైసిపి ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
- టిడిపికి ఎదురుదెబ్బ

**ప్రజాశక్తి - హైదరాబాద్**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి టిడిపిలో చేరి మంత్రులైన నలుగురితోపాటు, 18 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. పార్టీ మారడంతోపాటు, మంత్రులుగా కొనసాగుతుండటంపైనా వివరణివ్వాలని తాత్కా లిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. దీంతో రాజకీయంగా టిడిపి ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయ్యిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైసిపి నుంచి గెలిచి టిడిపిలో చేరడం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట ఉల్లంఘనకు పాల్పడిన 22 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం బెంచ్ విచారించింది. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న ఆదినారాయణరెడ్డి, రావు వెంకట సుజయ కృష్ణ రంగారావు, అమర్‌నాథ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ లతో పాటు మరో 18 మంది ఎమ్మెల్యేలకు నోటీసులిచ్చింది. ఏ అధికారంతో మంత్రులుగా కొనసాగుతున్నారో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని బెంచ్ వారిని ఆదేశించింది. వైసిపి నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఎం.మణిగాంధీ, పాలపర్తి డేవిడ్‌రాజు, జయరాములు, జ్యోతుల నెహ్రు, పాశం సునీల్‌కుమార్, వరుపుల సుబ్బా రావు, ఎస్.వి.మోహన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, అత్తార్ చాంద్ బాషా, గొట్టిపాటి రవికుమార్, జలీల్‌ఖాన్, కె.సర్వేశ్వరరావు, కలమట వెంకట రమణ, పోతుల రామారావు, ఎం.అశోక్‌రెడ్డి, గిడ్డి ఈశ్వరి, వి.రాజేశ్వరిలకు కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వీరంతా తమ వాదనలతో కౌంటర్ వ్యాజ్యాలు దాఖలు చేయాలని ఆదేశించింది.

తొలుత కేసు విచారణకు రాగానే పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తే పార్టీ ఫిరాయించిన 22 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా జారీ చేయలేదని చెప్పారు. ఇదే తరహా కేసు హైకోర్టులో గతంలో విచారణ జరిగినా మళ్లీ తిరిగి నోటీసుకు రాలేదన్నారు. కేసు వాయిదా పడితే తిరిగి విచారణకు నోచుకోవడం లేదన్నారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ మూడు లక్షలకుపైగా కేసులు హైకోర్టులోనే పెండింగ్‌లో ఉన్నాయని, కేసు విచారణకు రాలేదంటే ఏమీ చేయలేని పరిస్థితి అని వ్యాఖ్యానించింది. అన్ని కేసులూ ముఖ్యమైనవేనని, ఏ కేసు అత్యవసరమని చెప్పగలమని బెంచ్ ప్రశ్నించింది. అయినా పార్టీ ఫిరాయించిన వారికి నోటీసులిచ్చి, వారి వివరణ కోరతామని, అందులో నలుగురు మంత్రులుగా ఎలా అయ్యారో కూడా తెలుసుకుంటామని బెంచ్ స్పష్టం చేసింది.

## రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

### ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
### పరీక్షా కేంద్రాల కోసం యాప్


**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పదో తరగతి పరీక్షలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 29 వరకు పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 6,17,848 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 3,08,834 మంది బాలురు, 3,27,997 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,834 పరీక్షా కేంద్రాలను పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఇప్పటికే అధికారులు ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ జయరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు వెలుగు, సిటీ బస్సుల్లో విద్యార్థుల ఇంటి నుంచి పరీక్ష కేంద్రాలకు, తిరిగి నివాస ప్రాంతాలకు ఉచితంగా ప్రయాణించవచ్చునని పేర్కొన్నారు. హాల్ టికెట్లను ఇప్పటికే పరీక్షల విభాగం అన్ని పాఠశాలలకు అందజేసింది. హాల్ టిక్కెట్లు అందని విద్యార్థులు www.bseap.org వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేత సంతకం చేయించుకొని పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాలను తెలుసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ సెంటర్ లోకేషన్ యాప్‌ను రూపొందించింది. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు స్పాట్ వాల్యూయేషన్ ఉంటుంది. మే మొదటి వారంలో పరీక్షా ఫలితాలను విడుదల చేసేలా పాఠశాల విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది.

## 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనలతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

### కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచన
### సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు లేఖ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



కేంద్రప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనల వల్ల రాష్ట్రానికి నష్టమని, దీనిని నివారించి రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడాలని సిపిఎం కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు మంగళ వారం లేఖ రాశారు. 15వ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయడానికి ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న అంశాలు దీర్ఘకాలంలో రాష్ట్రప్రయోజనాల్ని దెబ్బతీసేవిగా ఉన్నాయని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన వాటాలను నిర్ణయించడానికి ఇప్పటి వరకు 1971 జనాభా లెక్కల్ని ప్రాతిపదికగా తీసుకున్నారని, ఇప్పుడు 2011 జనాభా లెక్కల్ని ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రతిపాదించారని పేర్కొన్నారు. దీనివల్ల కుటుంబ నియంత్రణను జయప్రదంగా అమలు జరిపిన రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని వివరించారు. రాష్ట్రఆర్థిక శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి భాస్కర్ అభిప్రాయం ప్రకారం 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనల వల్ల ఐదేళ్లలో రాష్ట్రం రూ.40వేల కోట్లు కోల్పోతుందని తెలిపారు. కేంద్రం చర్య వల్ల రాష్ట్రంతో పాటు ఇంకొన్ని రాష్ట్రాలకు కూడా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదిస్తున్న సవరణలన్నింటిపై సమగ్ర పరిశీలన జరిపి రాష్ట్రప్రయోజనాల్ని కాపాడటానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఇందుకు అవసరమైతే ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను సంప్రదించి ఉమ్మడి కృషికి చొరవ తీసుకోవాలని కోరారు.

## నేడు జనసేన ఆవిర్భావ సదస్సు

### భవిష్యత్తు కార్యచరణ వెల్లడించనున్న పవన్


**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు-విజయవాడ మధ్య ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా జనసేన పార్టీ ఆవిర్భావ సదస్సు బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. సభకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని నిర్వాహకుల అంచనా. ప్రత్యేకంగా అధిక సామర్థ్యం కలిగిన 10 జనరేటర్లు, సినిమా సెట్టింగ్‌ల తరహాలో ఏర్పాట్లు చేస్తున్నారు. తొమ్మిది అడుగుల ఎత్తులో 40 అడుగుల పొడవున భారీ వేదిక, పలు చోట్ల ఎల్‌సిడి స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. బారికేడ్లు, సీటింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ, 2014 జూన్ 8న సిఎం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఈ స్థలంలోనే నిర్వహించారు. 23 జిల్లాల నుంచి స్వచ్ఛందంగా ప్రజలు, అభిమానులు వస్తారని జనసేన కోశాధికారి మారిశెట్టి రాఘవయ్య తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ పవన్ కల్యాణ్ ప్రసంగిస్తారని రాఘవయ్య తెలిపారు. ఇతర నేతలు ఎవ్వరూ ప్రసంగించే అవకాశం లేదంటున్నారు. ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ వైఖరి, రాబోయే ఏడాది కాలంలో జనసేన తీసుకోబోయే రాజకీయ నిర్ణయాలు, ఎన్నికల్లో పోటీ చేసే అంశాలు, కేంద్రంపై అవిశ్వాసం, ఎంపిల రాజీనామాతో పాటు రాష్ట్రానికి నిధుల కేటాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాద ప్రతివాదనలపై ఇటీవల జనసేన ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ నివేదికలు తదితర అంశాలను పవన్ తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావిస్తారని తెలిసింది. సదస్సు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో జనసేన క్రియాశీలక పాత్ర పోషిస్తుందని పార్టీ నాయకులు తెలిపారు.

# అధికారుల నిర్లక్ష్యమే కారణం

- గుంటూరు కలుషిత తాగునీటిపై మంత్రి నారాయణ ప్రకటన
- యుద్ధప్రాతిపదికన ఓహెచ్‌ఎస్‌ఆర్ మరమ్మతులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే గుంటూరు నగరంలో కలుషిత తాగునీరు తాగి అమాయకులు మృతిచెందారని మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటా మని ఆయన తెలిపారు. ప్రధాన సమస్యపై అధికారులు దృష్టిసారించకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మం గళవారం ప్రశ్నోత్తర సమయంలో గుంటూరు పట్టణంలో కలుషిత తారునీరు అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరులో నివసించే 8 లక్షల మందికి రోజుకు ఒక్కో వ్యక్తికి 60 నుంచి 135 లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అయితే ఈ నెల 4, 5 తేదీల్లో పైపులైను ద్వారా కలుషిత నీరు ప్రవహించడంతో, ఆ నీటిని తాగి పదిమంది మృత్యువాత పడ్డారన్నారు. సంగ్రానికుంట, ఆనందపేట, క్రిస్టియన్ పేట తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమైనట్టు ఫిర్యాదులొచ్చాయన్నారు. నీటిలోని క్లోరిన్‌శాతంలో ఎలాంటి తేడా రాలేదని, స్టోరేజీ వాటర్‌లోనే తేడా వచ్చినట్లు చేపట్టిన పరీక్షల్లో వెల్లడైందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా కలిసి ఆయా ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 137 కుళాయి కనెక్షన్ల నీరు మురుగునీటిలో కలిసిందన్నారు. సమస్యను గుర్తించి నగరం మొత్తానికి సూపర్ క్లోరినేషన్ చేయించామన్నారు. కలుషిత తాగునీటిని నిలుపుదల చేయించి 71 ట్యాంకర్ల ద్వారా మంచినీటిని పంపిణీ చేయిస్తున్నామన్నారు. ఇప్పటివరకు దాదాపు 175 మందిని వివిధ ఆసుపత్రుల్లో చేర్పించామన్నారు. యుద్ధప్రాతిపదికన ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల మరమ్మతులు చేపడతామన్నారు. రాబోయే రోజుల్లో నూతన సాంకేతిక విధానంలో నీటి పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై యాప్‌ను కూడా రూపొందించామన్నారు.

**సమాధానాలు పెట్టకపోవడం సరైంది కాదు**

ఈ అంశంపై అంతకుముందు సభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మోదుగుల వేణు గోపాల్‌రెడ్డి తదితరుల మాట్లాడుతూ గుంటూరులో జరిగిన ఈ దుర్ఘటనపై సమాధానాలు సభలో పెట్టకపోవడం సరైంది కాదన్నారు. ప్రజలు భయాందోళనలకు గురై మంచినీటిని తాగే పరిస్థితి లేదన్నారు. మంచినీరు కలుషితమైతే ఆహారం కలుషితమైందని చెప్పడం దారుణ మన్నారు. నలభయ్యేళ్ల క్రితం వేసిన పైపులైన్లకు ఇప్పటి వరకు ఎందుకు మరమ్మతులు చేపట్టలేదో చెప్పాలన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన వారిలో 15 నుంచి 20 మంది డయాలసిస్ పొందుతున్నారని, మృతిచెందినవారిలో మూత్ర పిండాలు చెడిపోయి చనిపోయారనే వాదన కూడా ఉందన్నారు. అయితే మృతులు దేనివల్ల చనిపోయారో నివృత్తి చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఉందన్నారు. తాగునీటి సరఫరా నిర్వహణ కూడా సక్రమంగా లేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జరిగిన ఘటనపై ఎవరిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. దీనిపై కనీసం స్థానిక ఎమ్మెల్యే కూడా నోరుమెదపకపోవడం దారుణమన్నారు.

## సంక్షిప్తం

### రైల్వే జోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకోవాలి

**బిజెపి ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్‌రాజు**

విశాఖరైల్వేజోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకోవాలి. ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యల్ని చర్చించాల్సి ఉంది. విశాఖ రైల్వే జోన్ కచ్చితంగా వచ్చితీరుతుంది. పత్రికల్లో రైల్వే జోన్‌పై వచ్చిన వార్తలు పాత రికార్డుల్లో ఉన్న అంశాలే. రాజకీయ నిర్ణయంతో జోన్ ఏర్పాటు సాధ్యమే. రాజకీయపార్టీలు కావాలని రాద్ధాంతం చేయడం తగదు. ప్రజల సెంటిమెంట్‌తో ఆటలాడుకోవడం మంచిది కాదు.

### రైల్వే జోన్ ప్రజల చిరకాల వాంఛ

**బిజెపి ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ**

విశాఖ రైల్వే జోన్ అంశం ఏపీ ప్రజల చిరకాలవాంఛ. త్వరలోనే రైల్వే జోన్ ఏర్పాటు తథ్యం. సాంకేతికంగా రైల్వే జోన్ ఏర్పాటు సాధ్యం కాదని అధికారులు గతంలో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. విభజన బిల్లులోని అంశాల అమల్లో భాగంగా రైల్వేజోన్‌ను కేంద్రప్రభుత్వం త్వరలోనే సాకారం చేయనుంది.

### కాంట్రాక్టు లెక్చరర్లకు న్యాయం చేయాలి

**ఎమ్మెల్సీ కత్తి నరశింహారెడ్డి**

యూనివర్శిటీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లకు న్యాయం చేయాలి. ఈ విషయంలో బుధవారం ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. 25వేల మంది సర్వశిక్షా అభియాన్ సిబ్బందికి సమానపనికి సమానవేతనం ఇవ్వాలి. 58, 38 జీవోల్ని అమలు చేయాలి. గ్రామాల్లో ఇళ్ళ స్థలాలు లేని పేదలకు భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలి.

## రాష్ట్ర వైఫల్యాల్ని కేంద్రంపైకి నెడుతున్నారు : బిజెపి ఎమ్మెల్సీ మాధవ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపైకి నెడుతున్నారని బిజెపి ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని, కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని, అన్యాయం చేస్తోందని ఆరోపించడాన్ని తప్పుపట్టారు.




## కాంగ్రెస్ గతే బిజెపి, వైసిపిలకు పడుతుంది

**టిడిపి ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**



రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌కు పట్టిన గతే బిజెపి, వైసిపిలకూ పడుతుంది. ప్రజల మనో భావాల్ని దెబ్బ తీసేలా కేంద్రం వ్యవహరి స్తోంది. రాష్ట్రంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. సిఎం చంద్రబాబును జగన్ విమర్శిస్తారు కానీ ప్రధానిని మాత్రం విమర్శించరు. చీకటి ఒప్పందంలో భాగంగా బిజెపి నేతలెవరూ జగన్‌ను విమర్శించడంలేదు. మైనారిటీల పక్షాన నిలిచినందుకే చంద్రబాబును అణగదొక్కాలని కేంద్రం చూస్తోంది. జగన్ ఆడించినట్లు బిజెపి నేతలు ఆడుతున్నారు.

## హోదా కోసం రాజ్యసభలో పోరాడతా

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి రాజ్యసభ అభ్యర్థి**

ప్రత్యేక హోదా కోసం రాజ్యసభలో పోరాడతా. రాజ్యసభ సభ్యునిగా అవకాశం ఇచ్చినందుకు జగన్‌కు ధన్యవాదాలు. ఇచ్చిన పదవికి న్యాయం చేస్తా. సామాన్యులు ప్రజా సంకల్ప యాత్ర చేయలేరు. నామినేషన్ల పరిశీలన కోసం అసెంబ్లీకొచ్చాం.

## కమలానికి మిగిలేది కాండమే

**ఆనందరావు, టిడిపి ఎమ్మెల్యే, అమలాపురం**



రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే కమలానికి కాండమే మిగులుతుంది. రేకులు రాలిపోతాయి. మట్టి, నీరు ఇచ్చి ఏపీని ప్రధాని మోడీ మోసం చేశారు. ప్యాకేజీ అంటూ వంచించారు. తెలుగువారిని మోసం చేసిన వారెవరూ చరిత్రలో బాగుపడలేదు.

## జగన్ అండతోనే...

**జివి ఆంజనేయులు, టిడిపి ఎమ్మెల్యే, వినుకొండ**

జగన్ అండతోనే రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోంది. విభజన హామీలను అమలు చేయలేని వారు ఎందుకు విభజించారు. ఒరిస్సాలో లబ్ధికోసం ఏపీకి రైల్వేజోన్ ఇవ్వకపోవడం బాధాకరం. ఒవైపు బిజెపిపై అవిశ్వాసం అంటూనే ప్రత్యేక హోదా బిజెపినే ఇస్తుందని వైసిపి ద్వంద్వ వైఖరిని అవలంభిస్తోంది. దక్షిణాదిలో వచ్చే పన్నులను ఉత్తరాదిలో ఖర్చు చేస్తున్నారు. దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేస్తోంది.

# నిరాశపరచిన బడ్జెట్

- ఆర్థిక అసమానతల్ని ఎలా తొలగిస్తారు?
- సంక్షేమ రంగాలకు కుదింపు
- విద్య, వైద్యంపై చిన్నచూపు
- పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ బాలసుబ్రహ్మణ్యం



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశపరిచిందని శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్‌లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్రబడ్జెట్‌పై శాసనమండలిలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. అంకెలతో రాష్ట్రప్రభుత్వం కడుపు నింపుతోందని ఎద్దేవా చేశారు. ఉజ్వల సమాజాన్ని రూపొందిస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆర్థిక అసమానతల్ని తొలగించకుండా ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విద్య, వైద్యా రంగాలకు సరైన నిధులు కేటాయించకుండా సంక్షేమ బడ్జెట్ ఎలా అవుతుందన్నారు. ఒక శాతం ఉన్న జనాభా వద్ద 73శాతం ఆదాయం చేరిందని, 59శాతం ఉన్న జనాభా వద్ద ఒక శాతం సంపద ఉందని ఆయన వివరించారు. సమానమైన పని చేస్తున్న వారికి ప్రభుత్వం రెండు రకాల జీతాలు అందిస్తోందన్నారు. ఆర్థిక అసమానతల్ని, నిరుద్యోగ సమస్యను నిర్మూలించి, విద్య, వైద్య శాఖలకు సరిపడా నిధుల్ని కేటాయించాలని కోరారు. లేబర్ బ్యూరో లెక్కల ప్రకారం మూడేళ్ల కాలంలో దేశంలో 15లక్షల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని వివరించారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి పయనంలో పయనిస్తున్నాయని అంటున్నారని, ఉద్యోగాలు లేకుండా దేశం ఏవిధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నైపుణ్యం లేని విద్యను బోధిస్తున్నారని, దీనివల్ల ఉద్యోగాలు దొరకడం లేదన్నారు. సరైన నైపుణ్యం లేదంటూ చిత్తూరు శ్రీసిటీ, కృష్ణపట్నం పోర్టు వంటి వాటిల్లో స్థానికులకు ఆయా కంపెనీ యాజమాన్యాలు తిరస్కరించాయన్నారు. రాబోయే రోజుల్లో రాజకీయాల్ని శాసించేది నిరుద్యోగమేనని వ్యాఖ్యానించారు. రైతాంగం చాలా సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. వ్యవసాయం కుదేలవుతున్న పరిస్థితి నెలకొందన్నారు. రైతులకు మద్దతు ధర కచ్చితంగా ఇవ్వాలని, సబ్సిడీలు అందించాలని కోరారు. మహారాష్ట్రలో 50వేల మంది రైతులు వారి సమస్యల పరిష్కారం కోసం 200 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారని గుర్తు చేశారు. గత పదేళ్లల్లో బడా కార్పొరేట్లకు ప్రభుత్వం రూ.20లక్షల కోట్లు రాయితీలుగా అందించిందని, విజయ్‌మాల్యా ఎత్తుకెళ్లిన సొమ్ముతో రైతుల రుణాల్ని మాఫీ చేయవచ్చునని సూచించారు. విద్య, వైద్యాన్ని అందించకుండా సమాజం అభివృద్ధి చెందదన్నారు. రైతులు అప్పులు చేసి మరీ తమ పిల్లల్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చది విస్తున్నారని, వారి ఆత్మహత్యలకు ఇది కూడా ఒక కారణమని ప్రొఫెసర్ జయతీఘోష్ అన్నారని గుర్తు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులు, విద్యాసంస్థల వల్ల ఎలాంటి అభివృద్ధి ఉండదన్నారు. రాజధానిలో 14 ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం భూములు అప్పగిస్తోందని, వీటిపై తనకు నమ్మకం లేదన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులు ఫార్మాసీ కంపెనీలతో కుమ్మక్కయి మందుల్ని ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముతున్నా యన్నారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు ఇతర దేశాలకు ఎంతమంది వెళ్తున్నారో అనేది విద్యకు ప్రాతిపదిక కాదన్నారు. విద్యను ప్రాథమిక స్థాయిలో బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేవన్నారు.

# ఎస్టీ ధ్రువీకరణ పత్రాలివ్వడం లేదు..!

**జీరో అవర్**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో సుమారు 40 మంది ఎస్టీ కుటుంబీకులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే చిరంజీవులు కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం జరిగిన జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు పలు సమస్యల్ని ప్రస్తావించారు. ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల్ని వినియోగించుకోలేకపోతున్నారని, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందలేకపోతున్నారని చిరంజీవులు తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలో 50 శాతానికి పైగా బిసిలున్నారని, ఆ ప్రాంతంలో బిసి రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేస్తామని గతంలో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీని వెంటనే అమల య్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ కోరారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గానికి చెందిన సుమారు 30 మంది ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయులు తెలంగాణా రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారని సెలవుల మంజూరు, ఇతర అంశాల్లో వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వీరి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వెంకటరమణమూర్తి కోరారు. యలమంచిలి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బి రోడ్లు వేయాలని, ఆ ప్రాంతంలో రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకుని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే రమేష్‌బాబు తెలిపారు. సిఆర్‌డిఎ గ్రామాల్లో వెయ్యి గజాల్లో నిర్మాణాలు చేపట్టడానికి సుమారు రూ.30 లక్షలు ఫీజు వసూలు చేస్తున్నప్పటికీ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల్ని మాత్రం కల్పించడలేదని, సంబంధిత గ్రామాల్లో వచ్చిన ఫీజులో కొంత గ్రామాభివృద్ధికి వినియోగించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కోరారు. దీర్ఘకాలంగా ఎసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని ఎమ్మెల్యే రాజు కోరారు. పాడేరు నియోజకవర్గంలోని నిరుపేదలైన జర్నలిస్టు లకు ఇళ్లు కేటాయించాలని గిడ్డి ఈశ్వరి కోరారు. నంది గామ నియోజకవర్గంలోని తిమ్మాపురం గ్రామానికి రోడ్డు వసతిలేక ఇబ్బందులు పడుతు న్నారని, వర్షాకాలంలో ఈ గ్రామానికి చుట్టు పక్కల గ్రామాలతో సంబంధాలు తెగిపోతాయని, ఈ గ్రామానికి వెంటనే రోడ్లు వేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు.

**రైతులపై కేసులా...**

సారా కేసులకు సంబంధించి తయారీదారులు, అమ్మకందారులతో పాటు పొలం కౌలుకిచ్చిన రైతులపైనా అధికారులు కేసులు పెడుతున్నారని, అదే మద్యం దుకాణాలపై ఎటువంటి కేసులు నమోదు చేయడం లేదని ఎమ్మెల్యే వెంకటేష్ తెలిపారు. కౌలుకు తీసుకున్న వారు సారా తయారీ చేపడితే రైతు ఎలా బాధ్యత వహిస్తాడని ఆయన ప్రశ్నించారు. బెల్టు షాపులకు డైరెక్ట్‌గా మద్యం సరఫరా చేసే యజమానులపై మాత్రం ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడంలేదన్నారు. సారా అమ్మకందారులు, తయారీదారులపైనే చర్యలు తీసుకోవాలని, అదే విధంగా బెల్ట్ షాపులకు సరఫరా చేసే దుకాణ యజమానులపైనా కేసులు నమోదు చేయాలని వెంకటేష్ కోరారు. దళితులకు భూమి పథకం ద్వారా 2.86 ఎకరాలకు దరఖాస్తు చేసుకున్న ఆరుగురు దళిత రైతులకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కల్పన తెలిపారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత ఎనిమిది నెలలుగా ఫైల్ పెండింగ్‌లోనే ఉందని, సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. దళిత తేజం పథకంలో భాగంగా రోడ్లు వేయడానికి, గ్రామాల్లో ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో ప్రస్తుతమున్న నియోజకవర్గ నిధుల్ని రూ. 2 కోట్లు నుంచి రూ.4 కోట్లకు పెంచాలని ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, అనంతలక్ష్మి కోరారు. కృష్ణపట్నం పోర్టు పరిసర గ్రామాల్లో ఇసుకమేట వల్ల మత్స్యకారులు వేటకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, అక్కడ వెంటనే జట్టీ నిర్మించడంతో పాటు మినీ ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి కోరారు. విశాఖ హార్బర్‌లో నాలుగో తరం వారికీ వంశపారంపర్య ఉద్యోగాల కల్పనకు జీవో 697ను పునరుద్ధరించి, వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాసరావు కోరారు.

## ప్రశ్నోత్తరాలు

### కౌలు రైతులకు రుణాలందడం లేదు

**టిడిపి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్**

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ఉన్న కౌలు రైతుల్లో అధిక శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బిసి కౌలు రైతులే ఉన్నారని, వీరికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలు సరిగా అందడం లేదని టిడిపి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. రుణాలందక, పంటలకు గిట్టుబాటు ధరలు లేక వారు ఆర్థికంగా సతమతమవుతున్నారన్నారు. వీరికి రుణాలివ్వడానికి బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదన్నారు. ఫలితంగానే ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రతి కౌలు రైతుకీ రుణాలందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరంలో ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించినా, 3.5 శాతం కంటే మించి రుణాలివ్వడం లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అన్నారు. లక్ష రూపాయల వరకు ఇవ్వాల్సి ఉండగా కంటితుడుపు చర్యలుగా రూ. 50 నుంచి 60 వేల వరకే ఇస్తున్నారన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరికరాల్లేవు

**పిడిఎఫ్ ఎమ్మెల్సీలు యండపల్లి, సూర్యారావు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్‌రేలు, ఇతర వైద్య పరీక్షలు చేసేందుకు ఎక్స్‌రే ప్లాంట్‌తో పాటు ఎటువంటి వైద్య పరికాలూ లేవని పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డి అన్నారు. రిమ్స్‌లో రోజుకి సుమారు 1500 నుంచి 2 వేల మంది ఔట్ పేషెంట్లు వస్తుంటారని, అక్కడ వీరికి వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలు లేకపోవడంతో వైద్యం సరిగా అందడం లేదన్నారు. వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారన్నారు. ఇది పేద పేషెంట్‌లకు భారంగా మారుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల కోసం ప్రత్యేకంగా నిధుల్ని కేటాయించాలన్నారు. అద్దంకిలో 20 ఏళ్లుగా ఎక్స్‌రే మిషన్‌లు లేవని టిడిపి ఎమ్మెల్సీ కరణం బలరామ్ అన్నారు. వీటిని పునరుద్ధరించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిపాలనా అధికారుల నియామకాలకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, ఇంత వరకూ నియామకాలు చేయలేదన్నారు. నాన్ మెడికల్ అధికారుల్ని పరిపాలనా అధికారులుగా నియమించాలన్నారు. అనంతపురం జిల్లా మడకసిరలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని టిడిపి ఎమ్మెల్సీ తిప్పేస్వామి కోరారు. మంత్రి యనమల రామకృష్ణుడు బదులిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 63వేల వైద్య పరికరాలుంటే, వాటిల్లో 43వేల పరికరాలకే మరమ్మతులు చేశామన్నారు. పారామెడికల్ పోస్టుల్ని కూడా భర్తీ చేస్తామన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లదే సమస్యగా ఉందని, వీరి నియామకాల పై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

### స్థలం లేని వారికి ఇళ్లు నిర్మించాలి

**స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి**

ఇల్లే కాదు, స్థలం కూడా లేని పేదలు అనేక మంది ఉన్నారని, వీరికి స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇవ్వాలని స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి అన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి కూడా మంజూరు చేయడం లేదని, ఏదో ఒక సాకు చెప్పి ఆపేస్తున్నారని మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి అన్నారు. 2014 కంటే ముందు మంజూరు చేసిన లక్షలాది ఇళ్లు నిర్మాణ దశలో ఆగిపోయాయని, వీటిని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని, లేనిపక్షంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని టిడిపి ఎమ్మెల్సీ కరణం బలరామ్ సూచించారు.

### విశ్వవిద్యాలయాల ప్రగతి దిగజారుతోంది

**పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు**

విశ్వవిద్యాలయాల్లో ప్రగతి దిగజారుతోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు విమర్శించారు. విశ్వవిద్యాలయాలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ విభాగాల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయడానికి ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ప్రొఫెసర్ పోస్టులతో పాటు విశ్వవిద్యాలయాల్లోని అన్ని పోస్టుల నియామకాల్లో ముస్లింలకు అవకాశం కల్పించాలని, భర్తీలో రిజర్వేషన్లు పాటించాలని టిడిపి ఎమ్మెల్సీ ఎంఎ షరీఫ్ అన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఉర్దూ విభాగానికి చెందిన ఫ్యాకల్టీ పోస్టుల్ని వేరే డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ముస్లిం మైనారిటీల్లో చదువుకునే వారు బాగా తగ్గిపోతున్నారని మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు అన్నారు. విద్యా సంస్థల్లో వీరి సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏకీకృత సర్వీసు నియామకాలకు సంబంధించి కోర్టు బయటే పరిష్కారించేందుకు ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఏకీకృత సర్వీసు నియామకాలపై అంతా గజిబిజి గందరగోళంగా ఉందన్నారు. ఏజెన్సీ ఏరియాల్లో రేషన్ షాపుల సుదూరంలో ఉంటున్నాయని, ప్రతి గూడెంలో ఒక రేషన్ షాపును ఏర్పాటు చేయాలని టిడిపి ఎమ్మెల్సీ సంధ్యారాణి అన్నారు. అనేక గిరిజన గ్రామాల్లో బయోమెట్రిక్ ముద్రలు పడటం లేదని, దీంతో గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గిరిజన కుల ధ్రువీకరణ పత్రాలు సరిగా అందడం లేదని ఫిర్యాదులు అందాయని, ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మరో ప్రశ్నకు మంత్రి నక్కా ఆనంద్ బాబు సమాధానం చెప్పారు.



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

# పోలవరం ప్యాకేజీలో లోపాలు

**పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్**

ప్రభుత్వం ప్రకటించిన పోలవరం ప్యాకేజీలో లోపాలున్నాయని పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ అన్నారు. ప్యాకేజీ కోసం సర్వే నిర్వహించిన అధికారులు తప్పులతడకగా చేపట్టడం వల్ల నిర్వాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఉదయం శాసనసభ స్పీకర్ కోడెల శివ ప్రసాదరావు ప్రశ్నోత్తరాలతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులు మొడియం శ్రీనివాస్ మాట్లాడుతూ సర్వే చేసిన సమయంలో నిర్వాసితులు ఉద్యోగం, వ్యాపారాల కోసం వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు వారిని ప్యాకేజీలో లేకుండా చూపారన్నారు. దీంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. 2013 ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం రూ. 2 లక్షలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీనివల్ల చిన్న ఇల్లు మాత్రమే నిర్మితమవుతోందన్నారు. సరైన ఇల్లు నిర్మించుకోవాలంటే కనీసం రూ. 5 లక్షలు ఇవ్వాల్సిన అవసరముందన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌విఎస్‌ఎన్ వర్మ మాట్లాడుతూ 2019 కల్లా ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటిస్తున్న కేంద్రం ఏ విధంగా నిధులిచ్చి పూర్తి చేస్తుందో చెప్పాలన్నారు. జరుగుతున్న పనికి తగినట్లుగా నిధులు విడుదల చేస్తామంటున్న కేంద్రం ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.33,000 కోట్లు రాష్ట్రానికి ఎప్పుడిస్తుందో తెలియజేయాలన్నారు. ఈ అంశంపై మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం డ్యాం ప్రాంతాల్లో గ్రామాల్ని ఖాళీ చేయించేందుకు ముగ్గురు సిఎంలు ప్రయత్నించినా సాధ్యంకాలేదన్నారు. రూ. 128 కోట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం రూ.60 వేల కోట్లకు చేరుకుందన్నారు. 2019 కల్లా ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికి 53 సార్లు సమీక్షలు నిర్వహించామన్నారు. తాము చేపట్టే పనులకు సంబంధించిన అన్ని వివరాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి పంపుతున్నామన్నారు.

**ఆటో డ్రైవర్లకు అపరాధ రుసుమా : బొండా,రామకృష్ణబాబు**

మెమో నెం.81/ఆర్/2017 ప్రకారం పట్టణాల్లో తిరిగే ఆటోడ్రైవర్లకు రోజుకు రూ. 60 అసరాధ రుసుంను విధించడం దారుణమని సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, రామకృష్ణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఏడాదికి వారిపై రూ.8,000 అదనపు భారం పడుతోందన్నారు. అపరాధ రుసుం కట్టే డ్రైవర్లు నిరుపేదలని, చదువుకుని ఉద్యోగం పొందని పరిస్థితుల్లో ఆటోలను నడుపుకుంటూ జీవిస్తున్నవారు అనేకమంది పట్టణాల్లో ఉన్నారన్నారు. వీరి వద్ద డబ్బులు వసూలు చేయడం అన్యాయమన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తోందన్నారు. మరోవైపు వారికి డ్రైవింగ్ లైసెన్స్ రావడం కూడా చాలా ఇబ్బందిగా మారుతోందన్నారు. పదో తరగతి చదివిన ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే తప్ప లైసెన్స్ పొందే వీలు లేదన్నారు. అదే విధంగా పెట్రో, డీజిల్ ధరల రేట్లు అధికంగా పెరగడం కూడా వారిని గందరగోళానికి గురి చేస్తోందన్నారు. ఈ అంశంపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు పదోతరగతిలో జాయిన్ అయితే సరిపోతోందని, కనీసం ఎనిమిదో తరగతి పాస్ అయితే సరిపోతుందన్నారు.

**గాజుల దిన్నె ప్రాజెక్టుకు మరమ్మతులు : మంత్రి దేవినేని**

దాదాపు 4.5 టిఎంసిల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల నిర్వహణకు మరమ్మతులు చేపట్టనున్నట్లు జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎమ్మిగనూరు, కర్నూలు, డోన్ నియోజక వర్గాల్లో తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. ఈ సీజన్‌లోనే స్లూయిజ్ నిర్మాణం పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామన్నారు. అయితే అవగాహన లేని జగన్ మాత్రం తాను అధికారంలోకొస్తే గాజుల దిన్నె ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గాజుల దిన్నె ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యిందన్నారు. మైనారిటీ సంక్షేమానికి సంబంధించి సభ్యులు చాంద్‌పాషా మాట్లాడుతూ మైనారిటీలకు బ్యాంక్ లింకేజీ లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. ఈ విషయంపై బ్యాంకర్లతో మాట్లాడి రుణసదుపాయాన్ని కల్పించాలని కోరారు. అలాగే శ్మశానవాటికల్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా రూ. 1100 కోట్లు మైనారిటీల కోసం కేటాయించిందన్నారు. వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాల్ని చేపడుతున్నామని, అయితే ఖర్చు మాత్రం తక్కువగా ఉందన్నారు. దీనిపై సమావేశం ఏర్పాటు చేసి వివరంగా చర్చిస్తామన్నారు.

**డ్రైనేజీవ్యవస్థను మెరుగుపరచాలి: గద్దె, బొండా**

విజయవాడలో డ్రైనేజీవ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని సభ్యులు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం వైపు కంటే ప్రజల అవగాహన లోపం అధికంగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. డ్రైన్ల ద్వారా చెత్త అధికమైపోతోందన్నారు. తూర్పు నియోజకవర్గంలో దాపాపు 17,443 మ్యాన్‌హోల్స్ ఉన్నాయని, వాటిద్వారా ఎప్పుడూ చెత్త చెదారం నిండిపోతోందన్నారు. మరోవైపు సూర్యారావు పేటలోని ఆసుపత్రుల నుంచి వ్యర్థ పదార్థాలు అధికంగా వస్తాయని, డ్రైన్లలో చెత్త వేయకుండా ఆసుపత్రి సిబ్బందికి ప్రభుత్వం అవగాహన కల్పించాలన్నారు.

## కలుషిత ఆహారం తిన్న 30 మంది విద్యార్థినులకు చికిత్స

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు పరామర్శ**

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ (విజయవాడ)**



కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురైన ఎపి రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు 30 మంది చికిత్స పొందుతున్నారు. విజయవాడలోని కొత్త ప్రభుత్వాసుపత్రిలో 12 మంది, ఆంధ్రా ఆసుపత్రిలో 18 మందికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, ఎటువంటి ప్రాణాపాయం లేదనీ వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, నాయకులు దోనేపూడి కాశీనాథ్ మంగళవారం పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. విద్యార్థినులను ప్రైవేటు కార్యక్రమాలకు పంపడం సరికాదని, హాస్టల్ విద్యార్థులకు బయట మెస్‌లో కాకుండా హాస్టల్ ప్రాంగణంలోనే వంట గదులు ఏర్పాటు చేసి అక్కడే వండిన ఆహారం పెట్టాలని అన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థినులను పరామర్శించిన వారిలో సిపిఎం నాయకులు విష్ణువర్థన్, ఎస్‌ఎఫ్‌ఐ సిటీ సెంట్రల్ కార్యదర్శి సిహెచ్.సుమంత్ తదితరులు ఉన్నారు.

## డైట్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

**ప్రజాశక్తి- పాలకొండ (శ్రీకాకుళం జిల్లా)**

శ్రీకాకుళం జిల్లా పాలకొండ పట్టణానికి చెందిన డైట్ విద్యార్థిని పాలక పావని(19) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక డిఇడి కళాశాలలో ఆమె ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె నరసన్నపేటలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న తన సోదరి శిరీషతో కలిసి ఉంటోంది. శిరీష విధులు ముగించుకొని ఇంటికొచ్చే సమయానికి తలుపులు మూసి ఉండడంతో, వెనుక వైపు నుంచి వచ్చి చూసే సరికి పావని రక్తపుమడుగులో పడి ఉంది.

పావని గొంతుపై తీవ్ర గాయం ఉండడంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి మంగళవారం తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌పి త్రివిక్రమవర్మ పరిశీలించారు. మృతురాలి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దర్యాప్తును వేగవంతం చేయాలని డిఎస్‌పి స్వరూపరాణిని ఆదేశించారు.

# మే 7న నన్నయ సెట్

- 14 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 13 సెంటర్లలో పరీక్ష

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2018 నోటిఫికేషన్‌ను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలు నాయుడు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నన్నయ యూనివర్సిటీతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు, కాకినాడ, తాడేపల్లిగూడెంలోని పిజి సెంటర్లలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివే విద్యార్థుల కోసం నన్నయ సెట్ 2018 సీట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆర్ట్స్‌లో 14 పిజి కోర్సులు, సైన్సులో 17 పిజి కోర్సులకు సంబంధించి ఎంట్రన్స్ పరీక్ష జరుగుతుందన్నారు. 6,207 సీట్లకు సంబంధించి ఆర్ట్స్‌లో 2,670 సీట్లు, సైన్సులో 3,535 సీట్లు ఉన్నాయన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంట్రన్స్ ఫీజు రూ.500 చెల్లించాలని, ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్ విద్యార్థులు రూ.300 చెల్లించాలన్నారు. గడువులోగా దరఖాస్తు చేయనివారు అపరాధ రుసుము రూ.500 చెల్లించి ఏప్రిల్ 23 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంట్రన్స్ రుసుమును ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో సమస్యలుంటే ఏప్రిల్ 18వ తేదీ నుంచి 24వ తేదీలోగా పరిష్కరించుకోవాలని కోరారు. మే 7, 8, 9 తేదీల్లో నన్నయ సెట్ 2018 ఎంట్రన్స్ టెస్ట్ జరుగనుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, భీమవరం, ఏలూరు, జంగారెడ్డిగూడెం, రంపచోడవరం, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం ప్రాంతాల్లోనూ, నన్నయ విశ్వవిద్యాలయం, కాకినాడ, తాడేపల్లిగూడెం పీజీ సెంటర్లలోనూ పరీక్ష జరుగనుంది. మే 10వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. జూన్ 18 నుంచి అడ్మిషన్ల ప్రారంభించి క్లాసులు కూడా ప్రారంభిస్తారు. మే ప్రవేశ పరీక్షకు సంబంధించి ఒకటో తేదీ నుంచి హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో పొందొచ్చు.



నన్నయ సెట్ 2018 నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న విసి ముత్యాలు నాయుడు

## పరిశోధనలను పటిష్టపరచాలి

**ఆర్కియాలజీ సదస్సు ముగింపులో కోడెల**

**ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు)**

మన సంస్కృతి భావితరాలకు తెలియజెప్పేందుకు పరిశోధనలతో పటిష్ట పరచాలని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పురావస్తు - మ్యూజియమ్స్ కమిషనరేట్, పూణే డెక్కన్ కాలేజ్ డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న 'పురావస్తు సంరక్షణ- దక్షిణాసియాలోని బృహత్‌శిలాయుగ సంస్కృతుల అధ్యయనం' సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోడెల మాట్లాడుతూ తరుగుతున్న సంస్కృతీ సంప్రదాయాలను పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ఏరియాలో తవ్వకాల వల్ల అనేక సంస్కృతీ సంప్రదాయాల అవశేషాలను కనుగొన్నట్లు చెప్పారు. మానవుని మూలాలు ఆఫ్రికాలో ఉంటాయని భావించినా కర్నూలులో లభించిన ఆధారాలను పరిశీలిస్తే ఇక్కడా ఉన్నట్లు చెప్పవచ్చని పేర్కొన్నారు. సదస్సుకు 66 పరిశోధనా పత్రాలు వచ్చినట్లు ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్ కమిషనర్ డాక్టర్ జి.వాణీ మోహన్ తెలిపారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి - రాజంపేట(కడప)**

భూ సమస్య పరిష్కరించ లేదని ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన స్థానికులు రెవెన్యూ సిబ్బంది హుటా హుటిన ఆమెను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సకాలంలో స్పందించి వైద్య పరీక్షలు చేయడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను తిరుపతికి రుయాకు తరలించారు. ఈ సంఘటన కడప జిల్లా రాజంపేట ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘట పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు.

సంపాదకీయం

# ట్రంప్ వాణిజ్య యుద్ధం

ప్రపంచాధిపత్యం కోసం అనేక దేశాల్లో ఇప్పటికే సైనిక జోక్యం చేసుకుంటున్న అమెరికా ఇప్పుడు వాణిజ్య రంగంలో సరికొత్త యుద్ధాలకు తెర తీస్తున్నది. అగ్ర రాజ్య ఉగ్ర నేత డొనాల్ట్ ట్రంప్ ఉక్కు దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం దిగుమతులపై 10 శాతం సుంకాలు పెంచుతూ డిక్రీ జారీ చేయడమే గాక, 'వాణిజ్య యుద్ధాలైతేనే మంచిది, సులువుగా గెలవచ్చు' అని వ్యాఖ్యానించడంపై ప్రపంచ నలుమూలల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ వాణిజ్య యుద్ధంలో ప్రధాన లక్ష్యం చైనా అయినప్పటికీ భారత దేశం కూడా నష్టపోతుంది. అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ ఇటీవల ఇథియోపియాలోని ఆఫ్రికన్ యూనియన్ ప్రధాన కార్యాలయంలో చేసిన ప్రసంగంలో చైనాతో ఒప్పందాలు ఆఫ్రికా దేశాల సార్వభౌమత్వానికే ముప్పు అని వ్యాఖ్యానించడం, ఆ తరువాత కొద్ది రోజులకే ట్రంప్ వాణిజ్య అస్త్రాన్ని ప్రయోగించడం ఇదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతోంది. ట్రంప్ చర్యలను చైనాయేకాదు, అమెరికాకు మిత్ర పక్షంగా వున్న యూరోపియన్ యూనియన్, కెనడా, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనికి ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించాయి. ఈ చర్యల ద్వారా అమెరికా తాను నెలకొల్పిన వ్యవస్థలను తానే నాశనం చేస్తున్నదని ప్రముఖ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ వ్యాఖ్యానించడం విశేషం.

1930లలో చోటుచేసుకున్న మహా ఆర్థిక మాంద్యం నుంచి బయటపడేందుకు ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కోసం ఆనాడు సామ్రాజ్యవాద దేశాలు పోటీపడ్డాయి. అది చివరికి తీవ్ర వాణిజ్య ఘర్షణలకు దారి తీసింది. ఈ ఘర్షణలు పెట్టుబడిదారీ వ్యవస్థ మూలాలనే దెబ్బతీసే స్థితికి చేరాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రత్యర్థి కూటముల మధ్య ఘర్షణలను నివారించి, ప్రపంచాధిపత్యం సాగించేందుకు అమెరికాకు నూతన అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ అవసరమైంది. ఆ క్రమంలోనే బ్రిటన్ వుడ్స్ కవలలుగా పేరొందిన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటిఓలు అవతరించాయి. ఈ ద్రవ్య సంస్థలు, అవి ముందుకు తెచ్చిన ప్రపంచీకరణ విధానాలు అమెరికా ప్రపంచాధిపత్యానికి, మార్కెట్ విస్తరణకు ఉపయోగకరంగా వున్నంతవరకు వాటిని నెత్తిన పెట్టుకుని అమెరికా ఊరేగింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు సంక్షోభంలో పడడంతో ట్రంప్ రక్షణాత్మక చర్యలను ఆశ్రయిస్తున్నారు. ఒబామా ప్రభుత్వం కుదుర్చుకున్న ట్రాన్స్ పసిఫిక్ ఒప్పందాన్ని ఇదే కారణంతో ట్రంప్ రద్దు చేశారు. ఈ ఒప్పందం రద్దువల్ల ప్రధానంగా నష్టపోతున్న జపాన్ అమెరికాపై ఆగ్రహంతో ఉన్నది. ట్రంప్ చర్యల వల్ల 1930ల నాటి పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదముందని సాక్షాత్తూ డబ్ల్యుటివో అధిపతి రాబర్టో అజ్వెడోనే వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న చైనాతో వాణిజ్య యుద్ధం వల్ల అమెరికాకే నష్టమని ఆర్థికవేత్తలు, వాణిజ్య విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా చర్యకు ప్రతీకారంగా ఇతర దేశాలు అమెరికా ఎగుమతులపై సుంకాలు పెంచితే దాని ప్రభావం చాలా తీవ్రంగా వుంటుందని భావిస్తున్నారు.

సుంకాల పెంపు ద్వారా ప్రత్యర్థి దేశాలపై ఓ పెద్ద ఆర్థిక క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించానని సంబరపడుతున్న ట్రంప్‌కు అసలు వాస్తవం బోధపడడం లేదు. ఉక్కు, అల్యూమినియం దిగుమతి సుంకాలు పెరగడం వల్ల ఆ లోహాలను ఉపయోగించి ఉత్పత్తి చేసే వస్తువుల ధరలు బాగా పెరిగితే, ఆ భారం వినియోగదారులపై పడుతుంది. అమెరికా ఎగుమతులకు కొత్తగా మార్కెట్లను వెతుక్కోవాల్సి వస్తుంది. అవి ధర ఎక్కువై అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముడుపోకపోతే ఆ కంపెనీలు మూతపడతాయి. దాని ప్రభావం ఉపాధి మీద పడుతుంది. అంతే కాదు అమెరికా ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరిగిపోతే ఇప్పటికే భారీగా వున్న వాణిజ్య లోటు మరింత పెరిగిపోతుంది. ఇదంతా ఒక విష వలయం. దేశీయ ఉక్కు పరిశ్రమలకు గిరాకీ, అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే తాను ఈ చర్య తీసుకున్నానని ట్రంప్ చేస్తున్న వాదన పూర్తిగా నిర్హేతుకమైనది. ఈ సుంకాల పెంపునకు నిరసనగా ట్రంప్ ప్రధాన ఆర్థిక సలహాదారు, గోల్డ్‌మన్ సచెస్ మాజీ ఎగ్జిక్యూటివ్ గారీ కాన్ ఇప్పటికే ఆ పదవి నుంచి వైదొలిగారు. వాణిజ్య యుద్ధాల్లో ఓడేవారేగానీ గెలిచేవారెవరూ ఉండరన్న విషయం ట్రంప్‌కూ ఆయన ఆర్థిక సలహాదారులకూ తెలిసినప్పటికీ ఈ యుద్ధాలకు దిగుతున్నారంటే దానికి కారణం ప్రపంచ ఆర్థిక సంక్షోభం సృష్టించిన పరిస్థితే. రీగన్, థాచర్ అడుగుజాడల్లో నయాఉదారవాద ప్రపంచీకరణ అమలులోకి వచ్చిన తరువాత సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు చాలా వరకు సద్దుమణిగాయి. వర్థమాన దేశాలను దోచుకోవడంలో ఈ దేశాలు కలిసికట్టుగా వ్యవహరిస్తూ తమ మధ్య తగాదాలను గుంభనంగా ఉంచాయి. కానీ 2008 ఆర్థిక సంక్షోభం తరువాత నేడు వాటిమధ్య వైరుధ్యాలు బద్దలవుతున్నాయి. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధాలు ఇందులో భాగమే. వీటికి అడ్డుకట్ట పడకపోతే చాలా తీవ్రమైన దుష్ప్రభావాలను ప్రపంచం చవిచూడాల్సి వస్తుంది.

ఇదీ విషయం



స్వచ్ఛమైన త్యాగధనులు
సాగించిన ఉద్యమమది...
పుడమితల్లి ప్రియపుత్రులు
సాధించిన విజయమది!

ఆకలి తీర్చే నేలకు
ప్రణమిల్లని ప్రాణి లేదు!
మట్టిమనిషి పట్టుదలకు
తలవంచని రాజు లేదు...

- కొల్లూరు వెంకట్

# మట్టి పాదాల మహా సందేశం

విశ్లేషణ



డా॥ ప్రసాదమూర్తి

ఆదివారం రాత్రి, అంటే మార్చి 11వ తేదీ రాత్రి ముంబైలో జె.జె.ఫ్లైవోవర్ ఉన్నట్టుండి ఒక కాంతి ప్రవాహంలా మారిపోయింది. కెరటాలు కెరటాలుగా ధగధగల శోభతో అది ఆ వాణిజ్య నగరం నడుం చుట్టూ ఎర్రగా చుట్టుకుని పక్కనే వున్న సముద్రాన్ని చుట్టం చూపుగా పలకరించింది. ఆ దృశ్యానికి మురిసిపోయిన ఆకాశం ఎర్రని నక్షత్రాలు పొదిగిన టోపీలా నగరం తలమీద వాలిపోయింది. ఇదంతా కాళ్ళకి చెప్పులు..తల మీద గొడుగు..వొంటి మీద సరైన గుడ్డలు కూడా లేని అసహాయ కిసాన్ బంధువులు తలపెట్టిన మహాయజ్ఞంలో శిఖరాయమాన ఘట్టంలో ఒక మచ్చు తునక మాత్రమే.

వాస్తవానికి మార్చి 6వ తేదీన నాసిక్‌లో భూమిని చీల్చుకుని కొన్ని పాదాలు మొలకెత్తాయి. అటు చూస్తే తీరని అప్పులు..ఇటు చూస్తే బిడ్డల ఆకలి..ఎటు చూసినా దిక్కు తోచని బతుకు ఎడారి. అయిదేళ్ళకోసారి కురిసే వాగ్దానాల వర్షం మండిపోతున్న తమ జీవితాల మీద చరచరా కురిసి చురచురా ఆవిరైపోవడమే తెలుసు. కడుపు మండి.. పొలాలు ఎండి ..ఎముకలు పగలి.. జీవితాలు కుళ్ళి ఎప్పుడైనా నాలుగు పాదాలు కలిసి రోడ్డెక్కితే అప్పటికప్పుడే మళ్ళీ వాగ్దానాలు. మళ్ళీ ఆశ. మళ్ళీ పగుళ్ళిచ్చిన కాళ్ళతో పగుళ్ళిచ్చిన పొలాల్లోకి కప్పులు లేని గుడిసెల్లోకి.. పేగులు ఖాళీ చేసిన పొట్టల్లోకి ముడుచుకుపోవడమే. ఎన్నాళ్ళిలా.. ఎన్నేళ్ళిలా..? లాభం లేదు. విత్తనాల్లాగా బతుకు కూడా పురుగులు పట్టి పుచ్చిపోయింది. ఈ నేలలో తమను తాము తలకిందులుగా పాతుకుంటే తప్ప ఈ దేశంలో మొలకెత్తాల్సినవి మొలకెత్తవు. అవును పాదాలే మొలకెత్తాలి. పాదాలే. మట్టి పాదాలు. భూగోళం ఈ చివర నుంచి ఆ చివర దాకా శతాబ్దాలుగా పరుగులు తీసిన పాదాలు. మట్టి పిసికి ..మట్టిలో కలలు కలిపి..నెత్తురు, చెమట, ఎరువు చేసి యుగాలు సాగు చేసిన ఫలితంగా దేశం బహుమానంగా మిగిల్చిన నగ్నత్వానికి నమస్కారం పెడుతున్న పాదాలు. ఎండు గడ్డి పరకలు కూడా ఎర్రని కత్తుల్లా కోసి పారేసిన పాదాలు.

నాసిక్‌లో కడసారి తెగింపుతో మట్టిని చీరి చీరి పొద్దుపొడుపులా పొడుచుకొచ్చిన పాదాలు ఒక్కసారిగా కదిలాయి. కదలడం తప్ప మరో గత్యంతరం లేక కదిలాయి. వెనక వదిలేస్తున్నందుకు బాధపడ్డానికి వెనకేమీ మిగలని పాదాలు. నెత్తిమీద మోసుకుపోవడానికి మెతుకులెండిన కుండలు.. డొక్కలెండిన బిడ్డలు తప్ప మరేమీ మిగలని పాదాలు. వెనక శూన్యం ముందు శూన్యం. ఎటు పోవాలో తెలీని దైన్యం. అయినా ముందుకే పోవడంలో ఒక అర్థం వుందనుకుని నమ్మి ముందుకు కదిలిన పాదాలు. గడ్డలు కట్టిన చీకటిలాంటి పాదాలు. వెలుగు కోసం కొండలనైనా ఢీకొట్టాలని నిర్ణయించుకున్న పాదాలు. దేశం దేశమే తమకు అప్పుపడిన చరిత్రను కానలేని నిస్సహాయ పాదాలు, తమ అప్పు మాఫీ చేయమని పాలకులను ప్రాధేయపడ్డానికి కదిలాయి. తరాలుగా ఏ మట్టిని కప్పుకుని ఏ మట్టికి పరిమళమై నిలిచారో ఆ మట్టికి తమను హక్కుదారులుగా ప్రకటించమని పాలకుల పాదాలు పట్టుకోడానికి కదిలిన పాదాలు. 180 కిలోమీటర్లు ఒక లెక్క కాదు. కానీ ఒక లెక్క ప్రకారం కదిలాయి. ఆకలేస్తే.. దాహమేస్తే.. నిద్ర వస్తే..పాదాలు బొబ్బలెక్కి చర్మాలు పొరలు పొరలుగా ఊడిపోతే నడిచే దారి పక్కే మట్టిపక్కలు పరచుకున్నారు. దొరికిన కాయోపండో పంచుకున్నారు. ఏ పుణ్యాత్ములో దయతల్చితే గుక్కెడు నీళ్ళు కడుపుల్లో పోసుకున్నారు. మండుటెండో.. చీకటో.. చలో.. అన్నీ తమతో పాటు తమకు మద్దతుగా కలసివచ్చిన చుట్టాలే అనుకున్నారు.



కమ్యూనిజానికి అస్తమయం లేదు. ఒక చోట దారి తప్పినట్టు కనిపించినా మరో చోట మరో రూపంలో ఊపిరి పోసుకుంటుంది. ఎన్నికల్లో ఓటమిని చూసి.. విగ్రహాలను కూల్చి.. ఇంకేముంది ఈ దేశంలో కమ్యూనిస్టుల పని అయిపోయిందని నాలుకలు చప్పరించేసిన వారికి ఈ నెత్తుటి పాదాల మహా యాత్ర ఒక కనువిప్పు. ఏ దేశమైనా.. ఏ ఖండమైనా శ్రమజీవుల నేస్తం ఎర్ర జెండానే. ఓటూ నోటూ రెండద్దాలుగా అమరిన కళ్ళజోడు మేధావులకు కమ్యూనిస్టుల శక్తి అర్థం కాదు.

అవును.. ఇది నిజంగా అన్నదాతల మట్టిపాదాల మహా ప్రస్థానం. చరిత్రలో కనీవినీ ఎరగని ఆకలి ప్రస్థానం. నేతల గుండెల్లో కనపడని వాతల్లా మిగిలిపోయే మట్టి మనుషుల మరో ప్రస్థానం. అఖిల భారత కిసాన్ సభ జెండా కింద వేలాదిగా పోగైన చారిత్రాత్మక ప్రస్థానం. గతంలో మాదిరిగానే ఆదిలోనే అడ్డుకోవాలని పాలకులు విశ్వయత్నాలు విఫల యత్నాలు సాగించారు. మీ డిమాండ్లు నెరవేరుస్తామన్నారు. మీ కలలు పండిస్తామన్నారు. అడుగులు ముందుకు కదపొద్దని వారించారు. ఇదొక రాజకీయ యాత్ర అని, స్వార్థపూరిత యాత్ర అని వాచాలత్వంతో కొట్టిపారేయాలనుకున్నారు అధికార కాషాయ ప్రభువులు. ఎవరో ఎర్ర జెండాల వారు ఎగదోస్తే మండిన మంటగా వర్ణించాలని చూశారు. లేదు ఆకాశం ఒక్కసారిగా ఊడిపడి భగ్గుమన్నట్టు రైతన్నలు ఆగ్రహోదగ్రులై ముందుకే కదిలారు.

దారి తప్పు లేదు. క్రమశిక్షణ తప్పు లేదు. ఎవరికీ అడ్డంకి కాలేదు. దాదాపు రెండు వందల కిలోమీటర్లు సాగిసాగి నడిచి నడిచి పగిలిన పాదాలు ముంబై చేరితే ఆజాద్ మైదానం పులకించిపోయింది. ఒకటే ఆశ. మా అప్పులు మాఫీ చేయండి. మా భూములు మాకివ్వండి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయండి. జీవితాలను చెమట చుక్కలుగా ధారపోసి పండించిన పంటకు కనీస మద్దతు ధర ప్రకటించండి. అయ్యా మీ సింహాసనాలు మీ దగ్గరే వుంచుకోండి. మీ చలువ పందిళ్ళలాంటి సభల్లో మీరే విరాజమానం కండి. మీ స్టార్ హోటళ్ళలో మీరే పండుకోండి. మమ్మల్ని మా మట్టికి అంటించి ఒక వెల కట్టండి. అన్నదాతల చివరి మాటా మొదటి మాటా ఇదే. అంతే ఈ మాట కోసం ఇన్ని మైళ్ళు నడవాలా? ఇన్ని వేల పాదాలు సముద్ర కెరటాలై కదలాలా..? అంటే తప్పదు. తప్పకే ఇంత దూరం కదిలొచ్చామని ఆ మట్టి పాదాలు వాపోయాయి. గత మూడేళ్ళగా ఎన్నో సార్లు ఎన్నో వాగ్దానాలు..ఎన్నో డ్రామాలు చూశాకనే కడసారి తాడో పేడో తేల్చుకుందామనే ముంబైకి వచ్చామని రైతు పాదం తేల్చి చెప్పింది. భగత్ సింగ్ ని బ్రిటిష్ వాడు అడిగాడు ఆనాడు. నువ్వు బాంబు ఎందుకు పేల్చావని. 'బాంబులు పేల్చి విధ్వంసం సృష్టించడం నా మతం కాదు. నాకు సమ్మతమూ కాదు. కాని చెవిటివాడికి కూడా వినిపించేంత శబ్దం చేయాలన్నదే నా ప్రయత్నం' అన్నాడు భగత్ సింగ్. రైతులకూ ఇది తప్పు లేదు. పగిలిపోయిన పాదాల నెత్తుటితో దేశం మొత్తాన్ని అభిషేకం చేస్తేనే కాని తమ గోడు పట్టించుకోరని రైతులు భావించారు. వెయ్యా రెండు వేలు కాదు..ఏకంగా ఏభై వేల మంది ఎక్కడా చిన్ని ఘటన జరగలేదు. కొందరు జబ్బు పడ్డారు. కొందరు ఆసుపత్రుల పాలయ్యారు. కొందరు రేపో మాపో అన్నట్టు తయారయ్యారు. అయినా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేశానికే వ్యాపార కేంద్రమైన నగరాన్ని మట్టి పాదాలు చుట్టుముట్టిన ఈ ఘటన రానున్న రాజకీయాలను తిరగరాసే చరిత్ర కావొచ్చన్న ఆశాభావాన్ని ప్రజాస్వామిక వాదుల గుండెల్లో గూడు కట్టించింది.

సూర్యుడు ఒక చోట అస్తమిస్తే మరొక చోట పొడుస్తాడు. ఈ విషయం స్కూలు పిల్లలకు కూడా తెలుసు. కమ్యూనిజానికి కూడా అస్తమయం లేదు. ఒక చోట దారి తప్పినట్టు కనిపించినా మరో చోట మరో రూపంలో ఊపిరి పోసుకుంటుంది. ఎన్నికల్లో ఓటమిని చూసి ..విగ్రహాలను కూల్చి..ఇంకేముంది ఈ దేశంలో కమ్యూనిస్టుల పని అయిపోయిందని నాలుకలు చప్పరించేసిన వారికి ఈ నెత్తుటి పాదాల మహా యాత్ర ఒక కనువిప్పు. ఏ దేశమైనా.. ఏ ఖండమైనా శ్రమజీవుల నేస్తం ఎర్ర జెండానే. ఓటూ నోటూ రెండద్దాలుగా అమరిన కళ్ళజోడు మేధావులకు కమ్యూనిస్టుల శక్తి అర్థం కాదు. ప్రభుత్వాలను కూల్చినంత ఈజీ కాదు. మందిరాలను పడగొట్టినంత సులభం కాదు. గొడ్డు కోసం మనుషుల్ని గొడ్డుల్లా మార్చి చర్మాలు వొలిచినంత సుళువు కాదు. పీఠాల కోసం విచ్ఛిన్నకారులతోనైనా పీటలు పంచుకునేంత తేలిక కాదు కమ్యూనిజాన్ని అంతం చేయడం. ఎప్పుడు ఏ రూపంలో ఎక్కడ ఎలా ఉదయిస్తుందో ఎర్ర జెండా, కాలమే తేల్చి చెబుతుంది. అమరుల రక్తం వృథా కాదు. ఇప్పుడది కిసాన్ పాదమై దేశం ప్రాచీ దిశ మీద ఎర్రగా పొడిచింది. రేపు ఎక్కడ ఎలా పొడుస్తుందో వేచి చూడాలి. వ్యక్తులు..నాయకులు..పేర్లు..ప్రాంతాలు..కులాలు..మతాలు.. ఏమీ మిగలవు. ఎక్కడ హక్కులు అణచివేయబడతాయో.. ఎక్కడ న్యాయం అమలు కాదో.. ఎక్కడ మనుషులు జంతువుల కంటె హీనంగా చూడబడతారో.. అక్కడ పిడికెడు మట్టి కూడా పొద్దుపొడుపు పువ్వై విచ్చుకుంటుంది. మరాఠా కిసాన్ సోదరులారా మీ నడక..మీ గాయం..మీ సాహసం..మీ త్యాగం వృథా కావు. మీరు నడిచిన దారి పొడవునా రోజుకో కొత్త సూర్యుడు ఈ దేశానికి కొత్త దారి చూపిస్తూనే వుంటాడు. సకలావయవాలు..సదుపాయాలూ ఉన్న సమస్త దేశ వాసులకు మీ నగ్నపాదాలతో మీరిచ్చిన సందేశమే శిరోధార్యం. మీ ఎర్రెర్రని పాదాలకు దండాలు.

( రచయిత సెల్ : 8499866699 )

## నేడు కారల్ మార్క్స్ వర్ధంతి




జననం : 1818 మరణం : 1883


సోషల్ మీడియా

### నమో నారాజీ నాటకం


థ్యాంక్యూ నాయుడు జీ ఈ బ్యాంకు కుంభకోణాలతో నా బుర్ర బద్దలవుతోంది. సభలో చర్చకు రాకుండా మంచి పని చేశారు. మీ రాజీనామాలతో మీడియా దృష్టంతా ఇక ఫ్రంట్‌లు.. ఫ్రంట్‌లంటూ కుంభకోణాలను మర్చిపోయేలా చేస్తాయి.

లేదు లేదు మోడీ జీ మీకే నేను థ్యాంక్స్ చెప్పాలి. నిజంగా ఒడ్డున పడేశారనుకో. లేదంటే నిరుద్యోగులు, రైతులు, మహిళలు టిడిపిపై చాలా కోపంగా వున్నారు. ఓవర్ ఒత్తిడి. ఉద్యోగం మా బాబుకే ఇచ్చానని యువత మండిపోతోంది. రాజీనామాల డ్రామాతో హాయిగా ఉంది. మంచి ఐడియా. థ్యాంక్‌యూ.







### ఓటమి కూడా గెలుస్తుంది



కొన్ని సార్లు ఓటమి కూడా గర్వంతో తలెత్తుకుంటుంది
ఒక గొప్ప వ్యక్తిని కౌగిలించుకునే గొప్ప అవకాశం దక్కినందుకు
కొన్ని సార్లు విజయం కూడా అవమానంతో చచ్చిపోతుంది
ఒక మంచి మనిషిని వొదులుకోవాల్సి వచ్చినందుకు
రాజులా బతికిన రాజులు చాలా మంది ఉన్నారు
కానీ రైతులా బతికిన రాజు ఒక్కరూ లేరు
నాయకునిగా బతికిన నాయకులు ఎంతో మంది
కానీ కార్యకర్తగా బతికిన నాయకులు చాలా తక్కువ
పాలకులుగా బతికిన పాలకులు ఉన్నారు కానీ
ప్రజల్లా బతికిన పాలకులు ఎవ్వరూ లేరు
దాదాపు 20 సంవత్సరాలు ముఖ్యమంత్రి
సొంత ఇల్లు లేదు సొంత కారు లేదు
ఏమీ సంపాదించుకోలేదు
సంపాదించుకున్నది ఏదైనా ఉంది అంటే
కోట్లాది హృదయాల్లో స్థానం మాత్రమే
అందరూ చరిత్రని గుర్తు పెట్టుకుంటారు కానీ
చరిత్ర మాత్రం మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటుంది



సచిన్ ఆరేళ్లలో పార్లమెంటుకు కేవలం 23 రోజులే హాజరయ్యారు. జీతం, ఇతర ఖర్చులకు గాను రూ.59 లక్షల జీతం తీసుకున్నారు.



రేఖ ఆరేళ్లలో పార్లమెంటుకు కేవలం 18 రోజులే హాజరయ్యారు. జీతం, ఇతర ఖర్చులకు గాను రూ.65 లక్షల జీతం తీసుకున్నారు .

మనం ఆఫీసుకు ఇలా వెళ్తే ఉద్యోగం ఊడుతుంది
వీళ్లకు ఇస్తున్న జీతమంతా ఎవడబ్బ సొమ్ము?
తాజాగా కేంద్రం ఎంపీలకు మళ్లీ జీతాలు పెంచింది
మనం పన్నులు కట్టేది ఈ పని లేని ఎంపీలను పోషించడానికా..?

జన వాక్యం

### వారిని చూసైనా నేర్చుకోండి

విజయ్‌మాల్యా, లలిత్ మోడీ, నీరవ్ మోడీ వంటి మోసగాళ్లకు కొదవేలేదు. వీరు బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయలు వాడుకుని, దేశ విదేశాల్లో వ్యాపారాలు చేసినట్లు నమ్మించి, తీరా అప్పు తీర్చే సమయానికి దేశాన్ని వదిలి వెళ్లిపోతున్నారు. ఓ మోసగాళ్లారా... ఒక్కసారి పేదింటి మహిళలను చూసి నేర్చుకోండి! దేశం పట్ల సామాన్య మహిళలకు ఉన్న బాధ్యత కూడా మీకు లేనందుకు దేశం సిగ్గు పడుతోంది. చూశారా... రాష్ట్రంలో డ్వాక్రా మహిళలు బ్యాంకు రుణాలను ఎంత బాధ్యతగా చెల్లిస్తున్నారో..? డ్వాక్రా మహిళలు చిన్నచిన్న వ్యాపారాలకు, ఇంటి అవసరాలకు బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారు. సకాలంలోనే వాటిని చెల్లిస్తున్నారు. బ్యాంకింగ్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వీరికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయల రాయితీలు ఇవ్వలేదు. కనీసం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో చేస్తానన్న రుణమాఫీ కూడా పూర్తిగా చేయలేదు. కానీ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించారు. దేశంలో రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిన ప్రభుత్వాలకు, కార్పొరేట్ ఎగవేతదారులకు బుద్ధి చెప్పేలా రుణాలు చెల్లించారు. 6,28,137 డ్వాక్రా సంఘాల్లో సుమారుగా 70 లక్షల మంది మహిళలు రూ.15,644.02 కోట్లు బ్యాంకు రుణాలు తీసుకున్నారు. వాటిలో సుమారుగా రూ.15,300.00 కోట్లకు పైగా రుణాలు తిరిగి చెల్లించారు. ఇది కదా నిజమైన దేశభక్తి...!

- వి.నాగరాజు, విజయనగరం.

**సవరణ**

**మతం గురించి ఐన్‌స్టీన్ ఏమన్నాడు?**

నిన్నటి దేవరాజు మహారాజుగారి వ్యాసంలో... వాడుకలో ఉన్నట్లుగా 'మతస్తులు' అనే పదాన్ని 'ఒక మతాన్ని నమ్మేవారు' అని అర్థం చేసుకోగూడదు. ఒక మహా శాస్త్రవేత్త ఉద్దేశాన్ని, స్థాయిని కొంతైనా అర్థం చేసుకోవాలని వైజ్ఞానిక స్పృహతో ప్రయత్నించే వారికి, తహతహలాడే వారికి తప్పక అర్థమవుతుంది... అని వుండాలి.

- ఎడిటర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

# అసెంబ్లీ సమావేశాలు జరిగేది ఇలాగేనా?

చర్చ



కంచల జయరాజ్

అసెంబ్లీ సమావేశాలు ఎలాంటి చడీచప్పుడూ లేకుండా సాగుతున్నాయి. బడ్జెట్ సమావేశాలు కావడంతో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. దీనికి అటు తెలుగుదేశం, ఇటు వైసిపి, మరో వైపు బిజెపి బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ అన్ని వర్గాలకు చెందిన కోట్లాది మంది ప్రజల అవసరాలు తీర్చేలా చర్చలు జరగాల్సి ఉంది. దీనికి అధికార పక్షం, ప్రతిపక్షం, మిత్ర పక్షాలు సైతం సానుకూల వాతావరణాన్ని ఏర్పరచుకొని, ప్రజావసరాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇటీవల జరిగే సమావేశాల తీరుతెన్నులు ఆ దిశగా లేవు. అరుపులు కేకలతో విలువైన సమయాన్ని వధా చేసే వారే ఎక్కువయ్యారు. అధికారంలో ఎవరుంటే వారే ఆధిపత్యం చెలాయించే అసాధారణ పరిస్థితుల్ని సష్టిస్తున్నారు. సమస్యను పక్క దారి పట్టించేందుకు ఆపసోపాలు పడేవారే తప్ప, సానుకూల దక్పథంతో, సావధానంగా చర్చించి పరిష్కరిద్దామనే నాయకత్వం చట్టసభల్లో కొరవడింది.

**అవకాశాన్ని జారవిడుస్తోన్న వైసిపి**

బలమైన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి అందివచ్చిన అవకాశాన్ని నిత్యం జారవిడుస్తూనే ఉంది. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడానికి ప్రధాన కారణం ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకోవడం. వారికి మంత్రి పదవులు కట్టబెట్టడం. అయితే దీనికి పరిష్కారం అసెంబ్లీకి దూరంగా జరగడంతోనే వైసిపి వ్యూహం బెడిసి కొట్టింది. 2014 ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసి, తర్వాత కాలంలో టీడీపీలో చేరిన అభ్యర్థులను నియంత్రించాల్సింది ఎవరు? ఎన్నికల సమయంలో వారికి ఓట్లు వేసి గెలిపించింది ఎవరు? ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రశ్నించాల్సింది పోయి, ఎంతో విలువైన, అనువైన సభాక్షేత్రాన్ని విడిచి దూరంగా ఉండటం వైసిపి చేస్తోన్న అతి పెద్ద పొరపాటుగానే భావించాల్సి ఉంది. రాష్ట్రంలో ఎన్నో సమస్యలు తాండవిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలూ అనేక సమస్యలతో సతమతం అవుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకూ భంగం వాటిల్లుతోంది. అధికార పక్షం చేసే చర్యల వల్ల అనేక ఇబ్బందుల్ని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జరిగే అసెంబ్లీ సమావేశాలకు కూడా వైసిపి దూరంగా ఉండటం మరో పెద్ద తప్పిదంగానే భావిస్తున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ప్రజా ఉద్యమాలు సాగుతున్నాయి. ప్రత్యేక హోదా కోసం వైసిపి ఆరంభం నుంచీ కట్టుబడి ఉందని చెపుతున్నారు. అధికార పార్టీ ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోంది. కేంద్రంలో నాలుగేళ్లపాటు క్యాబినెట్‌లో కొనసాగి, బిజెపితో మైత్రీ బంధాన్ని కొనసాగిస్తూ ప్రత్యేక హోదా కాదు, ప్యాకేజీ సరిపోతుందని తేల్చుకొని కూడా ప్యాకేజీ నిధుల్ని కూడా రాబట్టుకోలేని నిస్సహాయ స్థితిలో తెలుగుదేశం పార్టీ ఉంది. కేంద్రం ఇపుడు ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. ఈ పరిస్థితుల్లో ప్రజల పక్షాన పోరాటం చేయడం, అసెంబ్లీలో తీర్మానాలపై చర్చించడం, అధికార పక్షాన్ని నిలదీయడంతో అటు రాష్ట్ర ప్రయోజనాలు, ఇటు పార్టీ ప్రయోజనాలనూ పొందే అవకాశం ఉంది. అయినప్పటికీ సరైన వ్యూహం లేకపోవడంతో వైసిపి అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంది. ఇక్కడిలా ఉంటూ, ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో పోరాటానికి దిగడం వల్ల వచ్చే ప్రయోజనం ఎంత వరకు ఉంటుందో వైసిపి చెప్పాల్సి ఉంది.

**ఇపుడు అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఒంటరి అయ్యింది. మిత్ర పక్షంగా ఉన్న బిజెపి బలమైన ప్రతిపక్షంగా మారింది. వైసిపి కంటే కూడా బిజెపి ఇపుడు తెలుగుదేశంపై కారాలు, మిరియాలు ఎక్కువగా నూరుతోంది. అంతా తెలుగుదేశం పార్టీ స్వయంకృతాపరాధమే.**



**ఏకపక్షంగా టీడీపీ**

బలమైన ప్రతిపక్షం ఉంటేనే అధికార పక్షానికీ నిండుదనం వస్తుంది. అసెంబ్లీలో చేసే వాదనలు నువ్వా నేనా అన్నట్లు ఉంటేనే అధికారపక్షం ప్రజలకు చేసే మేలు గురించి మరింతగా వివరించడానికి వీలు కలుగుతుంది. ప్రతిపక్షంగా ఉన్న వైసిపి సభలకు రాకపోవడాన్ని టీడీపీ సంతోషకరమైన పరిణామంగా భావిస్తోంది. కానీ ఇది ఆ పార్టీకి రాబోయే రోజుల్లో చాలా నష్టం కలుగజేస్తుంది. ఏక పక్షంగా తెలుగుదేశం పార్టీ వ్యవహరించిందని, చేసే చర్చలు, తీసుకునే నిర్ణయాలు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఉన్నాయనే భావన ప్రజల్లోకి వెళ్లకుండా ఆపలేరు. వైసిపి సభల్లో లేకపోతే ప్రశాంతంగా ఉందని టీడీపీ నాయకత్వం సంబర పడుతోంది. అధికార పక్షమూ మేమే, ప్రతిపక్షమూ మేమే అంటూ భుజాలు తట్టుకుంటోంది. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారనే విషయాన్ని విస్మరించకూడదు. వైసిపిని సభల్లోకి వచ్చేలా చేయడంలో కూడా అధికార పార్టీ నామమాత్రమైన పాత్రే పోషించింది. వైసిపి ని సభలకు దూరంగా ఉంచాలనే ముందస్తు వ్యూహంతోనే అధికార పార్టీ వ్యవహరించింది. సభలకు రాకుండా వైసిపి ఎంతటి పొరపాటు చేసిందో, అంతకంటే పెద్ద పొరపాటు తెలుగుదేశం పార్టీ కూడా చేసింది. ఇపుడు రాష్ట్ర ప్రయోజనాలకే భంగం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని కేంద్రం తేల్చి చెప్పింది. 'ఇచ్చింది తీసుకోండి, లేదంటే ఏం చేసుకుంటారో చేసుకోండి' అని మిత్ర పక్షమైన తెలుగుదేశం పార్టీకి సవాలు విసిరింది. ఈ సమయంలో చట్ట సభలో వైసిపి ఉండి ఉంటే... కేంద్రం తీరుపై అసెంబ్లీ చర్చించి, ప్రజల పక్షాన తీర్మానం చేసి, సభను వాయిదా వేసి, కేంద్రంపై వత్తిడి పెంచే దిశగా కార్యాచరణ చేపట్టేందుకు వీలయ్యేది. కానీ ఉభయ పార్టీలవీ రాష్ట్ర ప్రయోజనాల కంటే కూడా రాజకీయ ప్రయోజనాలే ఎక్కువ అవ్వడం వల్ల ఈ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇపుడు అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఒంటరి అయ్యింది. మిత్ర పక్షంగా ఉన్న బిజెపి బలమైన ప్రతిపక్షంగా మారింది. వైసిపి కంటే కూడా బిజెపి ఇపుడు తెలుగుదేశంపై కారాలు, మిరియాలు ఎక్కువగా నూరుతోంది. అంతా తెలుగుదేశం పార్టీ స్వయంకృతాపరాధమే.

**మాట తప్పిన బిజెపి**

రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటను బిజెపి తప్పింది. నాలుగేళ్ల గడిచిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మాట మార్చే సరికి బిజెపికి ఎదురు దాడికి అవకాశం లభించింది. చంద్రబాబు గతంలో ప్రత్యేక హోదా, ప్యాకేజీల విషయంలో ఎలా మాట్లాడారో ఇపుడు బిజెపి వివరంగా చెపుతోంది. ఇప్పటి వరకూ ఇచ్చిన నిధులకు సంబంధించి ఎలాంటి లెక్కలూ తమకు చెప్పలేదని తెలుగుదేశం ప్రభుత్వాన్ని కేంద్ర ఆర్థిక శాఖ తప్పుబట్టింది. ఇవన్నీ ఎలా ఉన్నా ప్రత్యేక హోదాపై మోడీ ఇచ్చిన మాట, వెంకయ్య నాయుడు ఇచ్చిన హామీలను విస్మరించడం ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయమే. ఈ విషయంలో బిజెపి శ్రేణులు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. గణాంకాల గారడీతో రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు. పార్టీల ప్రయోజనాలను దష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి అన్యాయం చేయడం సమంజసం కాదు. బిజెపి రాష్ట్ర నాయకత్వం కూడా చంద్రబాబుపై ఉన్న ఆగ్రహాన్ని రాష్ట్ర ప్రజలపై చూపకుండా, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా నడుచుకుంటే ప్రజలు సంతోషిస్తారు.

( రచయిత 10 టీవీ డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్- విజయవాడ, సెల్ : 8498084059 )





ఎండాకాలంలో శరీరం వడగాల్పులకు గురికాకుండా.. కేవలం నీళ్ళు తాగడం ఒక్కటే పరిష్కారమార్గం కాదు. నీటిశాతం ఎక్కువగా ఉండే ఆహారమూ తీసుకోవాలి. వేసవిలో తప్పనిసరిగా తినాల్సిన పండ్లలో పుచ్చకాయ ఒకటి. సాధారణంగా దీన్ని ముక్కలుగానే తింటుంటాం. కానీ, పుచ్చకాయతో జ్యూస్, హల్వా, స్లష్, ఐస్‌క్రీమ్ వంటి వెరైటీ రుచులెన్నో చేసుకోవచ్చు. చల్లని రుచితోపాటు వేసవితాపాన్ని తగ్గించే గుణాలెన్నో పుచ్చకాయలో ఉన్నాయి. అందుకే.. వాటర్ మిలాన్‌తో మిరాకిల్ అనిపించే రుచులను మీరూ తయారుచేసేయండి మరి!

# వారెవ్వా పుచ్చకాయ

## ఐస్‌క్రీమ్



**కావలసిన పదార్థాలు :** నీళ్లు – పావు కప్పు, చక్కెర – పావు కప్పు, పుచ్చకాయ గుజ్జు – 4 కప్పులు, వెనిల్లా ఫ్లేవర్ పెరుగు – కప్పు, నిమ్మరసం – టీ స్పూను.

**తయారుచేసే విధానం :** నీళ్లలో చక్కెర కలిపి, వేడిచేసి కరిగాక చల్లార్చాలి. వెడల్పాటి గిన్నెలో పుచ్చకాయగుజ్జు వేసి పెరుగు, చక్కెర నీళ్ళు, నిమ్మరసం వేసి స్పూన్‌తో బాగా గిలకొట్టాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని వడగట్టి, గిన్నెలో పోసి ఆరు గంటలపాటు గట్టిపడే వరకూ డిఫ్రిజ్‌లో ఉంచాలి. తర్వాత ఫ్రిజ్ నుంచి తీసి కొద్దిగా కరిగేవరకూ ఐదు నిమిషాలు బయట ఉంచాలి. తర్వాత చిన్న ముక్కలుగా కట్ చేసి, బ్లెండర్‌లో వేసి క్రీమ్‌లా తయారుచేయాలి. దీన్ని మరో రెండు గంటలు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఆ తర్వాత బయటకు తీసి, తింటే కొన్న ఐస్‌క్రీమ్ కంటే రుచిగా ఉందనడం ఖాయం.

## హల్వా



**కావలసిన పదార్థాలు :** పుచ్చకాయ తెలుపు భాగం – కప్పు, నెయ్యి– రెండు టేబుల్ స్పూన్, జీడిపప్పు, కిస్‌మిస్– 100గ్రాములు, చక్కెర– అరకప్పు, మిల్క్‌పౌడర్– రెండు టేబుల్ స్పూన్లు, యాలుకల పొడి – అరటీ స్పూన్,

**తయారుచేసే విధానం :** పుచ్చకాయలోని తెల్ల భాగాన్ని సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి. ఒక పాన్‌లో టేబుల్ స్పూన్ నెయ్యి వేసుకొని అందులో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి ఎరుపు రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. అందులోనే మరొక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి పుచ్చకాయ తురుమును 10 నుంచి 15 నిమిషాలు వేయించాలి. తురుము బాగా వేగిన తర్వాత అరకప్పు పంచదార వేసుకోవాలి. పంచదార కరిగిన తర్వాత మిల్క్‌పౌడర్ వేసుకొని వేయించుకోవాలి. అవి బాగా ఉడికిన తర్వాత మంచి వాసన కోసం యాలుకల పొడిని వేసుకోవాలి. హల్వా కలర్ ఫుల్‌గా కావాలనుకుంటే ఫుడ్ కలర్‌కూడా యాడ్ చేసుకోవచ్చు. హల్వా బాగా ఉడికిన తర్వాత ముందుగా వేయించి పెట్టుకున్న డ్రైఫ్రూట్స్‌ని అందులో వేసుకోవాలి. అంతే ఘుమఘుమలాడే పుచ్చకాయ హల్వా రెడీ!

## కూర



**కావలసిన పదార్థాలు :** విత్తనాలు లేని పుచ్చకాయ– నాలుగు కప్పులు, కారం– ఒకటిన్నర టీ స్పూన్, పసుపు– చిటికెడు, కొత్తిమీర – అరకప్పు, తాజా వెల్లుల్లి ముక్కలు– టేబుల్ స్పూన్, జీలకర్ర – పావు టీ స్పూన్, కొబ్బరిపాలు – పావుకప్పు, నిమ్మరసం– రెండు టీ స్పూన్లు,

**తయారుచేసే విధానం :** పుచ్చకాయ ముక్కలు, కారం, పసుపు, కొత్తిమీర, వెల్లుల్లి, జీలకర్ర కలిపి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఒక పాన్‌లో ఆ మిశ్రమాన్ని వేసి, స్టౌవ్ సిమ్‌లో పెట్టి పది నిమిషాలు ఉడకబెట్టుకోవాలి. తర్వాత అందులో కొబ్బరిపాలు, నిమ్మరసం కలిపి ఇంకో ఐదు నిమిషాలు ఉడకబెట్టాలి. కొన్ని పుచ్చకాయ ముక్కలను అందులో జోడించి, ఇంకో ఐదు నిమిషాలు సిమ్‌లో పెట్టి ఉడికించాలి.



## స్లష్

**కావలసిన పదార్థాలు :** పుచ్చకాయ ముక్కలు (గింజలు తీసేసి)– ఐదు కప్పులు, పంచదార – రెండు టేబుల్ స్పూన్‌లు, నిమ్మకాయ – ఒకటి (రసం). నిమ్మరసం ఇష్టం లేకపోతే వాడకపోయినా పర్వాలేదు.

**తయారుచేసే విధానం :** పుచ్చకాయ ముక్కలు, పంచదార, నిమ్మరసాలను బ్లెండర్‌లో వేయాలి. వీటితో పాటు కప్పు ఐస్ ముక్కలూ వేస్తి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇది నలుగురికి సరిపోతుంది. వెంటనే తాగితే చల్లగా, హాయిగా ఉంటుంది.

## జ్యూస్



**కావలసిన పదార్థాలు :** పుచ్చకాయ ముక్కలు – నాలుగు, పంచదార –తగినంత, పుదీనా ఆకులు – కొంచెం, నిమ్మకాయ – ఒకటి, ఉప్పు – చిటికెడు.

**తయారుచేసే విధానం :** ముందుగా పుచ్చకాయ ముక్కల్ని చిన్నగా కట్ చేసుకోవాలి. అందులో పుదీనా ఆకులు, పంచదార వేసుకోని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. జ్యూస్‌ని ఒక గిన్నెలో వడగట్టుకోవాలి. దానిలో కొంచెం ఉప్పు, నిమ్మరసాన్ని కలుపుకోవాలి. ఇందులో ఐస్ ముక్కల్ని వేసుకోవచ్చు. ఆరోగ్యాన్నిచ్చే మంచి జ్యూస్ రెడీ!

## స్మూతీ



**కావలసిన పదార్థాలు :** స్ట్రాబెర్రీస్ – కప్పు, పుచ్చకాయ ముక్కలు – రెండు కప్పులు, యాలకులు – 2 లేదా 3, మిరియాల పొడి – చిటికెడు, పంచదార – అర కప్పు, ఐస్‌క్యూబ్స్ – సరిపడా.

**తయారుచేసే విధానం :** ముందుగా పుచ్చకాయను, స్ట్రాబెర్రీలను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిలోని విత్తనాలు తొలగించాలి. తర్వాత ఈ పండ్ల ముక్కలను మిక్సీ జార్‌లో వేసి, కప్పు నీళ్ళు పోసి గ్రైండ్ చేయాలి. తరువాత ఈ స్మూతీని ఒక గిన్నెలోకి తీసుకుని బయట అలాగే ఉంచాలి. కొద్దిసేపటి తర్వాత తిరిగి ఈ స్మూతీని మిక్సీజార్‌లో వేసి, స్మూతీతోపాటు ఐస్‌క్యూబ్స్, యాలకులు, పంచదార వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. తర్వాత దాన్ని సర్వింగ్ గ్లాసులోకి మార్చుకుని, చిటికెడు మిరియాలపొడి చల్లాలి. అంతే కూల్ కూల్‌గా సర్వ్ చేస్తే.. ఎవ్వరికైనా నోరూరకతప్పదు.

## అద్భుతఫలం

వేసవిలో మనకు లభించిన అద్భుతమైన ఫలం పుచ్చకాయ. దీనిలో 99 శాతం నీరు ఉంటుంది. వీటిలో అధికశాతం ఫైబర్ (పీచు) ఉన్నందువల్ల జీర్ణవ్యవస్థను శుభ్రం చేస్తుంది. ఇది గుండెకు చాలా మంచిది. పురుషుల్లో ఉన్న ప్రొస్టేట్ సమస్యను కంట్రోలు చేస్తుంది. దీనిలో ఉండే లైకోపిన్ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. స్త్రీలలో హెచ్‌పివి వైరస్ నుంచి రక్షిస్తుంది.



- జానకి బడుగు
పోషకాహార నిపుణులు

# వెన్నునొప్పి జాగ్రత్తలు

వెన్నునొప్పి ఉన్నప్పుడు కేవలం చెక్కబల్లపైనే పడుకోవాలేమోనని అనుకుంటారు చాలామంది. అయితే అలా చేయడంవలన కండరాలు, ఎముకలు ఒరుసుకుపోయి మరింత అసౌకర్యం కలుగుతుంది. కొంతమంది పరుపు లేకుండా నేలమీద పడుకుంటారు. అయితే పడుకున్న తరువాత నేలమీద నుంచి లేవాల్సి వస్తే వంగాల్సి వస్తుంది. దీనివల్ల నడుమునొప్పి మరింత పెరిగే అవకాశాలున్నాయి. పైగా నేల నుంచి చల్లదనం, తేమ వంటివి శరీరానికి చేరి, నడుము కండరాలను మరింత బిగుసుకునేలా చేస్తాయి. వాస్తవానికి మంచం బేస్ అనేది కుంగిపోకుండా, స్థిరంగా ఉంటే చాలు. మంచి మందపాటి ప్లైవుడ్ షీట్‌ను మంచం బేస్‌గా ఉపయోగిస్తూ, పరుపును రెండు అంగుళాల మందం



ఉండేలా అమర్చుకుంటే సరిపోతుంది. వాటర్ బెడ్స్, ఆర్థోపెడిక్ బెడ్స్ వంటి వాటివలన ఉపయోగం ఉంటుంది. కానీ అవి చాలా ఖరీదుతో కూడినవి. వెన్నునొప్పి దీర్ఘకాలంగా బాధిస్తున్నప్పుడు రోజువారీ కార్యక్రమాలన్నింటినీ గమనించండి. ఎక్కడ, ఏ భంగిమలో, ఏ సందర్భంలో నొప్పి వస్తున్నదో కనిపెట్టండి. వృత్తి పరంగా లేదా రోజువారీగా వాడే వస్తువుల వలన నొప్పి వస్తుంటే ప్రత్యామ్నాయ పద్ధతుల గురించి ఆలోచించండి.

నిలబడి పనిచేయాల్సి వచ్చినప్పుడు.. కూర్చుని పనిచేయాలి. బరువులను మోయాల్సి వస్తే.. హ్యాండిల్స్ అమర్చుకోవాలి. ఇలాంటి చిన్నపాటి మార్పులు, చేర్పులతో రోజువారీ కార్యకలాపాలను సౌకర్యవంతంగా నిర్వర్తించాలి. దీనివల్ల కొంత ఉపశమనం ఉంటుంది. అధికబరువు ఉంటే తేలికపాటి ఆహారం తీసుకుంటూ.. తగ్గే ప్రయత్నం చేయాలి. స్థూలకాయం వలన వెన్నుపూసల మీద అదనపు బరువు పడి.. నొప్పి తీవ్రమవుతుంది. బరువును తగ్గించుకోవాలంటే తీపి వస్తువులు, వేపుడు పదార్థాలు, నూనెలు వంటివి బాగా తగ్గించాలి. తగిన వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. ఉదరంలో గ్యాస్ అధికమైతే వెన్ను మీద వత్తిడి పడుతుంది. అందుకే గుడ్డు, శనగపిండి వంటకాలు, ఉల్లి, చిక్కుళ్ళు, క్యాబేజీ, కాలీఫ్లవర్, దోసకాయ, మసాలాలు, పచ్చి సలాడ్స్ వంటి గ్యాస్‌ను తయారుచేసే ఆహారాలను తగ్గించాలి. ★

# ఫేషియల్ తరువాత...

చాలామంది ఫేషియల్ చేయించుకుంటారు. కానీ దానికి తగ్గ ఫలితం ఉండదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చర్మం కాంతివంతంగా తయారవుతుంది. ముందుగా మనం చేయకూడని పనులేంటో తెలుసుకుందాం.

➢ ఫేషియల్ చేయించుకున్న మూడురోజుల వరకూ స్క్రబ్ చేయకూడదు. ఫేషియల్ చేయించుకున్న తరువాత మనం దూరంగా ఉండవలసిన మరొక విషయం ముఖానికి ఆవిరి పట్టడం. కనీసం వారం వరకూ ఆవిరి జోలికి వెళ్లొద్దు.

➢ ఫేషియల్ చేయించిన 72 గంటల వరకూ



మేకప్ వేయకపోవడం మంచిది. ఫేషియల్ తరువాత వారం పాటు మసాజ్ చేయకుండా ఉండాలి.

➢ ఫేషియల్ తర్వాత చర్మం సున్నితంగా మారుతుంది. అలాగే సూర్యకిరణాలు నేరుగా ముఖానికి తాకటం వలన చర్మం సున్నితత్వం మరింతగా పెరుగుతుంది. సున్నితమైన చర్మం దెబ్బతినడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ఎండలోకి వెళ్లకూడదు.

➢ ఫేషియల్ తర్వాత వాక్సింగ్, థ్రెడ్డింగ్ వంటివి అస్సలు చేయకూడదు. అందుకే, ఫేషియల్ ట్రీట్మెంట్ తర్వాత వారం పాటు ఆ చర్మాన్ని అలాగే వదిలేయడం ఉత్తమం. ★

## మీకోసం

మందారాకుల్ని వేసి కాచిన కొబ్బరినూనె తలకు రాసుకుంటే చుండ్రు తగ్గుతుంది.



## జీవన సౌరభం

తెలివిగల వారు ఎప్పుడూ వైఫల్యం పొందిన చోట నిరాశ చెందకుండా.. ఓటమి పాఠాల నుంచి విజయాన్ని సాధించడం ప్రారంభిస్తారు.

# ఆశయ సాధనలో ఎంతదూరమైనా!

భారత సంతతికి చెందిన భరులతా పాటిల్ కాంబ్లీ తన ఆశయాన్ని 32 దేశాల్లో ప్రచారం చేసింది. ఆమె సంకల్పానికి భారత రాష్ట్రపతి చేతులు మీదుగా 'నారీ శక్తి పురస్కారం' అందుకుంది. అంతేకాక అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు, ఎన్నో పురస్కారాలు అందాయి. అంతకుమించి, ప్రపంచంలోనే 32 దేశాల మీదుగా 32 వేల కిలోమీటర్లు ఒంటరిగా ప్రయాణించిన మొట్టమొదటి మహిళా చోదకురాలిగా ప్రఖ్యాతిని సాధించింది. అయితే దీనికంతటికీ కారణం ఆమెకు బాలికలపై ఉన్న బాధ్యతే. అందుకే ప్రయాణించిన ప్రతిచోటా 'సేవ్ గార్ల్స్, ఎడ్యుకేట్ గార్ల్స్' అనే నినాదాన్ని ప్రచారం చేసింది.



నలభైనాలుగేళ్ల భరులతాకు డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ ఇన్ని దేశాలు ప్రయాణించే ఆలోచన వచ్చినప్పటి నుంచీ మూడేళ్ళు దానికోసం కేటాయించింది. మొదటి ఏడాది పూర్తిగా డ్రైవింగ్‌పైనే దృష్టిపెట్టింది. దూరప్రయాణాలు కారు నడపడానికి కావాల్సిన సామర్థ్యాన్ని కూడగట్టుకుంది. డ్రైవింగ్ టెస్ట్‌లో పాస్ అయ్యింది. మరో 18 నెలలు ఇతరత్రా వనరులను సమకూర్చుకొని, ప్రయాణానికి సిద్ధపడింది. ఆమెకు డ్రైవింగ్‌పైన ఉన్న మక్కువ సంగతి అలా ఉంచితే, కొన్నేళ్ల క్రితం ఆమె ఒక రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. అప్పుడు ఎముకలకు తగిలిన దెబ్బలతో ఎంతో బాధపడింది. దానివల్ల కలిగిన ఒత్తిడితో నాలుగున్నరేళ్లు నాలుగుగోడల మధ్యనే కాలం వెళ్లదీసింది. అది చాలా తీవ్రమైన ప్రమాదం కావడంవల్ల ఆమెపై ఆమెకున్న నమ్మకమూ కాస్త సన్నగిల్లింది. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. అప్పటి నుంచి తనకిష్టమైన డ్రైవింగ్‌లో కొత్త ఉత్సాహాన్ని చూపించింది. మౌంటైన్ డ్రైవింగ్ చేయడం ప్రారంభించింది.

పదహారేళ్ల తన డ్రైవింగ్ కల నెరవేర్చుకునేందుకు ఎంతో తపన పడింది భరులత. 32 దేశాలు పర్యటించడానికి అన్ని వసతులూ సమకూరిన తర్వాత వెనుతిరిగి చూడలేదు. ఆర్కిటిక్ సర్కిల్ మీదుగా వివిధ ఖండాలను దాటుకుంటూ ప్రయాణం చేసింది. సాధారణంగా ఇలాంటి ప్రయాణాలు చేసేటప్పుడు సహాయంగా మరో వాహనమూ స్పాన్సర్లు ఇస్తారు. కానీ ఈ ప్రయాణంలో భరులత ఒకే వాహనంలో ఒంటరిగా ప్రయాణించి, చరిత్ర సృష్టించింది. ప్రారంభంలో 39 గంటల్లో 2,792 కిలోమీటర్లు ప్రయాణించింది. భరులత భర్త కారును ఏర్పాటు చేస్తే, పిల్లలు ఎంతో ప్రోత్సాహమిచ్చారు. ఆమె ప్రయాణాన్ని ప్రశంసిస్తూ ఎన్నో వార్తలు. భారత రాయబార కార్యాలయాలు ఆమెను ప్రత్యేకంగా అభినందించాయి. పర్యటన పూర్తయిన తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ ఆమెను సత్కరించింది. అలాంటి పౌరస్వీకారం భారతీయలకు అందించడం అదే ప్రథమం.



అంతేకాదు, భరులత లండన్‌లో 120 మంది చీరలు ధరించిన మహిళలతో ఒక రోజులో 416 కిలోమీటర్లు డ్రైవింగ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించి, మంచి గుర్తింపు సాధించింది. ఆర్కిటిక్ సర్కిల్‌లో భారతీయ జెండాను రెపరెపలాడించి మొట్టమొదటి మహిళగానూ అందరి దృష్టినీ ఆకర్షించిదామె. ఇన్ని ప్రయాణాల్లోనూ ఆమె చెప్పదలుచుకున్నది ఒక్కటే. 'స్త్రీ అసమానత్వాన్ని భరించినంతకాలం అది అలా కొనసాగుతూనే ఉంటుంది. అందుకే ఎదురించి పోరాడాలి. ప్రతి మహిళా తనకంటూ కొంత జీవితాన్ని ఏర్పరచుకోవాలి. ఆమెకున్న సమానహక్కులను వినియోగించుకుని, తమ ఆశయాలను నెరవేర్చుకోవాలి. ప్రపంచాన్ని జయించగలిగే సామర్థ్యాన్ని కూడగట్టుకోవాలి'. ప్రస్తుతం భరులతా మరో ప్రయాణానికి సిద్ధపడుతుంది. ఈసారి 50 దేశాలను ఒంటరిగా డ్రైవ్ చేస్తూ.. వెళ్లడానికి ప్రణాళిక రూపొందించుకుంటుంది.

భరులతా లక్ష్యం నెరవేరాలని ఆకాంక్షిద్దాం! ★

# చదువు కోసం పోరాటం

పెళ్లి అయితే చదువు కాస్తా అటకెక్కేస్తుందనీ.. పెద్దలు అనడం తెలిసిన విషయమే. సాధారణంగా పెళ్లయిన తర్వాత చదువుకోవడం కుదరదు కూడా. సంసార బాధ్యతల్లో పడి, విద్యను నిర్లక్ష్యం చేస్తారు చాలామంది.. ఇదే ఆ మాటల వెనుకున్న సారాంశం. కానీ ఈ మహిళ ఆ మాటలకు విరుద్ధంగా విజయాన్ని సాధించింది.

కేరళకు చెందిన అన్సియాబి.. పెళ్లయిన తర్వాతా తన చదువును కొనసాగించడానికి చేసిన పోరాటంలో విజయం సాధించింది. కేరళలోని సర్ సయ్యద్ కాలేజీలో బీఏ అరబిక్ చదువుతోంది. డిగ్రీ పూర్తి కాకముందే 2014లో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేశారు. ఆ తర్వాత కొన్నిరోజులకే ఆమె గర్భవతైంది. మూడు సెమిస్టర్ల వరకూ కడుపులో బిడ్డతోనే కాలేజీకి హాజరైంది.. పరీక్షలు రాసింది. చివరి సెమిస్టర్ అయిన నాలుగవ సెమిస్టర్ సమయానికి ప్రసవించే సమయం దగ్గరపడింది. దీంతో చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ప్రసవం తర్వాత తన చదువు కొనసాగిద్దామన్న ఆలోచనతో కాలేజీకి వెళ్లి, తన అడ్మిషన్ పునరుద్ధరించమని కాలేజీ యాజమాన్యానికి దరఖాస్తు చేసుకుంది. కానీ నిబంధనల పేరు చెప్పి కాలేజీ ఆమె దరఖాస్తును తిరస్కరించింది. న్యాయవాది సహాయం తీసుకొని, హైకోర్టుకు వెళ్లింది అన్సియాబి. అక్కడా ఆమెకు మొండిచెయ్యే ఎదురైంది. ఆ తర్వాత ఆర్టీఐ చట్టం ద్వారా మరింత సమాచారం తెలుసుకొని, మరోసారి హైకోర్టు మెట్లెక్కింది. అన్సియాబి న్యాయపోరాటాన్ని అర్థంచేసుకున్న కోర్టు ఈసారి తీర్పు ఆమెకు అనుకూలంగా ఇచ్చింది. మధ్యలోనే ఆగిపోయిన తన చదువును తన న్యాయపోరాటం ద్వారా కొనసాగిస్తున్నది అన్సియాబి. ఆల్ ది బెస్ట్ అన్సియాబి..! ★



సెన్సెక్స్ ⬇ 61
33,856

నిఫ్టీ ⬆ 05
10,426

రూపాయి ⬆ 15 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.89



### జెన్ టెక్నలాజీస్ సాయం..

జెన్ టెక్నలజీస్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా భారత ఆర్మీకి చెందిన వీర్ సమ్మన్ ఫౌండేషన్‌కు రూ.56 లక్షలు అందించింది. ఈ మొత్తాన్ని ఆ కంపెనీ సిఎండి అశోక్ అట్లూరి, ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రవత్‌కు అందజేశారు. డెహ్రాడూన్‌లో ఏర్పాటు చేస్తున్న వార్ మెమోరీయల్ హాస్టల్ అభివృద్ధికి ఈ నిధులను ఉపయోగించనున్నారు.



### హీరో నుంచి కొత్త బైకులు..

హీరో మోటో కార్ప్ మార్కెట్లోకి కొత్త ప్యాషన్ ప్రో, ప్యాషన్ ఎక్స్‌ప్రో మోడళ్లను విడుదల చేసింది. వీటి ధరలు న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద వరుసగా రూ.53,189, రూ.54,180గా నిర్ణయించినట్లు ఆ కంపెనీ తెలపింది. ఇది వరకు మోడళ్లతో పోల్చితే ఇవి స్మార్టర్, ఫాస్టర్, బోల్డర్‌గా ఉంటాయని ఆ కంపెనీ ప్రకటించింది.

## నీరవ్ బకాయిలు చెల్లిస్తాం..!

### ఇతర బ్యాంకులకు పిఎన్‌బి హామీ

**న్యూఢిల్లీ :** నీరవ్ మోడీ అక్రమ లావాదేవీల్లో ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంకు(పిఎన్‌బి) అంగీకరించినట్లు సమాచారం. అయితే అందుకు కొన్ని షరతులు విధించినట్లు పిఎన్‌బి అధికారులు పేర్కొన్నారని ఓ ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. పిఎన్‌బి జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఒయు)లతో వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పలు బ్యాంకుల నుంచి భారీగా నిధులు పొందిన విషయం తెలిసిందే. రూ.12వేల కోట్ల ఈ కుంభకోణం కేసులో ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకు, యూకో బ్యాంకు, అలహాబాద్ బ్యాంకులకు పిఎన్‌బి రూ.6,000 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని అంచనా. నీరవ్ తీసుకున్న రుణాలను పిఎన్‌బినే చెల్లించాల్సి ఉంది. అయితే తొలుత ఈ అప్పులు చెల్లించడానికి పిఎన్‌బి అంగీకరించలేదు. ఆర్‌బిఐ, బ్యాంకుల ఒత్తిడితో తర్వాత ఆ మొత్తాలను చెల్లించడానికి అంగీకరించింది. అయితే ఆయా బ్యాంకులు నీరవ్‌కు రుణాలు ఇచ్చినట్లు విచారణ అధికారులకు రుజువు చేయాల్సి ఉంటుందని పిఎన్‌బి షరతు విధించింది. ఒకవేళ రుణాలు ఇచ్చినట్లు నిరూపణ అయితే బకాయిలు చెల్లిస్తామని పిఎన్‌బి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

## 70 విమానాలు రద్దు

**న్యూఢిల్లీ :** పలు విమాన ఇంజన్లలో లోపాలు ఉన్నాయని డిజిసిఎ హెచ్చరికలు, ఆదేశాలతో మంగళవారం ఇండిగో, గో ఎయిర్ కంపెనీలు 70 విమాన సేవలను రద్దు చేశాయి. ఇండిగోకు చెందిన 50 విమానాలు, గో ఎయిర్ 20 ఫ్లైట్లు రద్దు అయ్యాయి. ముందస్తుగా బుక్ చేసుకున్న ఆయా ప్రయాణికులను ఇతర విమానాల షెడ్యూల్‌లో సర్దినట్లు ఆ సంస్థలు తెలిపాయి. ఢిల్లీ, ముంబయి, చెన్నయ్, కొల్‌కత్తా, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే విమానాలు రద్దు అయ్యాయి. ఇంతక్రితం రోజు ప్రాట్ అండ్ విట్నీ (పి అండ్ డబ్ల్యు)కి చెందిన సమస్యాత్మక సీరిస్ ఇంజిన్లతో కూడిన పదకొండు ఎ320 నియో విమానాలను తక్షణమే నిలిపివేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఆదేశించింది. అందులో 8 విమానాలను ఇండిగో, మూడింటిని గోఎయిర్ ఆపరేట్ చేస్తున్నాయి. ఈ మధ్యకాలంలో పి అండ్ డబ్ల్యుకు చెందిన ఒక సీరిస్ ఇంజిన్లలో తరచుగా సాంకేతిక లోపాలు తలెత్తాయి. తాజాగా సోమవారం ఇండిగోకు చెందిన ఎ320 నియో విమానం మధ్యాకాశంలో ప్రయాణిస్తున్నప్పుడు ఇంజిన్ ఆగిపోవడంతో అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. ఈ ఘటన జరిగిన కొద్ది గంటలకే డిజిసిఎ కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 25 వరకు తమ విమాన సేవల్లో మార్పులుంటాయని ఆయా కంపెనీల వర్గాలు పేర్కొన్నాయి.

# 25 కోట్ల మందికి ఊరట

- కనీస నిల్వ ఛార్జీలకు ఎస్‌బిఐ కోత
- పెనాల్టీలు 75% వరకు తగ్గింపు
- గ్రామీణ ప్రాంతాల్లో వారికి గరిష్టంగా రూ.10
- ఏప్రిల్ నుంచి అమల్లోకి..



**ముంబయి :** దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తమ ఖాతాదారులకు భారీ ఊరట కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. సేవింగ్ ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోతే వసూలు చేసే ఛార్జీలను 75శాతం వరకు తగ్గించింది. దీంతో ఆ బ్యాంకు 25 కోట్ల మంది ఖాతాదారులకు ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నట్లయ్యింది. తాజా నిర్ణయంతో మెట్రో, అర్బన్ కేంద్రాల్లో ప్రస్తుతం విధిస్తున్న చార్జీలు రూ.50 నుంచి రూ.15కు తగ్గనున్నాయి. సవరించిన ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఇకపై మెట్రో, అర్బన్ కేంద్రాల్లోని పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోతే గరిష్టంగా రూ.15 చొప్పున, సెమీ-అర్బన్ అయితే రూ.12, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాలకైతే రూ.10 చొప్పున వసూలు చేయనున్నట్లు ఎస్‌బిఐ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ఈ ఛార్జీలకు వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అదనమని ఆ బ్యాంకు పేర్కొంది. బ్యాంకు లాభాల ద్వారా వచ్చే ఆదాయం కంటే పెనాల్టీ చార్జీల ద్వారా వచ్చే ఆదాయమే అధికంగా ఉన్నట్టు వెలుగు చూడడంతో ఎస్‌బిఐ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఈ ఛార్జీల ద్వారా కేవలం ఎనిమిది నెలల్లోనే రూ.1,771 కోట్లు గడించింది. విద్యార్థులు, నిరుపేదలకు చెందిన ఖాతాలను సైతం రెగ్యులర్ సేవింగ్స్ ఖాతాలుగా పరిగణించడంతో భారీగా నష్టపోతున్నారు.

ఈ క్రమంలోనే ఖాతాదారుల నుంచి వస్తున్న సూచనలు, మనోభావాలను దష్టిలో పెట్టుకుని చార్జీలను తగ్గిస్తున్నట్టు ఎస్‌బిఐ తెలిపింది.

**వారికి ప్రాధాన్యం**

తమ ఖాతాదారుల సెంటిమెంట్లు, వాళ్ల అభిప్రాయాల అనంతరం ఛార్జీలకు కోత పెట్టినట్టు ఎస్‌బిఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పికె గుప్తా తెలిపారు. ఖాతాదారుల ప్రయోజనాలకే బ్యాంకు తొలుత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. రెగ్యులర్ సేవింగ్స్ బ్యాంకు ఖాతా నుంచి ఎటువంటి చార్జీలు పడకుండా ఉండే బేసిక్ సేవింగ్స్ ఖాతాల్లోకి మారేందుకు కూడా కష్టమర్లకు అవకాశం కల్పించను న్నట్టు ఎస్‌బిఐ ప్రకటించింది. ఎస్‌బిఐకి మొత్తంగా 41 కోట్ల సేవింగ్స్ ఖాతాదారులున్నారు. ఇందులో 16 కోట్ల వరకు జన్‌ధన్ ఖాతాలు, బేసిక్ ఖాతాలే ఉన్నాయి. ఈ ఖాతాలకు కనీస నిల్వల నిబంధన లేదు. తాజా నిర్ణయంతో 25 కోట్ల మంది ఖాతాదారులకు ఉపశమనం లభించనుంది. 21 కంటే తక్కువ వయసున్న ఖాతాదారు లకు కూడా కనీస నిల్వల చార్జీల నిబంధనలను బ్యాంకు వర్తింపచేయడం లేదు.

**మెట్రో, పట్టణ ప్రాంతాల్లో..**

| ఎఎంబి రూ.3,000 | నెలకు ప్రస్తుత ఛార్జీలు | తగ్గించనున్న చార్జీలు |
|---|---|---|
| 50% కంటే తక్కువ నిల్వ | రూ.30 | రూ.10 |
| 50% నుంచి 75% కొరత | రూ.40 | రూ.12 |
| 75పైనా కొరత | రూ.50 | రూ.15 |
| **చిన్న పట్టణాలు** ఎఎంబి రూ.2,000 | | |
| 50% కంటే తక్కువ నిల్వ | రూ.20 | రూ.7.50 |
| 50% నుంచి 75% కొరత | రూ.30 | రూ.10 |
| 75% కంటే ఎక్కువ కొరత | రూ.40 | రూ.12 |
| **గ్రామీణ ప్రాంతాల్లో** ఎఎంబి రూ.1,000 | | |
| 50% కంటే తక్కువ నిల్వ | రూ.20 | రూ.5 |
| 50% నుంచి 75% కొరత | రూ.30 | రూ.7.50 |
| 75% పైబడిన కొరత | రూ.40 | రూ.10 |

**ఈ పెనాల్టీలకు జిఎస్‌టి అదనం**

**మూడు శ్లాబుల్లో అమలు..**

మూడు ప్రాంతాలు, మూడేసి శ్లాబుల్లో వివిధ స్థాయిల విభాగాలుగా ఎస్‌బిఐ ఈ జరిమాన విధిస్తుంది. మెట్రో, పట్టణ ప్రాంతాల్లో కనీస నిల్వ నిర్వహణ (ఎఎంబి) రూ.3,000గా నిర్ణయించింది. చిన్న పట్టణాల్లో ఎఎంబి రూ.2,000, గ్రామీణ ప్రాంతాల్లో ఎఎంబి రూ.1,000గా ఉంది. ఈ మొత్తాలకు 75 శాతం పైబడి తగ్గిన కనీస నిల్వలకు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. కాగా 50 శాతం కంటే ఎక్కువ 75 శాతం కంటే తక్కువ ఒక్క శ్లాబు, 50 శాతం కంటే తక్కువుంటే మరో శ్లాబుగా ఏర్పాటు చేసి జరిమానాలు విధిస్తుంది.

## ఎల్‌ఒయులు రద్దు


**ముంబయి :** పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్‌ఒయులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆథరైజ్డ్ డీలర్లకు అన్ని బ్యాంకుల లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్స్, లెటర్ ఆఫ్ కంఫర్ట్‌ను రద్దు చేసినట్లు ఆర్‌బిఐ మంగళవారం తెలిపింది. విదేశాల్లో వ్యాపారం చేసేవారికి ఎల్‌ఒయులు, ఎల్‌ఒసిలు కీలకమైనవి. సదరు వ్యాపారస్థులకు విదేశాల్లోని ఇతర భారత బ్యాంకుల బ్రాంచీలకు హామీలను సమకూరుస్తాయి. దిగుమతిదారులకు ఇవి చాలా ముఖ్యమైనవి. ప్రస్తుత పరిస్థితిని సమీ క్షించిన తర్వాత దిగుమతిదారులకు ఆథరైజ్డ్ డీలర్ కేటగిరి బ్యాంక్-1లు వ్యాపార రుణం కింద ఎల్‌ఒయు, ఎల్‌ఒసిల జారీని నిలిపివే యాలని నిర్ణయించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆర్‌బిఐ తన సర్క్యూలర్‌లో పేర్కొంది.

## అమాంతం ఊగిసలాట

### సెన్సెక్స్ 61 పాయింట్ల తగ్గుదల

**ముంబయి :** వివిధ పరిణామాల మధ్య మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు అమాంతం ఊగిసలాటకు గురైయ్యాయి. తుదకు సెన్సెక్స్ 61.16 పాయింట్లు తగ్గి 33,856.78 వద్ద ముగిసింది. 33,818 వద్ద మొదలైన సూచీ ఓ స్థాయిలో 34,077 గరిష్ట స్థాయికి చేరింది. అనంతరం అమ్మకాల ఒత్తిడితో చివరి గంటలో ఏకంగా 33,722 కనిష్ట స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 5.45 పాయింట్లు పెరిగి 10,426.85కు చేరింది. సెన్సెక్స్-30లో టిసిఎస్ 5.31 శాతం, కొటాక్ బ్యాంకు 1.53 శాతం, ఎన్‌టిపిసి 1.11 శాతం, కోల్ ఇండియా 1.06 శాతం, ఇన్ఫోసిస్ 0.83 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూసిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

విద్య



S.S.C. MODEL PAPER

# MATHS PAPER-II

**(PART-A&B)**

**Time: 2.45 Hours - Max Marks: 40**

## PART – A

**Time: 2h.15m** **Max Marks: 30**

**SECTION-I (4×1=4M)**

**Note:** i. Answer all Question
ii. Each question carries 1 Mark

1. $\Delta PQR \sim \Delta XYZ$ and then areas are respectively 49 $cm^2$ and 64$cm^2$. If YZ = 12cm Find QR.
2. Slop of the line passing through the points (1,4), (5,8) represented by Tanθ then find the value of θ.
3. Draw a diagram for ‘A person observes two banks of a river at an angles of depression $\theta_1\theta_2$ ($\theta_1<\theta_2$ ) from the top of a tree of height h which is at a side of the river. The width of the river is ‘d’m
4. In a class 36 students out of 50 students take tea. So find the probability of the chosing randomly a student. who don’t take tea.

**SECTION-II (5 × 2=10 M)**

**Note:** i. Answer all Question
ii. Each question carries 2 Marks

5. Find the coordinates of the points which divides the line joining of (6,-3), (2,-5) in the ratio of 2:1
6. The centre of the circle lie on the bisector of the angle between two tangents drawn from a point out side it. Can you say how can we proove it?
7. Length of the shadow of a 15m high pole in $5\sqrt{3}$ m at 7 O’clock in the morning. Find the angle of elevation of the Sunrays with the ground at that time.
8. Find the mode of the data.

| Families size | 1-2 | 2-4 | 4-6 | 6-8 | 8-10 | 10-12 |
|---|---|---|---|---|---|---|
| No.of Families | 6 | 8 | 7 | 6 | 4 | 1 |

9. Show that $\frac{1-\tan^2 A}{Cot^2 A-1}$ = $\tan^2A$

**SECTION-III (4×4=16M)**

**Note:** i. Answer all Question
ii. Each question carries 4 Marks

10. Show that the points (-4,-7), (-1,2), (8,5) and (5,-4) are the vertices of rhombus if yes find its Area.

Or

State and prove the convers of thale theoren.

11. A chord of a circle of radius 12cm substands an angle of $120^0$ at the centre. Find the area of the corresponding minor sigment of the circle.

Or

i) Prove that $(SinA + CosecA)^2 + (CosA + SecA)^2 = 7 + Tan^2 + Cot^2A$

ii) Prove that $Tan^2\theta - \frac{1}{Cos^2\theta}$ =1

12. The angle of elevation of a plane after a flight of 15 seconds, the angle of elevation changes to $30^0$. If the plane is flying at a constant height of $1500\sqrt{3}$ miters. Find the speed of the plane.

Or

Five cards the ten, jack, queen, king and ace of Diamond are well shuffled with their face down words. One card is picked up random.
i) What is the probability of that the card a queen.
ii) If the queen is drown put it outside, what is the probability by that the second card picked is (a) an ace (b) a queen (c) a ten.

13. The annual profit earned by 30 shops in a locality give raised to the following distribution

| Class | 5-10 | 10-15 | 15-20 | 20-25 | 25-30 | 30-35 | 35-40 |
|---|---|---|---|---|---|---|---|
| No.of Shops | 2 | 12 | 2 | 4 | 3 | 4 | 3 |

OR

Draw a circle of radius 6cm from a point 10cm away from its centre. Construct the point of tangents to the circle and measure their length, verify by using phythongorus theorum.

## PART – B

**Time: 30 Min** **Marks: 10**

**Instruction:**
1. Answer the all questions.
2. Each quention carries 1/2 mark.
3. Part - B answers should be written on the given paper only.
4. No marks given to over writing answers.

14. The Distance between A($x_1y_1$) and B ($x_2y_1$) is____ ( )
A) $|y_2-y_1|$ B) $\sqrt{x_1^2+y_1^2}$
C) $\sqrt{x_2-x_1}$ D) $|x_2-x_1|$

15. Slop of the line joining the points (7,4) (6,-x) is 12 the x =_______ ( )
A) -8 B) $\frac{-12}{13}$ C) 8 D) $\frac{12}{13}$

16. E and F are points on the sides PQ and PR respectively of ΔPQR and EF//QR the PE =3.9, EQ=3, FR=2.4 and PF = _______ ( )
A) 2.8 B) 3.1 C) 4.0 D) 3.12

17. Cosθ is always a _________ ( )
A) 1 or a properfraction
B) Improperfraction
C) Mixed fraction
D) Can’t say

18. The line of the sight is ______the horigental line and angle between the line of sight and the horigental line is called angle of elevation
A) Below B) Above ( )
C) Equal D) Straight

19. Two dice with 6 faces thrown at the same time the possible out comes are _______
A) 12 B) 4 ( )
C) 16 D) 36

20. Wickets taken by the bowler in 10 cricket matches are 3, 7, 5, 6, 6, 3, 7, 4, 3, 4 then mode of the data is________ ( )
A) 7 B) 8 C) 6 D) 3

21. If Cosecθ + Cotθ = P then Sinθ = ______
A) $\frac{2P}{P+1}$ B) $\frac{2P}{P^2+1}$ ( )
C) $\frac{2P^2+1}{2P}$ D) $P + \frac{1}{P}$


22. If the length of the tangent to a circle is 7cm from the outer point of the circle. If we drawn another tangent from that point to the circle its length is_______ ( )
A) 7 B) 14 C) 3.5 D) Can’t say

23. In an experiment P(E) = then the P($E^1$)=___
A) $\frac{2}{5}$ B) $\frac{3}{5}$ C) $\frac{1}{5}$ D) 1 ( )

24. If a dice thrown probability of getting a prime number is _________ ( )
A) $\frac{1}{2}$ B) $\frac{3}{4}$ C) $\frac{1}{6}$ D) $\frac{3}{2}$

25. 3m pole top is observing ______ angle at the point which is m from the foot of the pole
A) $45^0$ B) $30^0$ C) $60^0$ D) $90^0$ ( )


26. Raju says ΔRAB ~ ΔRST. Can you support Raju by _____ criterian ( )




A) AAA B) SAS
C) SSS D) ASA

27. In ΔACB, ∠C=$90^0$, and CD⊥AB then $\frac{BC^2}{AC^2}$ = _____
A) $\frac{BD}{AD}$ B) $\frac{BC}{AF}$ C) BC.DC D) $\frac{AD}{BD}$

28. In the adjoing the figure AB is a diametre of the circle then coordinates of B is ___ ( )





A) (3,1) B) (1,3)
C) (-3,-1) D) (-1,-3)

29. If P(E) is the probability of a certain event E then the following is correct ( )
A) P(E) ≥1 B) P(E) ≤ 1
C) -1 ≤ P(E) ≤ 1 D) O ≤ P(E) ≤ 1

30. ΔABC ~ ΔDEF and the areas of ΔABC, ΔDEF are 64$cm^2$ and 121$cm^2$ then the ratio of correspon-ding sides _______ ( )
A) 8:11 B) 11:8 C) 3:11 D) 8:19

31. If AP and BP are the two Tangents a circle with centre O. So that ∠AOB =$120^0$ then ∠APB=_ ( )




A) $70^0$ B) 60
C) $80^0$ D) $100^0$

32. Graph of y = mx is ____ ( )
A) Parallel to X-axis B) Perpendicular to Y-axis
C) Parallel to Y-axis D) Passing through origen

33. Mean of 22,23, x, 29 and 32 is 26.4 then the x =
A) 24 B) 25.6 C) 28 D) 26 ★

**Part -B (Answers)**

| | | | | |
|---|---|---|---|---|
| 14.D | 15.C | 16.D | 17.A | 18.B |
| 19.D | 20.D | 21.B | 22.A | 23.B |
| 24.A | 25.C | 26.A | 27.A | 28.C |
| 29.D | 30.A | 31.B | 32.D | 33.D |

## ఏపీ ఎంసెట్ - 2018

ఏపీ ఎంసెట్ 2018 నోటిఫికేషన్‌ను జేఎన్‌టీయూ, కాకినాడ విడుదల చేసింది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌బీ అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్‌లకు ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షను ఏప్రిల్ 22 నుంచి 25 వరకు వివిధ సెషన్లల్లో నిర్వహిస్తారు.

**ఇంజనీరింగ్ స్ట్రీమ్..**

**కోర్సులు:** ఇంజనీరింగ్/ బీఫార్మసీ (ఎంపీసీ)/ ఫార్మ్-డీ/ బీటెక్ (డెయిరీ టెక్నాలజీ)/ బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/ బీటెక్ (ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ/ బీఎస్సీ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్).

**అర్హతలు:** ఇంటర్మీడియట్ ఎంపీసీ ఉత్తీర్ణత అర్హత.

**పరీక్ష విధానం:** పరీక్ష 160 ప్రశ్నలతో 160 మార్కులకు ఉంటుంది. మ్యాథమెటిక్స్ నుంచి 80, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు మార్కు.

**పరీక్ష వ్యవధి :** మూడు గంటలు.

**అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్..**

**కోర్సులు:** బీఎస్సీ (అగ్రికల్చర్), బీఎస్సీ (హార్టికల్చర్), వెటర్నరీ సైన్స్, యానిమల్ హజ్బెండరీలో బ్యాచిలర్ కోర్సులు, బీఎఫ్ఎస్సీ, బీటెక్ (ఎఫ్ఎస్‌టీ), బీఎస్సీ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, బీఫార్మసీ, బీటెక్ (బయోటెక్నాలజీ) (బైపీసీ), ఫార్మ్-డీ (బైపీసీ).

**అర్హత:** బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత.

**పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం 160 ప్రశ్నలతో 160 మార్కులకు ఉంటుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 40 ప్రశ్నల చొప్పున 80 ప్రశ్నలు, బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు.

**ర్యాంకుల నిర్ధారణ ఇలా:**

వివిధ సెషన్లల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రశ్నల క్లిష్టత అన్ని సెషన్లకూ ఒకేలా ఉండకపోవచ్చు. ఏ ఒక్క విద్యార్థీ నష్టపోకుండా ఉండేందుకు నార్మలైజేషన్ విధానం ద్వారా ముందుగా ఎంసెట్ మార్కులు నిర్ధారిస్తారు. ఈ మార్కులకు 75 శాతం వెయిటేజీ ఇచ్చి, ఇంటర్ మార్కులకు మిగతా 25 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ర్యాంకుల జాబితా రూపొందిస్తారు.

**ముఖ్య తేదీలు..**

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ : **మార్చి 29, 2018.**

**దరఖాస్తు ఫీజు:** రూ.500.

**ఫీజుల వివరాలు:** ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగాలు రెండింటికీ హాజరుకావాలనుకుంటే రూ.1,000 చెల్లించాలి. అపరాధ రుసుము రూ.500తో ఏప్రిల్ 6 వరకు, రూ.1,000తో ఏప్రిల్ 11 వరకు, రూ.5 వేలతో ఏప్రిల్ 16 వరకు, రూ.10 వేలతో ఏప్రిల్ 21 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్:** ఏప్రిల్ 18 నుంచి.

**ఇంజనీరింగ్ పరీక్ష:** ఏప్రిల్ 22 నుంచి 25 వరకు.

**అగ్రికల్చర్ పరీక్ష:** ఏప్రిల్ 25, 26 తేదీల్లో నిర్వహిస్తారు. రెండు పరీక్షలకు హాజరయ్యే వారికి ఏప్రిల్ 24, 25 తేదీల్లో ఆన్‌లైన్ టెస్టులు ఉంటాయి. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు.

**పూర్తి వివరాలు :** వెబ్‌సైట్‌లో చూడొచ్చు

**వెబ్‌సైట్:** http://sche.ap.gov.in/EAMCET

## ఉద్యోగాలు

## కొత్త లారీల రిజిస్ట్రేషన్ నిలుపుదలపై నిరసన

**ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా)**

నెల రోజుల నుంచి నూతన లారీలకు రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం పట్ల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గుడివాడ ఆర్‌టిఒ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న గుడివాడ ప్రాంతీయ రవాణాశాఖాధికారి ఆర్.సురేష్ లారీ యజమానులతో చర్చించారు. ఈ విషయమై ఆర్‌టిఒ చొరవ చూపి రవాణా శాఖా కమిషనర్‌తో ఫోనులో మాట్లాడి రిజిస్ట్రేషన్ ఆగిన నూతన లారీల రిజిస్ట్రేషన్‌ను వెంటనే పూర్తి చేస్తానని హామీ ఇవ్వడంతో లారీ యజమానులు నిరసన విరమించారు. ఈ ఆందోళనకు వైసిపి జిల్లా నాయకులు మండలి హనుమంతరావు సంఘీభావం తెలిపారు.

**వినూత్నం**

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విశాఖలో మంగళవారం బాణాలు ఎక్కుపెట్టి వినూత్న నిరసన ప్రదర్శన చేస్తున్న గిరిజనులు



## ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండల స్థాయి నుంచే ఉద్యమం

### రజక వృత్తిదారుల సంఘం నేతలు

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)**

రజక వృత్తిదార్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నట్లుగా రుజువైందని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నూరు భాస్కరయ్య విమర్శించారు. విజయవాడలోని నండూరి ప్రసాదరావు శ్రామిక్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10వ తేదీ నుంచి 72 గంటలపాటు నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వ నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో మండలస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. రజక వృత్తిదార్ల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, ప్రభుత్వం వాగ్దానం చేసి అమలు చేయని విషయాలను రజకవృత్తిదార్లకు వివరిస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి సి.గురుశేఖర్ మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి కొంత మేరకైనా నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటూరు నాగభూషణం, కొండయ్య, ఈశ్వరయ్య, ఎం.రాజు, సహాయ కార్యదర్శి కోరట్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రెడ్డయ్య, మహిళా నాయకులు మనోరమ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేజోన్ కోసం ఆందోళనలు

**ప్రజాశక్తి-విశాఖ/అనంతపురం**

విశాఖకు రైల్వేజోన్ కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ విశాఖ, అనంతపురం జిల్లాల్లో మంగళవారం ఆందోళనలు జరిగాయి. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ తీసుకురాలేకపోయిన ఎంపీలు కె.హరిబాబు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. రైల్వే జోన్ ఆంధ్రాకు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యాన అనంతపురంలోని టవర్‌క్లాక్ ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనంచేశారు.

## నేడు రాయలసీమలో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు : సిపిఎం

**ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి**

విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరుతూ రాయలసీమ నాలుగు జిల్లాల్లోనూ కలెక్టరు కార్యాలయాల ఎదుట ఈనెల 14 న ధర్నాలు నిర్వహించనున్నట్లు సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీనిస్తామని ప్రభుత్వం హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ, అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, కర్నూలులో రైల్వే వ్యాగన్ పరిశ్రమ, చిత్తూరులో మన్నవరం ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొందని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్లలో ఎలాంటివి ఏర్పాటు చేయకపోవడంతో సిపిఎం ఆందోళన బాటపట్టిందని పేర్కొన్నారు. ఈనెల 8 నుంచి రాయలసీమ నాలుగు జిల్లాల్లోనూ బస్సు యాత్రలు జరిగాయని చెప్పారు. బుధవారం జిల్లా కలెక్టరు కార్యాలయాలు, సబ్ కలెక్టరు కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనలకు ప్రజలు మద్దతునివ్వాలని కోరారు.

## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు : శంకరరావు

**ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ**

రాష్ట్రంలో బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఎన్‌జిఒ హోమ్‌లో మంగళవారం జరిగిన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబాటును ప్రాతిపదికగా రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. జనాభాలో 20 శాతానికి మించి లేని అగ్రకులాలు ఓపెన్ కేటగిరిలో 50 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌ను సవరించి 80 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

**ప్రజ్ఞ**

**జవాబులు**

1. రష్యా, 2. మెక్సికోలోని లాస్ కాబోస్
3. తెలంగాణ రేసర్ కొండా అనింధిత్‌రెడ్డికి
4. దాదాపు 1700 మంది, 5. 5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 32.49 కోట్లు)

### మహనీయుల విగ్రహాల కూల్చివేతకు నిరసనగా

# 24న విజయవాడలో ర్యాలీ, మహాసభ

- మతోన్మాదుల దుర్మార్గ చర్యల్ని ఖండించాలి
- దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అంబేద్కర్, పెరియార్, లెనిన్ వంటి మహనీయుల విగ్రహాల కూల్చివేతకు నిరసనగా ఈ నెల 24న విజయవాడలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహించాలని దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. 'మహనీయుల విగ్రహాల్ని కూల్చివేస్తున్న మనువాద మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేస్తూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. 24న తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి లెనిన్ సెంటర్ మీదుగా ర్యాలీ, ధర్నా చౌక్ వద్ద మహా సభ నిర్వహిస్తామని సమావేశానికి అధ్యక్షత వహించిన ఐక్య వేదిక కన్వీనర్ అంద్ర మాల్యాద్రి తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు చేస్తూ మహనీయుల విగ్రహాల్ని మతోన్మాదులు కూల్చివేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మతోన్మాదుల దుర్మార్గ చర్యలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్.సూర్యారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకొచ్చాక దళితులు, హేతువాదులు, కమ్యూనిస్టులపై దాడులు చేస్తోందన్నారు. వారి దాడులను తిప్పికొట్టాలన్నారు. దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ మనువాద సిద్ధాంతాలతో మతతత్వ శక్తులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయన్నారు. ఎన్డీయేలో టిడిపి భాగస్వామ్యంగా ఉన్నందున ఈ దాడులపై తన వైఖరిని తెలపాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు మేళ్ల భాగ్యారావు మాట్లాడుతూ ఏ దేశంలోనూ లేనివిధంగా మన దేశంలో అన్ని కులాలు, మతాల వారు ఉన్నారని, వారిని విభజించి పాలించేందుకు బిజెపి కుట్ర పన్నుతోందన్నారు. హిందూ మతోన్మాదంతో దళితులు, హేతువాదులపై ఆర్‌ఎస్ఎస్ దాడులు పెరిగాయన్నారు. ఐక్యవేదిక చేపట్టే నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఏఐడిఆర్ఎఫ్ నాయకులు ఎ. విజయ్ మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్ఎస్ మతోన్మాదంతో రెచ్చిపోయి అభివృద్ధి నిరోధకులుగా మారారన్నారు. దేశంలో అశాంతిని రేపుతూ, ప్రజల మధ్య కులాల పేరుతో చిచ్చు పెడుతున్నారన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.ఎస్.సి. బోస్ మాట్లాడుతూ దేశంలో గవర్నర్లు కూడా ప్రభుత్వాలకు అనుకూలంగా, అధికార పార్టీ నేతల్లా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారన్నారు. లెనిన్ విగ్రహం విదేశీయుని విగ్రహమన్న బిజెపి నేత రామ్ మాధవ్ వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. గిరిజన సంఘం నాయకులు హనుమంత నాయక్ మాట్లాడుతూ దేశంలో భావప్రకటనా స్వేచ్ఛపై దాడి చేసే, విగ్రహాల్ని కూల్చివేసే మతతత్వ వాదులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మహనీయుల విగ్రహాల కూల్చివేత, మతతత్వ, మనువాద చర్యల్ని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఖండించారు. మతోన్మాదులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలను కులాలు, మతాల పేరుతో విభజంచేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని కాపునాడు సంఘం నేత వై. శ్రీనివాసరావు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్, కెవిపిఎస్ నాయకులు జి. నటరాజు, దళిత, ప్రజాసంఘాల నాయకులు ఎస్. గ్రిటన్, ఎ. వంశీ కృష్ణ, అశోక్, బి. రాయప్ప, ఎం. నాగేశ్వరరావు, రమణ కుమారి, డాక్టర్ అంకయ్య తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అంద్ర మాల్యాద్రి

# హోదా కోసం హోరెత్తిన రాష్ట్రం

- ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఆధ్వర్యాన ర్యాలీలు
- అనంతపురం, కర్నూలుల్లో సిపిఎం ఆధ్వర్యాన కొనసాగిన జాతాలు



నెల్లూరు జిల్లా కేంద్రంలోని ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి- యంత్రాంగం**

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఆధ్వర్యాన మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారం వంటి కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో సిపిఎం ఆధ్వర్యాన జాతాలు కొనసాగాయి. ప్రత్యేక హోదా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన విజయవాడలో మహాత్మాగాంధీ రోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. దాదాపు 31 సంఘాల వారు కొవ్వొత్తులు, ప్లకార్డులతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై ఆందోళన మరింత ఉధృతం చేస్తామని, మరిన్ని సంఘాలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమిస్తామని అన్నారు. గుంటూరు జిల్లా కేంద్రంలో ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జిఒ హోం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల నుంచి లాడ్జి సెంటర్ వరకూ సాగింది. సమితి రాష్ట్ర సెక్రటరీ జనరల్ జోసఫ్ సుధీర్‌బాబు తదితరులు మాట్లాడారు. విశాఖలో ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులు యూనివర్సిటీలోని గాంధీ విగ్రహం నుంచి జివిఎంసి వద్దగల గాంధీ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ మాట్లాడుతూ ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఉద్యోగ జెఎసి ఆధ్వర్యాన కోట జంక్షన్ నుంచి గంటస్తంభం వరకూ ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్‌జిఒ హోమ్ నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా సూర్యమహల్ కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో పవర్‌పేట స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఫైర్ స్టేషన్ సెంటర్లో మానవహారం చేపట్టారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రకాశం భవనం నుంచి అద్దంకి బస్టాండ్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు. కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజవర్గంలో సాగిన జీపుజాతాలో తూర్పుప్రాంత జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, పాణ్యం నియోజకవర్గంలో పశ్చిమప్రాంత జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కల్లూరు ప్రాంతంలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. అనంతపురం జిల్లాలో సిపిఎం చేపట్టిన బస్సుయాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంది. అనంతపురం ఉత్తరప్రాంత జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పాల్గొన్నారు. నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పకోడాలు చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కాళ్లకు కట్లు కట్టుకుని క్రేన్ సహాయంతో తలకిందులుగా వేలాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

## కర్నూలులో కొవ్వొత్తులతో ప్రదర్శన

### ఊపందుకుంటున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన

**ప్రజాశక్తి - యంత్రాంగం**

పెంచిన స్టయిఫండ్ బకాయిలను చెల్లించాలని, హౌస్ సర్జన్, పీజీ విద్యార్థులకు పెంచాల్సిన స్టయిఫండ్ జిఒను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. . తమకు న్యాయం చేయకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాకినాడలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జిజిహెచ్ వద్ద జూనియర్ డాక్టర్లు ధర్నా నిర్వహించారు. గుంటూరు సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో పీజీలు, హౌస్‌సర్జన్లు, సీనియర్ రెసిడెంట్‌లు కలిసి సుమారు 150 మంది ఆస్పత్రి ప్రాంగణంలో కొద్దిసేపు నిరసన తెలిపారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి బుధవారం నుండి సమ్మె చేస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. ప్రస్తుతం అత్యవసర సేవలే అందిస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని ప్రకటించారు. కర్నూలు నగరంలో మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కొవ్వొత్తులతో కలెక్టరేట్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. రిలే దీక్షల్లో కూర్చున్నారు.

## సిపిఎం నాయకునిపై వైసిపి సర్పంచ్ హత్యాయత్నం

### మా మీదే ఫిర్యాదు చేస్తావా అంటూ అధికార్ల సమక్షంలోనే దౌర్జన్యం

**ప్రజాశక్తి- పుట్లూరు, అనంతపురం కలెక్టరేట్**



రామాంజనేయులుకు చికిత్స చేస్తున్న డాక్టర్

అనంతపురం జిల్లాలో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సిపిఎం నాయకునిపై వైసిపికి చెందిన సర్పంచ్ మంగళవారం హత్యాయత్నం చేశాడు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని పుట్లూరు మండలం కడవకలు, మడ్డిపల్లి గ్రామాల్లో మంచినీటి సమస్యను సిపిఎం పుట్లూరు మండల కార్యదర్శి రామాంజ నేయులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తున్నారు. అలాగే సోమవారం జరిగిన 'మీ కోసం'లోనూ ఈ సమస్యను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో అదే కార్యాలయంలో ఉన్న మడిపల్లికి చెందిన వైసిపి సర్పంచ్ రాజారెడ్డి దగ్గర్లో ఉన్న పూల కుండీని తీసుకుని రామాంజనేయులు తలపై గట్టిగా కొట్టాడు. ఇదంతా ఎండిఓ సమక్షంలోనే జరిగింది. తీవ్రంగా గాయపడ్డ రామాంజనేయులు రక్తపు మడుగులో పడిపోయాడు. కింద పడేసి కర్రలతో దాడి చేశాడు. కాళ్లతో ఇష్టానుసారంగా తన్నాడు. దీంతో రామాంజనేయులు అపస్మారక స్థితిలో పడిపోయాడు. సిమెంట్ దిమ్మెతో తలపై కొట్టేందుకు సర్పంచ్ యత్నించే క్రమంలో కార్యాలయ సిబ్బంది అడ్డుకున్నారు. 'మా మీదే ఫిర్యాదు చేసే వాడివా, ఏ ఊరు నీది. మా గ్రామ సమస్యలు అడిగేందుకు నీవెవరు,. అసలు నిన్ను చంపితే ఎవడొస్తాడు. నీ అంతు చూస్తాన'ంటూ రాజారెడ్డి ఈ దాడికి పాల్పడ్డాడు. తోటి కార్యకర్తలు గాయపడ్డ రామాంజనేయులను తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

**రాజారెడ్డిని అరెస్టు చేయాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్**

రామాంజనేయులుపై దాడి చేసిన సర్పంచ్ రాజారెడ్డిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యపై ఎంపిడిఒతో రామాంజనేయులు, ప్రజలు చర్చిస్తున్న సమయంలో రాజారెడ్డి పక్కనే ఉన్న పూలకుండితో కొట్టి దాడి చేసి హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన రాజారెడ్డిని కఠినంగా శిక్షించాలన్నారు. సర్పంచ్‌పై క్రిమినల్ కేసులు, హత్యాయత్నం కేసులు పెట్టాలన్నారు. రాజారెడ్డి గతంలో చాలాసార్లు దాడులు చేశారన్నారు. గతంలో ఆయనపై అనేక కేసులున్నాయని చెప్పారు. దాడిని అడ్డుకోకుండా చూస్తూ ఉన్న ఎంపిడిఒపైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె

**ప్రజాశక్తి - యంత్రాంగం**



రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికులకు జిఒ 151 ప్రకారం జీతాలు పెంచాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్రంలో పలు పంచాయతీల్లో మంగళవారం కార్మికులు సమ్మెకు దిగారు. ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపుమేరకు ఈ ఆందోళన జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అమలాపురం, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద సమ్మె శిబిరాలను ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మావూరి శ్రీనివాసరావు, పి.కిషోర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ప్రతినెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడో వేతన కమిషన్ సిఫార్సుల మేరకు కనీస వేతనం నెలకు రూ.18 వేలివ్వాలని, ప్రభుత్వమే నేరుగా జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బండి రాజు, జి.నారాయణ, లక్ష్మీనారాయణ, దుర్గారావు, సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.


## 50వ రోజుకు న్యాయవాదుల దీక్షలు

**ప్రజాశక్తి - కడప**

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేస్తామంటూ స్పష్టమైన ప్రకటన చేస్తూ జిఒ జారీ చేయాలని సీమ న్యాయవాదుల జెఎసి కన్వీనర్ ఎస్.మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. అంతవరకూ ఉద్యమం ఆగదని, ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 50వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు 72 మంది కూర్చున్నారు. సీమలో హైకోర్టు ఏర్పాటు ఉద్యమంలో భాగంగా న్యాయవాదులు వినూత్న రీతిలో జిల్లా కోర్టు ఎదుట వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. కోర్టు ఎదుట రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ మస్తాన్ వలి మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ 50 రోజులుగా అన్ని జిల్లాలలో న్యాయవాదులు వివిధ రూపాల్లో ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు, రిలే దీక్షలు, ఆమరణ దీక్షలు చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చీమకుట్టినట్లైనా లేదన్నారు.

## గొర్రెలు, మేకల పెంపకందార్ల ధర్నా

**ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)**



ధర్నా చేస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారులు

రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పశుసంవర్ధశాఖ సంయుక్త సంచాలకుల కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ముత్యాలంపాడు వద్ద ఉన్న కార్యాలయం ఎదురుగా మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునపాటి రామకృష్ణ మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అటవీ హక్కుల చట్టంలో పొందుపర్చిన విధంగా అటవీ భూములను మేత కోసం అనుమతించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పటాపంచల జమలయ్య, పగడాల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**దక్షిణమధ్య రైల్వే**

మమ్మల్ని @SCRrailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

PUB/0309/18

**ఇ-టెండరును ఆహ్వానించడానికి ప్రకటన (https://ireps.gov.in ద్వారా)**

సిఎఓ (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ భారత రాష్ట్రపతి తరుపున దిగువ పనుల కొరకు సింగిల్/రెండు ప్యాకెట్ సిస్టమ్ ఆఫ్ టెండరింగ్ మీద ఇ- టెండర్లను ఆహ్వానించడమైనది.

**క్ర.సం:1 నిట్ నెం:** 08-సిఎఓ-సి-ఎస్‌సి-2018 తేది. 09-03-2018 (ఐటం నెం.1) **పని యొక్క పేరు:** మనోహరబాద్-కొత్తపల్లి స్టేషన్స్ మధ్య క్రొత్త బిజి లైన్ కు నిర్మాణం-మనోహరబాద్-గజ్వేల్ స్టేషన్స్ మధ్య గజ్వేల్-చెగుంట బిటి రోడ్ క్రాస్ దగ్గర ఓపెన్ ఫౌండేషన్స్ మీద ఆర్‌సిసి బాక్స్ 2×14.0×6.055 ప్రకారం సిహెచ్ 27403.70మీ వద్ద బిఆర్ నెం 55, రోడ్ క్రింద వంతెన నిర్మించడానికి ప్రతిపాదన. **అంచనా విలువ (రూ):** 10,04,37,752/- **బయానా(రూ):**6,52,190/- **ముగింపు సమయం:** 06 నెలలు **తెరచు తేదీ:** 13.04.2018 @ 15.00 గం॥లకు

**క్ర.సం:2 నిట్ నెం:** 08-సిఎఓ-సి-ఎస్‌సి-2018 తేది. 09-03-2018 (ఐటం నెం.2)**పని యొక్క పేరు:** నాందెడ్ డివిజన్-కంద్వా-అకోలా సెక్షన్-అకోలా-అకోట్ స్టేషన్స్ మధ్య ఎంజి నుంచి బిజి వరకు ట్రాక్‌ను మార్చుట- మహారాష్ట్ర రాష్ట్రం (రీచ్-1) వద్ద అకోలా(మార్డ్ తో పాటుగా) మరియు గాంధీ సామారక్ రోడ్ (యార్డ్ తో పాటుగా) స్టేషన్స్ మధ్య సిహెచ్: 742000 మీ నుంచి సిహెచ్ :723000మీ (19.00 కిమీ) వరకు అలైన్‌మెంట్/స్టేషన్ యార్డ్‌లకు ప్రతిపాదన మరియు ట్రాక్ స్టోన్ బల్లాస్ట్ కు సరఫరా మరియు స్టేకింగ్, మిషన్ క్రషడ్, శుభ్రత, హార్డ్ మరియు యాంగ్లర్ కు ప్రతిపాదన. **అంచనా విలువ (రూ) :** 3,92,15,000/- **బయానా(రూ):**3,46,080/- **ముగింపు సమయం:** 12 నెలలు **తెరచు తేదీ:** 13.04.2018 @ 15.00 గం॥లకు

**క్ర.సం:3 నిట్ నెం:** 08-సిఎఓ-సి-ఎస్‌సి-2018 తేది. 09-03-2018 (ఐటం నెం.3) **పని యొక్క పేరు:** 2 నం లు గల నాలుగు చక్రాల వాహనములను వివిధ పనులకు ఉపయోగపడేలా (నాన్ ఏసి) అనగా సుమో/బొలారో/ఇన్నోవా/స్కోర్పియో/క్జైలో/డస్టర్ మరియు క్వాలీస్ లేదా అదే రకమైన వంటి వాహనమును ప్రతి వాహనము కొరకు 06 నెలలు చొప్పున డివై.చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్/డబ్ల్యుసిఎస్‌సి/ఎస్‌సి యొక్క అధికారిక ప్రయోజనాల కొరకు వాహనములను తీసుకొనుట. **అంచనా విలువ (రూ)** : 4,32,000/- **బయానా(రూ):**8,640/- **ముగింపు సమయం:** 06 నెలలు **తెరచు తేదీ:** 13.04.2018 @ 15.00 గం॥లకు.

**క్ర.సం:4 నిట్ నెం:** 08-సిఎఓ-సి-ఎస్‌సి-2018 తేది. 09-03-2018 (ఐటం నెం.4) **పని యొక్క పేరు:** నాడికుడి-శ్రీకాళహస్తి క్రొత్త బిజి లైన్- మూడు నెలలు గల పికప ట్రక్స్/వాహనములు తీసుకొనుట అనగా టాటా 497 ఎస్‌పి/కర్‌జోకింగ్ మహీంద్రా నాన్ ఎసి-640 డిపి లేదా అదే రకమైన ఎస్ఎస్ఇలు/ఎస్ఇలు/జెఇలు మరియు డివై.సిపిఎం/సిఓఎన్/డబ్ల్యుసిఎస్‌పి/ఎస్‌సి యొక్క స్టాఫ్ యూనిట్ కొరకు వస్తువులను రవాణా చేయుట, మెటీరియల్,సర్వేల యొక్క తనిఖీ, మట్టి రవాణా, భూమి ఆక్రమణ మరియు సర్వేలు, నిర్మాణం పనులు, సమావేశాలు మరియు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జాయింట్ తనిఖీలు, గ్రామీణ అధికారులు, పట్టణ అధికారులు నాడికూడి-శ్రీకాళహస్తి స్టేషన్‌స కొరకు క్రొత్త బిజి లైన్ కు నిర్మాణం మరియు పన్నెండు (12)నెలల కొరకు 03 వాహనముల కొరకు డివై.సిపిఎం/సిఓఎన్/డబ్ల్యుసిఎస్‌పి/ఎస్‌సి యూనిట్ కు ఇతర పనులు. **అంచనా విలువ (రూ) :** 8,52,000/- **బయానా(రూ):** 17,040/- **ముగింపు సమయం:** 12 నెలలు **తెరచు తేదీ:** 13.04.2018 @ 15.00 గం॥లకు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరముల కొరకు https://ireps.govv.in అనే వెబ్‌సైట్ కు లాగిన్ అవ్వచ్చు.
2)బయానా మరియు టెండరు డాక్యుమెంటు ధరను నెట్ బ్యాంకింగ్/ గేట్‌వే ద్వారా చెల్లించడానికి IREPS ఆన్‌లైన్ లో దాని సేవలను అందుబాటులో ఉంచుతుంది
3)టెండరుదారులు వారి ఆఫర్లను ఆన్‌లైన్ ద్వారా టెండరుదాఖలుకు/బిడ్డింగ్ సమయము చేయగలరు, మరియు టెండరు డాక్యుమెంటులో అదే విషయం తెలుపబడి ఉంది.
4) టెండరుదారులు ఏవైనా సవరణలు చూడాలనుకుంటే(ఆన్‌లైన్‌లో జారీ చేసినవి మాత్రమే) టెండరు దాఖలు/బిడ్డింగ్ సమయం మొదలుపెట్టే రోజు వరకు చూడవచ్చు.

**చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/ నిర్మాణం/సికింద్రాబాద్**

PUB/0310/18

**ఇ-టి.ఎన్.నెం.07/డివై.సిఎస్‌టిఇ/సి/ఎస్‌సి/ 2018. తేది 10.03.2018**

భారత రాష్ట్రపతి తరుపున, డిప్యూటి చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్మాణం), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్, కంపీటెంట్ అథారిటీ అంగీకారం తీసుకుని దిగువ పనుల కొరకు 16-04-2018 న 15.00 గం॥ల వరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది

**క్ర.సం: 1 టెండర్ నెం:** నెం.సి-ఎస్‌జి-సి-36-5-118-2018 **పని యొక్క పేరు:**హైదరాబాద్ డివిజన్ దక్షిణ మధ్య రైల్వే యొక్క అక్కన్నపేట-మెదక్ మరియు మనోహరబాద్-కొత్తపల్లి స్టేషన్స్ మధ్య క్రొత్త లైన్ కు కనక్షన్‌కు మనోహరబాద్, నాచారం, గజ్వేల్, అక్కనపేట మరియు మెదక్ స్టేషన్స్ కు సెంట్రలైజడ్ ఆర్కిటెక్చర్ మరియు అసోసియేటెడ్ పనులు యొక్క హాట్ స్టాండ్‌బై ఎలక్ట్రానిక్ ఇంటర్లఆకింగ్ సిస్టమ్ కు ప్రతిపాదన కనక్షన్ తో పాటుగా సిగ్నలింగ్ పనులు. **అంచనా విలువ: (రూ)** 8,03,59,888.60 పైసా **బయానా: (రూ)** 5,51,800/- **టెండర్ ఫారమ్ ధర(రూ):** 10,000/- **ముగింపు సమయం:** 12 నెలలు.

1)బయానా మరియు టెండరు డాక్యుమెంటు ధరను నెట్ బ్యాంకింగ్/ గేట్‌వే ద్వారా చెల్లించడానికి IREPS ఆన్‌లైన్ లో దాని సేవలను అందుబాటులో ఉంచుతుంది
2)టెండరుదారులు వారి ఆఫర్లను ఆన్‌లైన్ ద్వారా టెండరుదాఖలుకు/బిడ్డింగ్ సమయము చేయగలరు, మరియు టెండరు డాక్యుమెంటులో అదే విషయం తెలుపబడి ఉంది.
3) టెండరుదారులు ఏవైనా సవరణలు చూడాలనుకుంటే(ఆన్‌లైన్‌లో జారీ చేసినవి మాత్రమే) టెండరు దాఖలు/బిడ్డింగ్ సమయం మొదలుపెట్టే రోజు వరకు చూడవచ్చు.

**డివై. చీఫ్ సిగ్నల్ & టెలికాం.ఇంజనీర్, (నిర్మాణం), సికింద్రాబాద్**

A0447/2018

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైటు http//www.tenders.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి

## ఉత్తరాఖండ్‌లో లోయలో పడిన బస్సు

### 13 మంది మృతి

**డెహ్రాడూన్ :** ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో బస్సు లోయలో పడిన ప్రమాదంలో డ్రైవర్‌తో సహా 13 మంది మృతి చెందారు. 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లా ప్రధాన కేంద్రానికి 120 కిలో మీటర్ల దూరంలోని పోతమ్ వద్ద మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. బస్సు వేగంగా ప్రయాణిస్తుండటంతో పాటు, ముందుగా వెళుతున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగిందని ప్రాధమిక విచారణలో వెల్లడయింది. గాయపడ్డవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని వారిని రామ్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ ఇవా అశిష్ శ్రీవాత్సవ తెలిపారు.



పోరాటం

జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో చాంపూర్‌లో తమ భూములు, హక్కులను రక్షించుకోవడం కోసం ఆదివాసీలు నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్. సిపిఎం, ఆదివాసీ అధికార్ మంచ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది.

## పారిశ్రామిక ఉత్పత్తి పెరిగినా 7 శాతం నిరుద్యోగం

**న్యూఢిల్లీ :** దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి పెరిగినప్పటికీ ఉపాధి లేమి 7 శాతంగాఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపి)ని కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే జనవరి 2017లో ఉన్న ఐఐపి కన్నా జనవరి 2018 ఐఐపి 7.5 శాతం పెరిగింది. ప్రతి నెలా పారిశ్రామిక ఉత్పత్తి ఎంత జరుగుతుంది, కాలానుగుణంగా అందులో ఎటువంటి మార్పులు చోటు చేసుకుంటాయన్న విషయాన్ని ఐఐపి సూచిస్తోంది. దీని ప్రకారం మొత్తం మీద పారిశ్రామిక ఉత్పత్తిలో పెరుగుదల కనిపిస్తున్నది. అదే సమయంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంటే ఏప్రిల్ 2017 నుంచి జనవరి 2018 వరకు ఉన్నకాలంలో ఐఐపిలో వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2016 నుంచి జనవరి 2017వరకు ఉన్న కాలంలో పోల్చి చూస్తే పెరుగుదల రేటు కేవలం 4.1 శాతమే వున్నట్లు ఇవే గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ కప్పి పుచ్చుకోలేని ఒకే ఒక వాస్తవమేమంటే ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా సరే వెన్నెముకగా ఉంటే పారిశ్రామిక వృద్ధి భారత్‌లో బలహీనంగా ఉంది. ఏ యేడాదికాయేడాదిగా జనవరి 2018ని జనవరి 2017తో పోల్చినప్పుడు ఉత్పత్తిలో తగ్గుదలకు కారణం పెద్ద నోట్ల రద్దు అని చెప్పక తప్పదు. 2016 నవంబరు, డిసెంబరు మాసాలను గుర్తు తెచ్చుకుంటే మోడీ సర్కార్ దేశంపై పెద్ద ఆర్థిక విపత్తును మోపింది. దీని ఫలితంగా ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తి, ఉపాధి బాగా పడిపోయాయి. ఈ దాడి దెబ్బకు జనవరి 2017లో కూడా పూర్తిగా కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. అందువల్లే ఈ ఏడాది జనవరి గణాంకాలతో గత ఏడాది జనవరి గణాంకాలతో పోల్చినప్పుడు గత ఏడాది తక్కువ స్థాయినే ప్రతిబింబించింది.

## ఒక్క కావేరినే కాదు..... పలు సమస్యలున్నాయి

### రజనీకాంత్ మౌనంపై కమల్‌హాసన్

**కొయంబత్తూర్ :** రాష్ట్రంలో ఉన్నది ఒక్క కావేరి వివాదమే కాదని, పలు సమస్యలు ఉన్నాయని వీటిల్లో ఏ ఒక్క దానిపైనా రజనీకాంత్ స్పందించలేదని రాజకీయ వేత్తగా మారిన నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకులు కమల్‌హాసన్ అన్నారు. రజనీకాంత్ త్వరలోనే రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నసంగతి తెలిసిందే. తన సమకాలీన నటుడైన రజనీకాంత్ పలు సమస్యలపై స్పందించలేదని ప్రత్యేకించి కావేరి వివాదంపైనే మాట్లాడటం సరికాదని అన్నారు. "రజనీకాంత్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయాల్సిన అంశం ఇదొక్కటే కాదు. పలు సమస్యలున్నాయి. ఒకే ఒక అంశాన్ని ప్రస్తావించడం సరికాదు."అని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. ప్రత్యేకించి రజనీకాంత్ గురించి అడిగిన నిర్దిష్టమైన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ కర్ణాటకతో కావేరి జలాల పంపిణీ విషయమై ఆయన మౌనంగా ఉన్నారని చెప్పారు. కావేరి వివాదంపై గతంలో సినీ పరిశ్రమ నిర్వహించిన ఆందోళనల్లో రజనీకాంత్ పాల్గొనలేదు. దీనిపై ఆయన తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. కావేరి నది నుంచి తమిళనాడుకు నదీ జలాలను తక్కువగా కేటాయిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు కూడా. కావేరి నిర్వహణ బోర్డు ఏర్పాటుపై అడిగిన ఒక ప్రశ్నకు కమల్‌హాసన్ సమాధానమిస్తూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌ను కలిసినప్పుడు భవాని నది, దాని డామ్ సమస్యను చర్చించారా? అని అడిగిన ప్రశ్నకు కమల్‌హాసన్ ప్రతికూల సమాధానమిచ్చారు. తమిళనాడులో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.

## మంగళూరు పబ్‌పై దాడి కేసు కొట్టివేత

### శ్రీరామ్ సేన్ ముతాలిక్‌తో సహా 26 మంది విడుదల

**బెంగళూరు :** మంగళూరులో తొమ్మిదేళ్ళ క్రితం ఒక పబ్‌పై దాడి చేసి అక్కడ యువతులను అతి దారుణంగా వేధించిన కేసులో నిందితులను సోమవారం బెంగుళూరులోని ఒక కోర్టు నిర్దోషులుగా వదలిపెట్టింది. శ్రీరామ్ సేన్ అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ మరో 26 మంది ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. పబ్ వద్ద నేరాన్ని వీరే చేశారనడానికి తగిన సాక్ష్యాలు లేవని పేర్కొంటూ కోర్టు నిందితులను వదిలిపెట్టింది. ముతాలిక్ నేతృత్వంలో దాదాపు 26 మంది యువకులు పబ్‌పై దాడి చేసి అక్కడ మహిళలను చెంపపై కొట్టడం, తన్నడం, జుట్టుపట్టి లాగడం తదితర అనాగరిక చర్యలకు ప్పాలడ్డారు. దీంతో భీతిల్లిన మహిళలు వారి దెబ్బలు తప్పించుకుంటూ అటూఇటూపరిగెత్తారు, కొందరు వారికి దొరికిపోయారు, మరి కొందరు కింద పడిపోయారు. పబ్‌లో శ్రీరామ్ సేన్ దౌర్జన్య కాండకు సంబంధించి దృశ్యాలు పబ్‌లోని కెమెరాలలో చిక్కాయి. ఈ సంఘటనను జాతి యావత్తు అసహ్యించుకుంది. నిందితులను కఠినంగా శిక్షించాలని వెలుగెత్తి చాటింది. అయినా 9 సంవత్సరాల తరువాత కోర్టు తీర్పు ఇస్తూ నిందితులను నిర్దోషులుగా విడిచి పెట్టింది.

## కేజ్రీవాల్ సలహాదారుని రాజీనామా

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సలహాదారు వికె జైన్ మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. గత ఫిబ్రవరి 19న ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఓ సమావేశంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అన్షుప్రకాష్ పై జరిగిన దాడి ఘటనకు జైన్ 'ప్రత్యక్ష సాక్షి'. ఈ ఢిల్లీ పోలీసులు ఆయనను ప్రశ్నించారు కూడా. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామాకు ప్రాధన్యత ఏర్పడింది. రాజీనామా లేఖను ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ)లో సమర్పించడంతో ఒక కాపీని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కూడా పంపారు. వ్యక్తిగత కారణాలు, కుటుంబంతో ఉన్న సర్దుబాటులో భాగంగా పదివికి రాజీనామా చేస్తున్నానని ఆయన వెల్లడించారు. 1984 ఢిల్లీ అండమాన్ నికోబార్ దీవుల సివిల్ సర్వీసెస్ (డిఎఎన్ఐసిఎస్) బ్యాచ్, 2001 బ్యాచ్ ఐఎఎస్ బ్యాచ్ అధికారి అయిన జైన్ కేజ్రీవాల్ సలహాదారుగా 2017లో నియమితులయ్యారు.

## ఉద్యోగాల వృద్ధికి కొత్త కొలమానం

- ఉద్యోగాల కల్పనను గణించనున్న కేంద్రం
- 10 కన్నా తక్కువ మంది ఉన్న సంస్థల్లోనూ లెక్కింపు
- తాజా గణాంకాల సర్వే 2019లో విడుదల

**న్యూఢిల్లీ :** వ్యవసాయేతర అసంఘటిత రంగంలో సృష్టించిన ఉద్యోగాలను లెక్కించాలని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలోని ఉద్యోగాల కల్పన పరిధిని విస్తృతం చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పది మంది కన్నా తక్కువ ఉన్న సంస్థల్లో కల్పించబడిన ఉద్యోగాలను లెక్కించడాన్ని ప్రారం భించాలని కేంద్ర మంత్రిత్వ శాఖ కింద పనిచేస్తున్న లేబర్ బ్యూరోను ప్రభుత్వం కోరింది. ఏదైనా సంస్థకు గాని, దుకాణానికి గాని ఒకే వ్యక్తి యజమానిగా ఉన్నా, ఒక ఉద్యోగితో ఉన్నా వారిని కూడా ఉద్యోగ కల్పన కింద లెక్కించాలని తెలిపింది. దీనికి సంబంధించిన సర్వే నివేదికను ఈ సంవత్సరాంతానికి గాని 2019 తొలి అర్ధ సంవత్సరంలో గాని విడుదలవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పది మంది ఉద్యోగుల కన్నా తక్కువగా ఉన్న సంస్థలో ఉద్యోగాల వృద్ధిని లెక్కించాలని గత వారంలోనే నిర్ణయం తీసుకున్నట్లు కార్మిక మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న సీనియర్ కార్మిక, ఉద్యోగ సలహాదారు బి.ఎన్. నందా తెలిపారు. ఈ చర్యతో దేశంలోని ఉద్యోగాల కల్పనపై సమగ్ర సమాచారం అందుతుందని ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ సిఫార్సులను కూడా ప్రభుత్వం ఆమోదిస్తుందని తెలిపారు. ప్రైవేటు ఇన్సూరెన్స్, పెన్షన్ పరిధిలో ఉన్న ఉద్యోగులు, టిడిఎస్ చెల్లించేవారు, జిఎస్‌టి నెట్‌వర్క్ వెలుపల కంపెనీలలో పనిచేస్తున్న వారిని ఉద్యోగులుగా లెక్కించాలని జులై 2017లో ప్రభుత్వ టాస్క్‌ఫోర్స్‌కు నేతృత్వం వహించిన అప్పటి నీతి అయోగ్ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా సూచించారు. కాగా దేశంలో మూడింట నాలుగోవంతు ఉద్యోగులు 10 మంది కన్నా తక్కువ మంది ఉన్న సంస్థల్లోనే పనిచేస్తున్నారని పనగారియా కమిటి అభిప్రాయ పడింది. ప్రావిడెంట్ ఫండ్, మెడికల్ ఇన్సూరెన్స్, పెన్షన్ పథకాలలో నమోదు ప్రాతిపదికగా కార్మికుడిని ఆ కమిటీ నిర్వచించింది. ఉద్యోగులకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు ప్రభుత్వం వద్ద లేవు. అధికారంలో కొనసాగుతున్న ప్రభుత్వాలకు ఉపాధి కల్పన పెద్ద సమస్యగా ఉంది. అసంఘటిత రంగంలోని ఉద్యోగాలకు సంబంధించి కొత్త సర్వేకు 2013-14 ఆర్థిక గణాంకాలను కార్మిక మంత్రిత్వ శాఖ ప్రాతిపదికగా తీసుకుంటుందని నందా తెలిపారు. దీని తొలి నివేదిక 2019 నాటికి వెలువడుతుందని భావిస్తున్న ట్లు ఆయన చెప్పారు. ఆరవ ఆర్థిక గణాంకాల మేరకు దేశంలోని దాదాపు 71.74 శాతం సొంత జవాబుదారీ సంస్థలుగా ఉన్నాయి. అంటే ఈ సంస్థలు ఏ ఉద్యోగిని నియమించుకోవు. మిగిలిన 28.26 శాతం సంస్థల్లో కనీసం ఒక్కరైనా ఉద్యోగిగా ఉంటారు. 2005 నుంచి చూస్తే సొంత జవాబుదారీ సంస్థలు 56.02 శాతానికి పెరిగాయి. ఉద్యోగులను నియమించుకునే సంస్థలు 15.11 శాతానికి పెరిగాయి. ఇదిలా ఉండగా జులై-సెప్టెంబరు 2017కు సంబంధించిన ఉపాధి గణాంకాలను సోమవారం ప్రభుత్వం విడుదల చేసింది. మొతం 8 కీలక రంగాలకు గాను 7 కీలక రంగాలలో ఉద్యోగ కల్పన పెరిగింది. ఏప్రిల్ -జూన్ 2017 నాటికి 64 వేల ఉద్యోగాలు ఉంటే జులై-సెప్టెంబరు నాటికి లక్షా 36 వేల ఉద్యోగాలు ఉన్నాయి.

# దద్దరిల్లిన పార్లమెంట్

- హోరాహోరీ నినాదాలు
- వాయిదా పర్వంలో ఉభయ సభలు
- విభజన హామీలపై ఏపి ఎంపిలు
- త్రిపురలో విధ్వంసంపై సిపిఎం ఎంపిలు నిలదీత



సర్దార్ వల్లభాయ్ పటేల్ వేషధారణలో టిడిపి ఎంపి శివ ప్రసాద్ వినూత్న నిరసన

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

వివిధ రాష్ట్రాల్లో నెలకొన్న సమస్యలపై ప్రతిపక్ష పార్టీల ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. మంగళవారం పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభమైన వెంటనే వాయిదాలు పడ్డాయి. రెండు మూడు సార్లు వాయిదాల పడిన అనంతరం ఉభయ సభలు ఏకంగా బుధవారానికి వాయిదా పడ్డాయి. తొలుత లోక్‌సభలో కాంగ్రెస్, సిపిఎం, టిడిపి, వైసిపి, అన్నాడిఎంకె, టిఎంసి, టిఆర్ఎస్ పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఆయా పార్టీల సభ్యులు తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నినాదాలతో హోరెత్తించారు. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. సిపిఎం ఎంపిలు ఎం.డి సలీం, ఎ.సంపత్, జితేంద్ర చౌదరి, శ్రీమతి టీచర్, ఎం.బి రాజేష్, ఎండి బద్రుద్దోజాఖాన్, స్వతంత్ర ఎంపి జోయిస్ జోర్జు త్రిపురలో బిజెపి, ఆరెస్సెస్ గూండాల దాడులను ఖండిస్తూ నినాదాలు చేశారు. బిజెపి గూండాల దాడులకు సంబంధించిన ఫోటోలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత సృష్టించిన భీభత్సంపై సిపిఎం ఎంపి జితేంద్ర చౌదరి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ తిరస్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలను నెరవేర్చాలని టిడిపి, వైసిపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. కావేరి జలాలపై తమిళనాడు ఎంపిలు, మోడీ సర్కార్ కుంభకోణాలు, పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై కాంగ్రెస్, టిఎంసి, సిపిఎం ఎంపిలు ఆందోళన చేపట్టారు. రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై టిఆర్ఎస్ ఎంపిలు ఆందోళనకు దిగారు.

**పార్లమెంట్‌లో ఏపి ఎంపిలు ఆందోళన**

ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని పార్లమెంట్‌లో ఏపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. ఏపి ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంట్ గేట్ నెంబర్ 1 వద్ద వైసిపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో మేకపాటి రాజమోహన్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి, మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి, వరప్రసాద్‌లు పాల్గొన్నారు. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, ఏపికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. హోదా అంశంపై సమగ్రంగా సభలో చర్చించాలని కోరుతూ వైవి సుబ్బారెడ్డి లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు. అదేవిధంగా వైసిపి రాజ్యసభ సభ్యుడు వి. విజయ సాయిరెడ్డి సభలో కాలింగ్ అటెన్షన్ నోటీసు ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఎంపిలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ చిత్తూరు టిడిపి ఎంపి శివ ప్రసాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ వేషధారణలో వినూత్న నిరసన తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభమైన వెంటనే లోక్‌సభలో టిడిపి, వైసిపి ఎంపిలు ప్లకార్డులు చేతబూని స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించడంతో పాటు, విభజన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**పార్లమెంట్ జరగడం ప్రభుత్వానికి ఇష్టంలేదు : ఎండి సలీం**

పార్లమెంట్‌ను సజావుగా నిర్వహించాలనే ఉద్దేశ్యం కేంద్ర ప్రభుత్వానికి లేదని సిపిఎం లోక్‌సభపక్ష ఉపనేత ఎం.డి సలీం విమర్శించారు. అన్ని పార్టీల నేతలతో మాట్లాడి పార్లమెంట్‌ను సజావుగా నిర్వహించడంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత కుమార్, స్పీకర్ సుమిత్రా మహాజన్ విఫలం చెందారని ఆయన అన్నారు. దేశంలో నెలకొన్న సమస్యలపై పార్లమెంట్‌లో చర్చకు తావులేకుండా మోడీ సర్కార్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాజ్యసభ పక్షనేత టి.కె రంగరాజన్, లోక్‌సభ ఎంపి జితేంద్ర చౌదరిలతో కలిసి ఎం.డి సలీం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తోందని, రైతులు, నిరుద్యోగులు సమస్యల పై చర్చ లేకుండా చేస్తోందని విమర్శించారు. రైతు రుణమాఫీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావటం లేదని, నీరవ్ మోడీ, లలిత్ మోడీలకు మాత్రం దోచిపెడుతున్నారని అన్నారు.

రాజ్యసభలో సిపిఎం పక్షనేత టి.కె రంగరాజన్ మాట్లాడుతూ కావేరి జలాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తమిళ రైతాంగానికి నష్టం కలిగిస్తుందని అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని, తన వైఖరిని తెలపాలని డిమాండ్ చేశారు.

త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే విధ్వంసం సృష్టిస్తోందని సిపిఎం ఎంపి జితేంద్ర చౌదరి విమర్శించారు. దీనిపై లోక్‌సభలో వాయిదా తీర్మానం కూడా ఇచ్చామని, కానీ స్పీకర్ అనుమతించలేదని తెలిపారు.

## బిటి పత్తి విత్తనాల ధర తగ్గించిన కేంద్రం

### ప్యాకెట్ ధర రు.740

**న్యూఢిల్లీ :** జన్యు పరంగా అభివృద్ధిపరిచిన బిటి పత్తి విత్తనాల ధరను తగ్గిస్తూ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఈ ప్యాకెట్ ధర రు.800 వుండగా తాజా నిర్ణయంతో రు.740కి తగ్గింది. ఈ చర్య వల్ల దేశంలో 80లక్షల మందికి పైగా పత్తి రైతులు లబ్ది పొందనున్నారు. దీనితో పాటు, దేశీయ కంపెనీలు, టెక్నాలజీ డెవలపర్ అయిన మాన్‌శాంటో మహికో బయోటెక్ (ఇండియా) లిమిటెడ్‌కు చెల్లించే రాయితీ ఫీజును కూడా ప్యాకెట్‌కు రు.49 నుండి రు.39కి తగ్గించింది. కొత్త ధరలు జూన్‌లో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్ నుండి అమల్లోకి వస్తాయి. ఏడాది కాలంలో సాధారణంగా 5 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు విక్రయించబడతాయి. ఇప్పుడీ ధరల కుదింపుతో దేశీయ విత్తన పరిశ్రమకు దాదాపు రు.300కోట్ల నష్టం వస్తుందని అంచనా. తొమ్మిది మంది సభ్యుల కమిటీ చేసిన సిఫార్సు మేరకు 2016 మార్చిలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ విత్తన ప్యాకెట్ ధరను రు.800కి తగ్గించింది. అంతకుముందు ఈ ప్యాకెట్ ధర రు.830-1000 మధ్య వుండేది. రాయితీ ఫీజును కూడా 70శాతానికి పైగా తగ్గించింది. 2017లో ధరలు మారలేదు. ఇప్పుడు మళ్ళీ ధర తగ్గించింది.

## తమిళనాడు కార్చిచ్చు ప్రమాదం టూర్ గైడ్ అరెస్టు

**చెన్నై :** తమిళనాడులో కార్చిచ్చులో చిక్కుకున్న ట్రెక్కింగ్ బృందానికి టూర్ గైడ్‌గా అనుమానిస్తున్న రంజిత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ట్రెక్కింగ్ బృందాన్ని రంజిత్ ఏర్పాటు చేసి, యాత్రను నిర్వహించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ట్రెక్కింగ్ బృందం రంజిత్‌కు ఎలా పరిచయం అయిందనే అంశాన్ని పోలీసులు విచారిస్తున్నారు.

# విజయోత్సాహంతో ఇళ్లకు..!

- ప్రభుత్వ సాయం కాదని..సొంత ఖర్చులతోనే తిరుగుప్రయాణం
- యుద్ధం కొనసాగిస్తాం! : కిసాన్‌సభ



**ఇండియా న్యూస్ నెట్ వర్క్ - న్యూఢిల్లీ / ముంబయి**

కళ్ళ నిండా ఆశలతో మహారాష్ట్ర రైతులు తమ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. రైతుల డిమాండ్లన్నింటినీ ఆమోదిస్తున్నామని, నిర్దిష్ట కాలపరిమితిలో వాటిని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళన విరమించారు. నాసిక్, థానె, రాయ్‌ఘడ్ జిల్లాల నుండి, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారిలో రైతులు, గిరిజనులు వున్నారు. వీరిని వెనక్కి పంపడానికి ప్రభుత్వం రెండు రైళ్ళను ఏర్పాటు చేసింది. అయితే తమ పోరాటంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయాన్ని, ప్రయోజనాన్ని పొందరాదని నిర్ణయించుకున్న అన్నదాతలు, ఆదివాసీలు తమ సొంత ఖర్చులతోనే ఇళ్లకు తిరుగుప్రయాణమవ్వడం విశేషం. 'ఈ పోరాటంలో ప్రభుత్వం నుండి ఎలాంటి ప్రయోజనం పొందకూడదని రైతులు, గిరిజనులు తీర్మానించుకున్నారు. అందరూ టిక్కెట్లు తీసుకునే రైలు ఎక్కారు' అని ఎఐకెఎస్ జాతీయాధ్యక్షులు అశోక్ ధావలె తెలిపారు. ఈ పోరాటం విజయవంతం కావడం పట్ల రైతులుసంతోషంగా వున్నారని చెప్పారు. 'యుద్ధంలో గెలిచాం. కానీ ఇంకా యుద్ధం కొనసాగుతుంది. రాతపూర్వక హామీని ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందో చూడాల్సి వుంది' అని ఆయన తెలిపారు.

**ఇది అంతం కాదు : అజిత్ నావలే**

'మేము తొలి విడత ఉద్యమం మాత్రమే చేపట్టాం. పూర్తి బలంతో త్వరలోనే తిరిగి వచ్చి రెండో విడత ఉద్యమం చేపడతాం. మా పోరాటం ఇంతటితో ఆగిపోలేదు. ఇదే అంతం కాదు' అని అఖిల భారత కిసాన్ సభ మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజిత్ నావలే తెలిపారు. ముంబయిలో మహాపాదయాత్ర, బహిరంగ సభ దిగ్విజయంగా ముగిసిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తమ డిమాండ్లలో అత్యధిక భాగం నెరవేర్చేందుకు ప్రభుత్వం దిగి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రుణమాఫీపై తగినంత స్పందన కనిపించకపోవడంతో రైతులలో కొంత నిరుత్సాహం చోటు చేసుకుంది. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని కిసాన్ సభ డిమాండ్ చేసింది. అయితే రైతులకు ప్రయోజనాలు కలిగించని పరిస్థితుల్లో మార్పులు రావాలి. ఈ పోరాటంలో ఎంతో పురోగతి సాధించాం. పూర్తి స్థాయి రుణ మాఫీ కోసం మళ్ళీ వస్తాం' అని అజిత్ నావలే తెలిపారు. అఖిల భారతీయ కిసాన్ సభ మహారాష్ట్ర కమిటీ నేతృత్వంలో దాదాపు 50 వేల మంది రైతులు తమ డిమాండ్ల సాధన కోసం మండుతున్న ఎండలను కూడా లెక్క చేయక కాలి నడకన నాసిక్ నుండి ముంబయి వరకు దాదాపు 200 కిలోమీటర్లు ప్రదర్శన నిర్వహించారు. రైతుల ఒత్తిడికి తలొగ్గిన మహారాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లను ఆమోదించిన సంగతి విదితమే.

**సిఐటియు అభినందనలు**

చారిత్రక ప్రదర్శన నిర్వహించిన మహారాష్ట్ర రైతులకు, గిరిజనులకు సిఐటియు అభినందనలు తెలియచేసింది. వివిధ రాష్ట్రాల్లో రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహిస్తూ, రైతాంగ ఉమ్మడి ఉద్యమాలకు చొరవ చేపట్టిన ఎఐకెఎస్‌ను అభినందించింది. గతంలో రాజస్థాన్‌లో జరిగిన పోరాటం మాదిరిగా ఈ ఆందోళనలు, పోరాటాలు చూస్తుంటే తీవ్ర నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యలు చేసుకునే బదులు పోరు బాట పట్టాలన్న రైతుల కృత నిశ్చయం వెల్లడవుతోందని సిఐటియు పేర్కొంది. రానున్న కాలంలో ఈ పోరాటాలు ఇతర రాష్ట్రాలకూ విస్తరిస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం శ్రమించే వర్గాల పోరాటం మరింత ఉధృతం కావడానికి దోహదపడుతుందని పేర్కొంది. మహారాష్ట్ర రైతాంగం నిర్వహించిన ఈ విజయవంతమైన పోరాటం దేశవ్యాప్తంగా ముఖ్యంగా కార్మిక వర్గంలో స్పూర్తిని రగిల్చిందని సిఐటియు పేర్కొంది.

రాజస్థాన్, మహారాష్ట్రల్లో పోరాడుతున్న రైతాంగానికి కార్మిక వర్గం సంఘీభావాన్ని ప్రదర్శించిందని పేర్కొంది. రైతుల న్యాయమైన డిమాండ్లను కార్మిక వర్గం సమర్థిస్తుందని, వారికి సంఘీభావాన్ని అందచేస్తుందని సిఐటియు హామీ ఇచ్చింది.

## 15న చలో లక్నో

**లక్నో :** మహారాష్ట్రలో అఖిల భారత కిసాన్ సభ నేతృత్వంలో రైతులు, ఆదివాసీల చారిత్రాత్మక 'నాసిక్ టు ముంబయి' ఉద్యమ విజయ స్పూర్తితో ఇప్పుడు యూపీలో రైతులు ఆందోళన బాటపడుతున్నారు. యోగి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 15న లక్నోలో నిరసనలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఒకరోజు 'కిసాన్ ప్రతిరోధ్ ర్యాలీ'కి ఏఐకేఎస్ పిలుపునిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు గురువారం లక్నోకు చేరుకుని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళనున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం పంటలకు కనీస మద్దతు ధరకు భరోసా కల్పించాలని, రైతుల రుణాలను రద్దుచేయాలని విద్యుత్ చార్జీలను తగ్గించాలనీ, విద్యుత్తు ప్రయివేటీకరణ ఆపాలని తదితర డిమాండ్లతో వారు ఉద్యమబాట పడుతున్నారు. 'ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 2016 తర్వాత విద్యుత్ చార్జీలను పెంచింది, ప్రస్తుతం ఏడు జిల్లాల్లో విద్యుత్ ప్రయివేటు చేతుల్లోకి మారిపోతున్నది. విద్యుత్ ధరలు, సాగునీటి ఖర్చులూ భారీగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ధరలు గతంతో పోలిస్తే 150 రెట్లు పెరిగాయి. కనీస మద్దతు ధర కల్పనకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు' అని ఏఐకేఎస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ముకుత్ సింగ్ చెప్పారు.

ప్రత్యేకం

# నోటు రద్దు ...ఇళ్లు గుల్ల

## ఆర్‌బీఐ నివేదికలో తేలిన వాస్తవం



**ముంబాయ్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా వెల్లడించిన వాస్తవం ఇది. నోట్ల రద్దు ప్రభావంతో దేశంలోని కుటుంబాల దగ్గర ఉండే ఆర్థిక వనరులపై తీవ్ర ప్రభావం పడిందని బ్యాంక్ త్రైమాసిక కుటుంబాల ఆర్థిక స్తోమత, వ్యయభారాలు నివేదికలో తెలియజేసింది. నోట్లరద్దుకు ముందు సంవత్సరం (2016) సెప్టెంబర్ నాటికి దేశంలోని కుటుంబాల వద్ద రూ 141 లక్షల కోట్లు నగదు లేక ఆర్థిక రూపంలోని ఆస్తులు ఉండగా అదే సంవత్సరం డిసెంబర్ ఆఖరుకు ఆ మొత్తం రూ. 137 లక్షల కోట్లకు తగ్గిపోయింది. ఈ అంకెలను దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)తో పోలిస్తే, సెప్టెంబర్ 2016 నాటికి కుటుంబాల ఆస్తుల విలువలో డిసెంబర్ 2016 నాటికి 95.2 శాతం నుంచి 89.2 కు తగ్గిపోయినట్టు స్పష్టమవుతోంది. ఇక సెప్టెంబర్ 2017 నాటికి ఇది మరింతగా దిగజారిపోయింది. ఇదే విషయాన్ని మరో కోణంలో పరిశీలిస్తే సెప్టెంబర్ 2017 నాటికి కుటుంబాల ఆస్తుల విలువ 9.7 శాతం ఎక్కువగా పెరుగుదలను సూచించింది. అయితే అదే అంతకుముందు ఏడాది 2016 సెప్టెంబర్ కు ముందు వారి ఆస్తుల విలువలో 17.1 శాతం పెరుగుదల ఉండేది. మన దేశంలోని పౌరులు స్వతహాగా పొదుపు పాటించి ఆర్థిక వ్యవస్థకు నిధులు సమకూర్చే స్వభావం లేని వారని, అయితే ఆ కుటుంబాల ఆర్థికపరంగా ఆస్తుల విలువ 2016-17 మూడవ త్రైమాసికంలో తిరగమన మార్గంలోకి మారింది. సెప్టెంబర్ 2017 నాటికి జీడీపీలో 8.7 శాతం మేరకే కుటుంబాల అధీనంలో నగదు రూపక ఆస్తులు మిగిలాయి. అదే నోట్ల రద్దుకు ముందు వారి దగ్గర 10.6 శాతం ఈ ఆస్తులు ఉండేవని నివేదిక సూచిస్తోంది. ఇక మ్యూచువల్ ఫండ్స్‌లో జమచేసే మొత్తాలు నోట్ల రద్దుకు ముందు కేవలం 10.6 ఉండగా ఆ తర్వాత అవి 12.5 శాతానికి పెరిగాయి. అంటే ప్రజలు తమ దగ్గర ఉన్న నగదును ఈ ఫండ్స్‌లోకి మళ్లించినట్టు స్పష్టమవుతుంది. అదే విధంగా 2015-16లో దేశంలో జాతీయ వినియోగ ఆదాయం (నేషనల్ గ్రాస్ డిస్పోజబుల్ ఇన్‌కమ్)తో పోల్చినప్పుడు 10.9 శాతం మాత్రమే కాగా అది 2016-17లోకి వచ్చే సరికి 11.7 శాతానికి పెరిగింది. ప్రధానమైన విషయం ఏమిటంటే కుటుంబాల పొదుపు వాటా (జీడీపీతో పోలిస్తే) 2011-12లో 23.6 శాతం ఉండగా అది 2015-16 నాటికి 19.2 శాతానికి పడిపోయింది. అంటే దేశప్రజలు నగదు దాచుకోవడాన్ని పూర్తిగా వదిలేసినట్టు కనిపిస్తుంది.

సంక్షిప్తం

## టిల్లర్‌సన్‌కు ఉద్వాసన !

### పోంపియోకు అమెరికా విదేశాంగ మంత్రి బాధ్యతలు

**వాషింగ్టన్ :** అమెరికా విదేశాంగ మంత్రి పదవి నుంచి రెక్స్ టిల్లర్‌సన్‌ను తొలగించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. ఆయన స్థానంలో సీఐఏ ( సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫ్ అమెరికా ) డైరెక్టర్ మైక్ పోంపియోను నియమించనున్నట్టు తెలిపారు. టిల్లర్‌సన్ కంటే పోంపియో సమర్థవంతంగా విదేశాంగ శాఖ బాధ్యతలు నిర్వర్తించగలరని ట్రంప్ తన వ్యక్తిగత ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ఉత్తరకొరియాతో పాటు పలు దేశాలతో వాణిజ్య సంబంధాలపై అమెరికా కీలక చర్చలు జరుపనుంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో మార్పులు చేపట్టనున్నట్టు ట్రంప్ గతనెలలో ప్రకటించారు. ఎగ్జాన్‌మొబిల్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టిల్లర్‌సన్‌కు గతేడాది ట్రంప్ అమెరికా విదేశాంగ మంత్రి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే.

## యుపి ప్రభుత్వానికిమానవ హక్కుల కమిషన్ నోటీసులు

**న్యూఢిల్లీ :** ఒక వ్యక్తికి బస్సు ప్రమాదంలో కాలు తెగిపోగా ఆ వ్యక్తికి అదే కాలును తలగడగా ఉపయోగించిన సంఘటనపై ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి, కేంద్ర ఆరోగ్య శాఖకు జాతీయ మానవహక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. 'ఇంత ఘోరమైన చర్యను అర్థం చేసుకోవడం కూడా చాలా కష్టమైన విషయం'గా కమిషన్ వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిగి, దోషులపై కఠిన చర్య తీసుకోవాలని తెలిపింది. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా అన్ని ఆసుపత్రులకు మార్గదర్శకాలు జారీ చేయాలని సూచించింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఝాన్సీలోని మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కాలేజ్‌లో ఈ దారుణమైన సంఘటన జరిగింది. ఈ సంఘటనపై పూర్తి నివేదిక కోరుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి మానవ హక్కుల కమిషన్‌కు, కేంద్ర ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖలను నోటీసులు జారీ చేసినట్లు కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

## సూచనల్లో తలెత్తిన గందరగోళమే నేపాల్ విమాన ప్రమాదానికి కారణం

**ఖాట్మండ్ :** నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో క్రాష్‌ల్యాండింగ్ అయిన విమానం పైలట్‌కు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు మధ్య జరిగిన సంభాషణలో గందరగోళం కారణంగానే కూలినట్టు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా, 67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో బయలుదేరిన యూఎస్-బంగ్లా ఎయిల్‌లైన్స్‌కు చెందిన విమానం ఖాట్మండ్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం లో ల్యాండింగ్ అవుతున్న క్రమంలో సోమవారం కూలిపోయింది. ఈ ఘటనలో 50 మంది చనిపో యారు. అయితే, విమానం కిందికి దిగడానికి తక్కువ ఎత్తులో ఉన్న సమయంలో ల్యాండింగ్ సూచనల్లో గందరగోళం నెలకొందని, ఒక్కసారిగా భూమిని తాకి మంటలు చెలరేగాయని అధికారులు భావిస్తున్నారు.

▮ తృటిలో తప్పిన ముప్పు

**గాజా స్ట్రిప్‌లో నీటి శుద్ధిక్షేత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్తుండగా సాయుధుల దాడిలో పాలస్తీనా ప్రధాని రమి హమ్దల్లా తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఆయన కాన్వాయ్‌లో ధ్వంసమైన వాహనాన్ని తరలిస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడవచ్చు.**



## రష్యా జోక్యం లేదు

### అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంపై తేల్చి చెప్పిన సభాకమిటీ

**వాషింగ్టన్ :** డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో రష్యా జోక్యమేమీ లేదని ప్రతినిధుల సభా కమిటీ తేల్చి చెప్పింది. ఈ మేరకు ముసాయిదా నివేదికను రూపొందిం చింది. కమిటీ చేసిన ఈ నిర్ధారణ వైట్‌హౌస్‌ను సంతృప్తి పరిచింది. కానీ డెమోక్రాట్లు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దాదాపు ఏడాది పాటు దర్యాప్తు జరిపిన మీదట ఆ కమిటీకి నేతృత్వం వహిస్తున్న టెక్సాస్ రిపబ్లికన్ ఎంపి మైక్ కొనావే మాట్లాడుతూ, కమిటీ పలువురు సాక్షులను ఇంటర్వ్యూ చేసిందని చెప్పారు. డెమోక్రాట్లతో ఈ నివేదికపై మాట్లాడ నున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో రష్యా జోక్యం వుందనడానికి ఎలాంటి సాక్ష్యా ధారాలు లభించలేదని కొనావే విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. జోక్యం వుందని విశ్వసించేవారు బహుశా చాలా గూఢచారి నవలలు చదివి వుంటారని ఆయన వ్యాఖ్యానిం చారు. "కొంతమేరకు తప్పుడు తీర్పు వుందని మేం కనుగొన్నాం. అనుచితమైన సమావేశాలు, ఆ సమావేశాలు నిర్వహించడం వెనుక అనుచితమైన నిర్ణయం వుంది. టామ్ క్లాన్సీ లేదా విన్స్ ఫ్లైన్ లేదా మరికొందరు వీరంతా కలిసి పరస్పరం సమావేశం కావడం కానీ లేదా సంబంధాలు కలిగి వుండడం కానీ జరిగివుండవచ్చు. ఇదంతా కలిసి ఒక రకమైన కల్పిత కథలా, గూఢచారి థ్రిల్లర్‌లా మారింది." అని కొనావే పేర్కొన్నారు. కొద్ది గంటల తర్వాత అధ్యక్షుడు ట్రంప్ ఈ నిర్ధారణలపై స్పందిస్తూ ట్వీట్ చేశారు. "14మాసాల పాటు కూలంకషంగా దర్యాప్తు జరిపిన సభా ఇంటెలిజెన్స్ కమిటీ 2016 అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ట్రంప్ ప్రచారంలో రష్యా జోక్యం చేసుకుందనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని కనుగొంది." అని ట్వీట్ చేశారు.



## మహిళలపై దాడులు మానవ హక్కులకు సవాళ్లే

### యుఎన్ఒ సెక్రటరీ జనరల్ గుటెరస్

**యుఎన్ఒ:** మహిళలపై దాడులు, హింస ప్రస్తుతం మానవ హక్కులకు ఛాలెంజ్‌గా మారినట్లు ఐక రాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియస్ గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను తాను గొప్ప స్త్రీవాదిగా పేర్కొన్న ఆయన అందరూ మహిళల హక్కులను సాధించటానికి, సమానత్వాన్ని సాధించటానికి చేయూతనివ్వాలని సూచించారు. ఈనెల 23 వరకు జరిగే ఐక రాజ్య సమితి సమావేశాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. మహిళలపై దాడులకు, వివక్షకు అనేక సంఘాలు, కంపెనీలు, ఆర్థిక వ్యవస్థలు బాధ్యులని వ్యాఖ్యానించారు. మహిళల, బాలికల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన కీలకమైన సమయమిదన్నారు. 'మీటూ', ' టైమ్ అప్' సోషల్‌మీడియాలో వస్తున్న కదలికలపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నా యన్నారు. మహిళలు శాస్త్రవేత్తలుగా, గణిత శాస్త్రజ్ఞులుగా మార్గదర్శకులుగా ఉన్నారు. అట్టడుగున ఉన్న గ్రామీణ మహిళల, బాలికల సాధికారతకు కృషి చేయాల్సిన అవసరముందని సూచించారు. ప్రపంచ వ్యాప్త పరిశోధన, అభివృద్ధి తదితర రంగాలలో 30శాతం కంటే తక్కువగానే మహిళలున్నారని పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డులకు పురుషులు 33 మంది ఎంపిక కాగా, కేవలం ఆరుగురు మహిళలకే అవార్డులు దక్కాయన్నారు.

# పాలస్తీనా ప్రధానిపై హత్యాయత్నం

## తృటిలో తప్పించుకున్న వైనం

**రమల్లా :** పాలస్తీనా ప్రధాని రమి హమ్దల్లా గాజాలో తనపై జరిగిన హత్యా ప్రయత్నం నుండి తృటిలో తప్పించుకున్నారు. గాజా స్ట్రిప్‌లో జరగనున్న ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా హమ్దల్లాను కాన్వాయ్‌ని లక్ష్యంగా చేసుకొని సాయుధులు పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ పేలుడులో ప్రధాని ప్రాణాలతో క్షేమంగా బయటపడగా కాన్వాయ్‌లోని ఓ వాహనం ధ్వంసమైంది. ఐదుగురుకి స్వల్పగాయాలయ్యాయి. ఇజ్రాయిల్ నియంత్రణలోని ఏరేజ్ చెక్‌పోస్టును కాన్వాయ్ దాటివెళ్లిన కొద్దిసేపటికే పేలుడు సంభవించినట్లు ఆల్ జజీరా వార్తా సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. ఉత్తర గాజాలో ఉన్న ఈ ప్రాంతాన్ని పాలస్తీనియన్లు బేయిట్ హనౌన్‌గా పిలుస్తారు. దాడి నుంచి తప్పించుకున్న అనంతరం ఆయన షెడ్యూలు ప్రకారం హాజరావ్వాల్సిన వేడుకకు హాజరయ్యారు. నీటిశుద్ధి క్షేత్రాన్ని ప్రారంభించి ప్రసంగించారు.



**నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న పాలస్తీనా ప్రధాని రమి హమ్దల్లా**

**తీవ్రంగా ఖండించిన పాలస్తీనా అధ్యక్షభవనం**

పాలస్తీనా అధ్యక్ష భవనం ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. ఇందుకు కారణం హమస్ అని పేర్కొంది. అధ్యక్షుని ప్రతినిధి నబిల్ అబు రుదెనె మాట్లాడుతూ, ఏకాభిప్రాయంతో వ్యవహరించే ప్రభుత్వంపై జరిగిన ఈ దాడి పాలస్తీనా ప్రజల ఐక్యతపై జరిగిన దాడిగా అభివర్ణించారు. గాజాలోకి ప్రవేశించగానే ప్రధాని కాన్వాయ్‌పై దాడి జరిగిందని, ఈ దాడి ఎవరు చేసినా, దానివల్ల ఇజ్రాయిల్ ఆక్రమణ ప్రయోజనాలే నెరవేరతాయని భావించాలని అధ్యక్ష భవనం పేర్కొంది. ప్రమాదకరమైన ఈ పరిణామంపై చర్చించేందుకు త్వరలో అధ్యక్షుడు అబ్బాస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ దాడికి పాల్పడిన వారు పాలస్తీనా ప్రయోజనాలను నీరుగార్చి, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కావాలన్న పాలస్తీనా ప్రజల హక్కును నిరాకరించాలని భావిస్తున్నారని, వారు నిరాశా నిస్పృహలతో చేసిన ప్రయత్నమే ఈ దాడి అని అధ్యక్ష భవనం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలావుండగా వెస్ట్‌బ్యాంకులో 22 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వెస్ట్‌బ్యాంకు, జెరూసలేంలో సోమ, మంగళవారాల్లో విస్తృతంగా సోదాలు జరిపిన ఇజ్రాయిల్ బలగాలు వీరిని అరెస్టు చేసినట్లు పాలస్తీనియన్ ప్రిజనర్ల సమాఖ్య తెలిపింది.

## కృత్రిమ మేధస్సు విప్లవంలో అమెరికాను అధిగమిస్తున్న చైనా

**బీజింగ్ :** కృత్రిమ మేధస్సు (ఎఐ) విప్లవ రంగంలో అమెరికాను చైనా అధిగమిస్తోందని పరిశోధనా ఫలితాలు వెల్లడిస్తున్నాయి. పరిశోధన, వినియోగం ఈ రెండింటిలోనూ అమెరికాను మించి చైనా ముందుకు సాగుతూ కొత్త శకంలోకి ప్రవేశిస్తోందని పేర్కొంటున్నాయి. పరిశోధన అనేది అన్నింటికీ కీలకం. కృత్రిమ మేధస్సు పరిశోధనలకు సంబంధించి ఆసియా ప్రధాన కార్యాలయాన్ని బీజింగ్‌లో పెట్టాలన్న గూగుల్ నిర్ణయంలోనే విషయం తేటతెల్లమవుతోంది. మార్కెట్‌లో చైనాకున్న స్థానం వల్ల ఈ ఎంపిక జరగలేదు. చైనా పరిశోధకులకు వున్న విశిష్టమైన నైపుణ్యాలు, వారి అర్హతలు, ప్రమాణాలు వీటన్నింటినీ దృష్టిలో వుంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఒక ఉదాహరణను చూద్దాం. కృత్రిమ మేధస్సు రంగ ఆవిష్కరణల్లో ప్రపంచంలో నాయకత్వ స్థానంలో వున్నది ఎవరంటే చైనా అనే చెప్పవచ్చు. గతేడాది ఇందుకు సంబంధించిన పోటీ ఫలితాలు చూస్తే 27 బృందాలు పోటీ పడగా అందులో సగానికి పైగా బృందాలు చైనా కేంద్రంగా వున్న పరిశోధనా బృందాలే. చైనా యూనివర్శిటీలు లేదా కంపెనీల నుండి వచ్చిన నిపుణులే. విజేతలు కూడా చైనాకు చెందినవారే. అయితే, కృత్రిమ మేధస్సు అభివృద్ధి, పేటెంట్ హక్కులకు సంబంధించి చూసినట్టైతే అమెరికానే ఇంకా నాయకత్వ స్థానంలో వుంది, అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, అమెరికా, చైనాకు మధ్య గల అంతరం చాలా వేగంగా తగ్గిపోతోంది. 2016నాటికి అమెరికా కన్నా ఎక్కువగా చైనా, కృత్రిమ మేధస్సు రంగంలో లోతైన విశ్లేషణలు చేస్తూ అనేక వ్యాసాలను ప్రచురించింది. అమెరికాతో పోలిస్తే చైనా కృత్రిమ మేధస్సు అభివృద్ధికి గల మరో బలం అసాధారణమైన డేటా యూకో సిస్టమ్. ఎఐ అల్గారిథమ్స్ (గణింపు లేదా ఇతర సమస్య పరిష్కార ఆపరేషన్లలో అనుసరించాల్సిన క్రమం లేదా నిబంధనలు) అభివృద్ధికి ఈ డేటాపైనే ఆధారపడాల్సి వుంది. 2017 చివరినాటికి చైనాలో 772కోట్ల మంది ఇంటర్‌నెట్ వినియోగదారులు వున్నారు. వారిలో 97.5శాతం మంది స్మార్ట్‌ఫోన్ వినియోగించేవారే. ఈ జనాభా కారణంగా టెక్నాలజీ కంపెనీలకు అసాధారణ స్థాయిలో డేటా అందుతుంది. ఈ డేటాను వారి అల్గారిథమ్స్‌లో ఉపయోగించుకోవడానికి తద్వారా ఖచ్చితమైన ఎఐ వ్యవస్థలను రూపొందించడానికి వీలు కుదురుతుంది.

## జె-20 స్టెల్త్‌కు అదనపు హంగులు

జె-20 స్టెల్త్ యుద్ధ విమానాన్ని మెరుగుపరిచి, దానికి మరిన్ని హంగులు జోడించి సామర్థ్యాన్ని పెంచనున్నట్లు ఈ యుద్ధ విమానం చీఫ్ డిజైనర్ యాంగ్ పేర్కొన్నారు. కేవలం శత్రు వైమానిక రక్షణ వ్యవస్థలోకి దూసుకెళ్ళడమే కాకుండా దాడులు చేసే సామర్థ్యాన్ని పెంచాలన్నది లక్ష్యమని చెప్పారు. చైనా పౌర విమానయాన పరిశ్రమలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగ డిప్యూటీ డైరెక్టర్, చైనా సైన్స్ అకాడమీ సభ్యుడైన యాంగ్ వెయి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. రాడార్‌కు కూడా దొరక్కుండా వెళ్ళగలిగే జె-20 రకాలను డిజైనర్లు అభివృద్ధి పరుస్తారని తెలిపారు.

## అమెరికాలో మరిన్ని రాష్ట్రాలకు విస్తరిస్తున్న టీచర్ల సమ్మె




**ఒక్లహోమా :** మరింత మెరుగైన వేతనాలు కోసం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలపరచాలని కోరుతూ పశ్చిమ వర్జీనియా టీచర్లు, స్కూలు సిబ్బంది 9రోజుల పాటు సమ్మె చేసిన నేపథ్యంలో ఆ పోరాటం ఒక్లహోమా, కెంటకీ, అరిజోనా, ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. ప్రభుత్వ విద్యా రంగానికి పెద్ద మొత్తంలో నిధుల్లో కోత విధించాలని ట్రంప్ ప్రభుత్వం సమాయత్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త సమ్మెలు, నిరసనలు కొనసాగుతున్నాయి. అమెరికా విద్యా శాఖ మంత్రి బెట్సే డివోస్ ఆదివారం రాత్రి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, వందల కోట్ల డాలర్లను ప్రభుత్వం విద్యపై ఖర్చు పెడుతున్నా పెద్దగా ఫలితాలు రావడం లేదని అన్నారు. ఈ తరుణంలో నిధుల్లో కొంతమేరకు కోత విధించాలని భావిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులపై నిధులు ఖర్చు పెట్టాలి కానీ స్కూలు భవనాలు, సంస్థలపై కాదని వ్యాఖ్యానించారు. దాదాపు దశాబ్ద కాలం నుండి అంటే 2008 ఆర్థిక మాంద్యం తలెత్తినప్పటి నుండి పలు రాష్ట్రాలు స్కూలు నిధుల్లో కోత విధిస్తూ వచ్చాయి.

## సింగపూర్ డీల్‌ను నిషేధించిన ట్రంప్

**వాషింగ్టన్:** సింగపూర్‌కు చెందిన బ్రాడ్‌కామ్ అనే సంస్థ 117 బిలియన్ డాలర్లు విలువచేసే అమెరికాకు చెందిన క్వాల్‌కామ్ అనే చిప్స్ సంస్థను టేకోవర్ చేసుకునే ఓ పెద్ద వ్యాపార లావాదేవీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం నిలిపివేశారు. అందుకు ఆయన జాతీయ భద్రతా కారణమేనంటూ సాకు చూపారు. ప్రతిపాదిత ఆ టేకోవర్‌ను తక్షణం శాశ్వతంగా రద్దు చేసుకోమని ఆదేశించారు. ఏ రూపంలోనైె ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మరే రూపంలోనైనా కొనుగోలుదారుడు క్వాల్‌కామ్‌ను తీసుకోవడాన్ని ని షేధించామంటూ ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుని ఉత్తర్వులను సమీక్షిస్తున్నామని బ్రాడ్‌కామ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

మొదటి పేజీ తరువాయి

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల మందుపాతర

వస్తున్నారు. మావోయిస్టులు పోలీసులే లక్ష్యంగా అమర్చిన భారీ మందుపాతర పేల్చటంతో వాహనం గాలిలో తేలిపోయి కింద పడింది. దీంతో తొమ్మిదిమంది జవాన్లు అక్కడిక్కడే మృతి చెందారు. జవాన్ల శరీరాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఎఎస్ఐ ఆర్‌కెఎస్ తోమార్, హెడ్‌కానిస్టేబుల్ అజయ్‌కుమార్ యాదవ్, మనోరంజన్ లక్రా, జితేంద్రసింగ్, షోబిత్‌కుమార్‌శర్మ, లక్ష్మణ్, మనోజ్‌సింగ్, ధర్మేంద్రసింగ్, హెచ్‌ఎస్ చంద్ర మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జవాన్లు మడకం కుమార్, రాజేష్ కుమార్‌లను హెలీకాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ఈనెల 5న తెలంగాణా రాష్ట్రంలోని జయశంకర్ జిల్లా తోండపాల్ అటవీ ప్రాంతంలో 10 మంది మావోయిస్టులను గ్రేహౌండ్ బలగాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఈ ఘటనలో జవాను సునీల్ కూడా మృతి చెందాడు. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు ఈనెల 9న ఛత్తీస్‌గఢ్, తెలంగాణా రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో బంద్ విజయవంతమైంది. నాటి నుంచి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు మంగళవారం మెరుపు దాడి చేసి మందుపాతర పేల్చారు. ఈ ఘటన అనంతరం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుక్మా తదితర జిల్లాల్లో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మృతదేహాలను రాజధాని రాయ్‌పూర్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటన పట్ల ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈనెల 11న ముఖ్యమంత్రి ఇదే జిల్లాలోని కుంట తాలూకాలో ఇంజరం వద్ద బహిరంగ సభకు హాజరయ్యారు. నాలుగు రోజుల వ్యవధిలోనే మావోయిస్టులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని మందుపాతర పేల్చడం గమనార్హం.

## అప్పటివరకూ ఆధార్ తప్పనిసరి కాదు

ధర్మాసనం తీర్పు వెల్లడించే వరకు నిరవధికంగా అనుసంధాన గడువును పొడిగిస్తున్నట్టు వెల్లడించింది. అప్పటివరకు బ్యాంకు ఖాతాలకు, మొబైల్ ఫోన్ నంబర్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి కాదని తెలిపింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ తీర్పు వెలువరించింది. పలు సంక్షేమ పథకాలు, సేవలకు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ గతేడాది కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దీనిపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆధార్ అనుసంధానం విశ్వసనీయం కాదని పేర్కొంటూ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆ తర్వాత వీటిని రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించింది. ఆధార్ అనుసంధాన గడువును మార్చి 31వరకు పెంచుతామని కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. అయితే, తాజాగా మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఆధార్ గడువును నిరవధికంగా పొడగించింది. దీనిపై కోర్టు తీర్పు వెల్లడించేంతవరకు గడువును పెంచుతున్నట్టు స్పష్టం చేసింది. అప్పటిదాకా మొబైల్ నంబర్లు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరేం కాదని తెలిపింది. అయితే సంక్షేమ పథకాలు, సేవలు, రాయితీలకు మాత్రం ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానించాలని.. ఆ నిబంధన కొనసాగుతుందని పేర్కొంది.

## మరో భారీ స్కాం

ప్రకారం రీఫైండ్ నోబుల్ అల్లాయిస్‌ను ఉత్పత్తి చేయడానికి లైసెన్స్ పొందింది. 2009 నుండి ఫోర్జరీ డాక్యుమెంట్లతో బ్యాంకుల నుండి భారీ మొత్తంలో రుణాలు పొందింది. రెండు మూడు బ్యాంకులు కలిసి దాదాపు 4 వేల కోట్ల రూపాయలను ఇండియన్ టెక్నోమాక్ సంస్థకు అప్పుగా ఇచ్చారు. ఫోర్జరీ డాక్యుమెంట్ల సహాయంతోనే భారీ మొత్తంలో అమ్మకపు పన్ను రాయితీని కూడా పొందింది. 2,175 కోట్ల రూపాయల దాకా వాట్‌ను ఆ సంస్థ ఎగవేసినట్లు అధికారులు తేల్చారు. ఇది కాక మరో 750 కోట్ల రూపాయల దాకా ఆదాయపు పన్నును కూడా చెల్లించలేదు. 2014లో సంస్థను మూసివేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అప్పుడే కొన్ని బ్యాంకులు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారయంత్రాంగంలో చలనం లేదు. తాజాగా శాసనసభలో ప్రస్తావనకు రావడం, మీడియా కూడా జోక్యం చేసుకోవడంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారులు ప్రకటించారు. ఇంత పెద్ద మొత్తంలు ఎగవేసిన ఇండియన్ టెక్నోమాక్ సంస్థ యాజమాన్యం ఇంకా భారత్‌లోనే ఉందా? విదేశాలకు ఉడాయించిందా అన్న అంశంపై స్పష్టత రాలేద.

# 19న హోదాపై అఖిలపక్ష సమావేశం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోరుతూ ఈనెల 19న ఆంధ్ర మేధావుల ఫోరమ్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయపార్టీలతో విజయవాడలో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ప్రత్యేకహోదా విభజన హామీల అమలు సాధనా సమితి తెలిపింది. బుధవారం స్థానిక ఐలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేకహోదా అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రత్యేకహోదా విభజన హామీల సాధనా సమితి సఫలీకృతమైందన్నారు. బిజెపి మినహా అన్ని పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి హోదా కోసం పోరాడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాయలసీమపై మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదన్నారు. ఆంధ్రమేధావుల ఫోరమ్ అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్డీయే మినహా అన్ని పార్టీలు, వర్గాలు ఒక్కటై రాష్ట్ర ప్రయోజనాలకై పోరాడుతున్నాయన్నారు. హోదా కోసం ఎవరైతే కలిసి పోరాటం చేయరో వారిని బహిష్కరించాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యా సంస్థలకు నిధులు కేటాయించక పోతే, అవి ఎప్పటికి నిర్మాణమవుతాయని ఆయన ప్రశ్నించారు. వెనుక బడిన జిల్లాలకు ముష్టి వేసినట్లు రూ.50 కోట్లు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. బిజెపి నేతలు ఆంధ్రలో ఉంటూ గుజరాతీ పాటలు పాడుతున్నారని, అమిత్‌షాపై కెసిఆర్ మాట్లాడిన మాటలతో తాము ఏకీభవిస్తున్నామన్నారు. ఆత్మగౌరవానికి అలుపెరగని పోరాటం చేస్తున్నామని శ్రీనివాస్ పేర్కొన్నారు. సినీ నటుడు శివాజీ మాట్లాడుతూ ప్రత్యేకహోదా అనేది రాష్ట్ర ప్రజలందరిదన్నారు. నమ్మించి ద్రోహం చేస్తే నమ్మకద్రోహమంటారన్నారు. ఇప్పటి నుండి మోసం చేసిన వారిని మనిషి వా... మోడీ వా అని పిలుచుకుందామన్నారు. రాష్ట్రానికి మోసం చేసే వాళ్లకు కేంద్రంలో పదవులు లభిస్తున్నాయని శివాజీ అన్నారు. ప్యాకేజీ విషయంలో వెంకయ్యనాయుడు మోసం చేస్తారని ముఖ్యమంత్రికి ముందే చెప్పానన్నారు. ఏ రాష్ట్రం కట్టిన పన్నులు ఆ రాష్ట్రానికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకహోదాను ప్రకటించకపోతే ఆమరణ దీక్ష చేస్తాననని శివాజీ తెలిపారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గుంటూరులో స్థిర నివాసాన్ని ఏర్పరచుకోవడం సంతోషంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ప్రతిపక్షం లేకపోవడంతో కిక్కే లేదు

### మీడియాతో మంత్రి సోమిరెడ్డి చిట్‌చాట్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

శాసనసభ సమావేశాలకు ప్రతిపక్షం హాజరుకాకపోవడంతో సభలో కిక్ లేదని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం శాసనసభ మీడియా పాయింట్‌లో కొద్ది సేపు విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. శాసనసభ సమావేశాలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రజాసమస్యల్ని సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, పరిష్కారం కనుగొనడం జరుగుతోందన్నారు. పలు కేసుల్లో నిందితునిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రధాని మోడీ 45 నిముషాలు ఆంతరంగిక సమావేశానికి అనుమతి నివ్వడంపై ప్రజలు ప్రశ్నించే పరిస్థితులు వచ్చాయన్నారు. దేశ వ్యాప్తంగా పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న లాలూ ప్రసాద్ యాదవ్, శశికళ, మధుకోడా, నీరవ్‌మోడీ లాంటి వారు కూడా ప్రధానితో ఆంతరంగిక సమావేశం కావాలని అడుగుతున్నారని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. రాజకీయపార్టీల సిద్ధాంతాలు మారిపోయి కొత్తపుంతలు తొక్కుతున్నాయన్నారు. సిఎం చంద్రబాబు ఉత్తర, దక్షిణ భారత దేశం అనడంలో తప్పులేదని సోమిరెడ్డి అభిప్రాయపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపడం తగదన్నారు. కేంద్ర హోంశాఖ చెప్పిందే మీడియా చెబుతోందని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇప్పటికైనా ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాట వినని రాష్ట్రాలను ఒక ఓటు రెండు రాష్ట్రాలుగా విడగొడుతోందంటూ బిజెపి విధానాలను తప్పుపట్టారు. నూతనంగా ఆంధ్ర, రాయలసీమ అంటూ కొత్త రాగం అందుకుందన్నారు. అధికారం, ధనం ముఖ్యం కాదని, రాజకీయాల్లో నైతిక విలువలు ముఖ్యమన్నారు. కేంద్రంలోని బిజెపి ఉత్తరాది రాష్ట్రాలపై ఉన్న ప్రేమ దక్షిణాది రాష్ట్రాలపై లేదన్నారు. విభజన బిల్లులోని అంశాలను తప్పని సరిగా అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



## రైల్వే జోన్ హామీ కేసులో రైల్వే శాఖ కార్యదర్శి, సిఎస్‌లకు హైకోర్టు నోటీసులు

**ప్రజాశక్తి - హైదరాబాద్**

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామనే హామీపై ఏం చేస్తున్నారో వివరణ ఇవ్వాలన్న ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఆ చట్టం ప్రకారం రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, అది కూడా అనంతపురం జిల్లాలోని గుంతకల్లు రైల్వే డివిజన్ ఉన్నందున గుంతకల్లులోనే రైల్వే జోన్ ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిల్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. రైల్వే జోన్ హామీ చట్టంలో ఉందని, దీనిపై ఏం చర్యలు తీసుకునేదీ తెలపాలని కేంద్ర రైల్వే శాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ నోటీసులు ఇచ్చింది. అనంతపురం జిల్లాకు వాస్తవ్యుడు శ్రీనివాస చౌదరి వేసిన పిల్‌ను గతంలో ఇదే తరహాలో దాఖలైన కేసుతో జత చేయాలని బెంచ్ నిర్ణయించింది. ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ 13వ షెడ్యూల్ ప్రకారం రైల్వే జోన్‌ను అపాయింటెడ్ డే నుంచి ఆరు నెలల్లోపు కేంద్రం నిర్ణయం తీసుకోవాలన్న చట్టస్ఫూర్తిని నీరుగార్చుతోందని పిటిషనర్ లాయర్ వాదించారు.

మొదటి పేజీ తరువాయి

## కోమటి రెడ్డి సభ్యత్వం రద్దు

తీసుకుంది. మంగళవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే.. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి టి హరీశ్‌రావు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభలో అనుచితంగా ప్రవర్తించిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ శాసనసభ సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు స్పీకర్ మధుసూధనచారి ప్రకటించారు. సిఎల్‌పి నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, చిన్నారెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, డీకే అరుణ, భట్టి విక్రమార్క, రామ్మోహన్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, పద్మావతిరెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు.

**శాసనమండలిలో..**

ఇదే అంశంపై శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్‌అలీ సహా ఎమ్మెల్సీలు పొంగులేటి సుధాకర్ రెడ్డి, సంతోష్, దామోదర్ రెడ్డి, ఆకుల లలిత, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ చేసినట్టు డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ప్రకటించారు.

**టిడిపి, బిజెపి ఎమ్మెల్యేలతో జానా భేటీ**

టిడిపి, బిజెపి ఎమ్మెల్యేలతో సిఎల్‌పి నేత జానారెడ్డి భేటీ అయ్యారు. సభలో జరిగిన పరిణామాలపై వారు చర్చించారు. ఏకపక్షంగా ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఎమ్మెల్యేలు ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని టిపిసిసి కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క ఖండించారు.

**జానారెడ్డి ఏం చేశారో రిపోర్టుంది; సిఎం కెసిఆర్**

తాము జానారెడ్డిని ఊరికే సస్పెండ్ చేయలేదని సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. "ఆయన ఏం చేశారో మీకు తెలుసా? మా దగ్గర రిపోర్టులు లేవా? ఉట్టిగానే సస్పెండ్ చేస్తామా?' అని అన్నారు. జానారెడ్డిని సస్పెండ్ చేయడం సరికాదంటూ బిజెపి పక్షనేత కిషన్‌రెడ్డి సభలో వ్యాఖ్యానించడంతో.. కెసిఆర్ పై విధంగా వ్యాఖ్యానించారు. సభ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి సభ్యుడు గౌరవించాలని కోరారు. ముగ్గురు సభ్యులు సభ నడిపిస్తామంటే ఎలా? అని ప్రశ్నించారు. ఇటువైపు ఉన్న 90 మంది సభ్యులు మాట్లాడకుండా ఉండాలా? అని కెసిఆర్ నిలదీశారు. అరాచక శక్తులు ఏ రూపంలో ఉన్న సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయ నాయకుల ముసుగులో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

**కాంగ్రెస్ 48 గంటల దీక్ష**

ఇద్దరు సభ్యుల సభ్యత్వం రద్దు, మిగిలిన సభ్యుల సస్పెన్షన్‌ను నిరసిస్తూ..కాంగ్రెస్ ఆందోళనలు చేపట్టింది. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంగళవారం గాంధీభవన్‌లో 48 గంటల 'ప్రజాస్వామ్య పరిరక్షణ నిరాహార దీక్ష'కు దిగారు. ఈ దీక్ష గురువారం సాయంత్రం వరకు జరుగు తుంది. ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు, సస్పెన్షన్‌పై న్యాయస్థా నాన్ని ఆశ్రయిస్తామని టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమారరెడ్డి ప్రకటించారు.

## ఏపి, తెలంగాణకు వేర్వేరుగా బార్ కౌన్సిళ్లు

మొదటి పేజీ తరువాయి

వేర్వేరుగా బార్ కౌన్సిళ్ల ఏర్పాటు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ లోపు ఏర్పాటు చేయాలని సుప్రీం ధర్మాసనం రెండు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. జూన్ 2న తెలుగు రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు ఉన్న నేపథ్యంలో.. ఈ కౌన్సిల్స్ కనుక ఏర్పాటు చేస్తే అప్పటి నుంచే రెండు రాష్ట్రాలకు రెండు వేర్వేరు బార్ కౌన్సిల్స్ అందుబాటులోకి వస్తాయి.

## ప్రతిపక్ష నేతలకు సోనియా విందు

మొదటి పేజీ తరువాయి

సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రాంగోపాల్ యాదవ్, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ నుంచి సతీష్ చంద్ర మిశ్రా, డిఎంకెకు చెందిన కనిమొళి, రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షులు అజిత్ సింగ్, రాష్ట్రీయ జనతాదళ్‌కు చెందిన తేజస్విని యాదవ్, మీసా భారతి, హిందుస్తానీ అవామ్ మోర్చాకు చెందిన జితన్ రామ్ మంఝీ, జమ్మూకాశ్మీర్‌లోని నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నుంచి సుదీప్ బంధోపాధ్యాయ, జెడి-ఎస్ నుంచి కుపెందర్ రెడ్డి, ఎఐయుడిఎఫ్ నుంచి బద్రుద్దీన్ అజ్మల్, ఈ విందులో పాల్గొన్నారు. సిపిఎం నుంచి మహమ్మద్ సలీమ్, టికె రంగ రాజన్, సిపిఐ నుంచి డి రాజా ఈ విందులో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, గులాం నబీ అజాద్, మల్లికార్జున ఖార్గే, అహ్మద్ పటేల్, ఎకె ఆంటోని పాల్గొన్నారు. ఈ విందుకు తెలుగుదేశం పార్టీ, తెలంగాణ రాష్ట్ర సమితి, ఒడిషాలోని బిజూ జనతాదళ్‌ను ఆహ్వానించలేదు.

## సభ్యత్వం రద్దుపై గెజిట్ విడుదల

### మరో ఇద్దరిపై వేటుకు రంగం సిద్ధం.?

**ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో**

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీ కార్యాలయం మంగళవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు స్థానాలు ఖాళీ అయినట్టు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సమాచారం అందించింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ అనుచితంగా ప్రవర్తించారంటూ వారి సభ్యత్వాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా వీడియో పుటేజీలు పరిశీలించిన అసెంబ్లీ కార్యాలయం మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా అనుచితంగా ప్రవర్తించినట్టు గుర్తించినట్లు సమాచారం. అయితే వీరిపై వేటు వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

# లైంగిక వేధింపుల గురించి మాట్లాడితే కెరీర్ ముగిసిపోయినట్టే

– ఇలియానా



ఇలియానా


కాస్టింగ్ కౌచ్ (సినిమాల్లోకి కథానాయిక ఎంపికప్పుడు జరిగే తతంగం, లైంగిక వేధింపులు) గురించి బహిరంగంగా మాట్లాడితే ...ఇక ఆ రోజు నుంచి మాట్లాడిన వ్యక్తి కెరీర్ ముగిసిపోయినట్టేనని ఇలియానా పేర్కొన్నారు. అలా ధైర్యంగా మాట్లాడిన కథానాయికలు ఎవరూ ఎదగలేదని తేల్చి చెప్పారు. 'వేధింపులకు గురైన వారు దాన్ని బయటపెడితే.. ధైర్యవంతులు అనొచ్చు. కానీ ఆ తర్వాత వారి కెరీర్ అక్కడితో ముగిసిపోతుంది. చాలా ఏళ్ల క్రితం దక్షిణ చిత్ర పరిశ్రమలో ఓ జూనియర్ ఆర్టిస్టుకు పెద్ద నిర్మాత నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీన్ని ఎలా ఎదుర్కోవాలని ఆమె నన్ను సలహా అడిగింది. ఇది సలహా ఇవ్వలేని సమస్య అని ఆమెకు చెప్పా. ఆమే స్వయంగా నిర్ణయం తీసుకోవాలి, ఈ విషయంలో మరో వ్యక్తి ఒత్తిడి తగదు' అని అన్నట్టు తెలిపారు. అజయ్ దేవ్‌గన్ హీరోగా ఇలియానా కథానాయికగా చేస్తున్న 'రెయిడ్' సినిమా ఈ నెల 16వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్ పనుల్లో భాగంగా బాంబే టైమ్స్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. చిత్రసీమలో లైంగిక వేధింపుల గురించి బహిరంగంగా మాట్లాడడానికి వీల్లేదని, ఒక వేళ కెరీర్‌తో పనిలేదు అనుకుంటేనే ఆ విషయాలను గురించి బహిర్గతం చేయాలని స్పష్టం చేశారు. ఎవరైతే లైంగిక వేధింపుల గురించి మాట్లాడతారో వారిని అగ్రహీరోలంతా తమ సినిమాల్లో నటించే ఛాన్స్ ఇవ్వరు. ఏకంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టేస్తారు. ఈ ఏడాది డిసెంబర్‌లో లైంగిక వేధింపుల గురించి మాట్లాడిన కథానాయిక రిచా చద్దా ఎదుర్కొన్న ఇబ్బందులే దీనికి సాక్ష్యమని అన్నారు ఇలియానా. కెవిన్ స్పాసీ (హాలీవుడ్‌లో తారలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నటుడు, నిర్మాత)తో నెట్‌ఫ్లిక్ వారు 'హౌస్ ఆఫ్ కార్డ్స్' షో చేసేవారు. వేధింపుల గురించి తెలిసి తాత్కాలికంగా ఆ షోను రద్దు చేశారు. ఒకప్పుడు ఆ షో నాకు బాగా నచ్చేది.. కానీ కెవిన్ వేధింపులకు పాల్పడ్డారని తెలిశాక చూడాలి అనిపించలేదు. ఆయన తీరు ఒక నటిగా నాకు అసహ్యాన్ని కలిగించింది' అని ఆమె చెప్పారు.

# పండక్కి ఫస్ట్ లుక్



రవితేజ

రవితేజ హీరోగా, కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందనుంది. రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న సినిమా ఫస్ట్ లుక్‌ని ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని నిర్మాత మంగళవారం తెలిపారు. 'దాదాపు అరవైశాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. రవితేజ ఇమేజ్‌కు తగినట్లుగా అభిమానులు, ప్రేక్షకులు ఆనందించేలా ఈ చిత్రముంటుంది. కల్యాణ్‌కృష్ణ గత చిత్రాల తరహాలోనే ఎంటర్‌టైన్ చేస్తుంది. ఏప్రిల్‌లో చిత్రీకరణ పూర్తిచేసి నిర్మాణానంతర పనులు ముగించుకుని మే చివరి వారంలో విడుదల చేయనున్నామ'ని తెలిపారు. 'ఫిదా' ఫేం శక్తికాంత్ కార్తీక్ సంగీతం, ఛోటా కే ప్రసాద్ కూర్పు, బ్రహ్మ కడలి కళ, ముఖేష్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు. మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాశ్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, సురేఖా వాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



ఎన్టీఆర్

# మరో రెండు వారాల్లో

ఎన్టీఆర్ అభిమానులకు శుభవార్త. ఆయన త్రివిక్రమ్ దర్శకత్వంలో చేయనున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ వచ్చే నెల నుంచి ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో జూనియర్ ఎలా ఉండబోతున్నారో మరో రెండు వారాల్లో తెలియనుంది. దీని కోసం కసరత్తులు చేస్తున్నారు. ఉన్నంతలో ఉత్తమ లుక్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్టు ఎన్టీఆర్ ట్రైనర్ స్టీవెన్స్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ చిత్రం కోసం మొత్తం ఎన్టీఆర్ అవతారమే మారిపోతుందని చెప్పారు.

**ఫొటో షూట్ పూర్తి**

ఎన్టీఆర్, రామ్ చరణ్‌లో రాజమౌళి మల్టీ స్టారర్ తీయబోతున్న విషయం తెలిసిందే. దాని కోసం అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో జరిగిన ఫొటో షూట్‌కు వెళ్లారు. సాధారణంగా హైదరాబాద్‌లో గానీ, ముంబాయిలో గానీ ఫొటో షూట్ పెట్టుకుంటారు. కానీ జక్కన్న వీరిద్దరికీ ప్రత్యేకంగా లాస్‌ఏంజెల్స్ పెట్టారు. ఈ పని పూర్తి చేసుకుని ఇద్దరూ హైదరాబాద్ వచ్చేశారు. ఎన్టీఆర్ త్రివిక్రమ్ చిత్రంలో కొత్త అవతారం కోసం మళ్లీ కసరత్తులు మొదలు పెట్టారు. రామ్ చరణ్ తన చిత్రం 'రంగస్థలం' ప్రమోషన్ పనుల్లో బిజీ అయిపోయారు.

# 'గులేబకావళి'లో నిధి కోసం అన్వేషణ

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వం వహించారు. సీనియర్ నటి రేవతి ఓ శక్తివంతమైన పాత్రలో నటించారు. తమిళనాట సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈ నెల 23న తెలుగు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ ' ఈ చిత్రం తెలుగు నేటివిటికి దగ్గరగా ఉంటుంది. యూనివర్సల్ కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందనే విశ్వాసంతో తెలుగులోకి అనువదిస్తున్నాను. గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం జరిగే అన్వేషణ నేపథ్యంలో ఈ కథ కొనసాగుతుంది. పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా సాగే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. ప్రభుదేవా నృత్యాలు, నటన ప్రధాన ఆకర్షణ. ప్రభుదేవా, హన్సిక, రేవతి, మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టంట్స్ : పీటర్ హెయిన్స్, సంగీతం : వివేక్ మెర్విన్, కెమెరా : ఆర్ఎస్ ఆనంద్‌కుమార్, ఆర్ట్: కదీర్, పాటలు : సామ్రాట్, దర్శకత్వం: కల్యాణ్, నిర్మాత: మల్కాపురం శివకుమార్.



ప్రభుదేవా, హన్సిక

# కథలు రాస్తున్నా

తమన్నా...ఒకప్పుడు తెలుగులో అగ్రతారగా వెలుగొందారు. ఇప్పుడు తెలుగులో ఎక్కువగా చేయకపోయినా తమిళం, బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తున్నారు. వీటితో పాటు తన అభిరుచులకు తగ్గట్టు ఇప్పుడు ఉంటున్నారు తమన్నా. కథలు రాసుకుంటున్నారు. ఇదేంటీ... హీరోయిన్ కథలు రాసుకోవడం ఏమిటి? అనుకుంటున్నారా? మీరు చదివినది నిజమే. తమన్నాకు మంచి రైటింగ్ స్కిల్స్ ఉన్నాయి. ఆమెలో ఓ మంచి రచయిత్రి ఉందట. కాకపోతే షూటింగ్‌లో బిజీగా ఉండడం వల్ల రాయడం కుదరలేదట. అదే తన అభిరుచి అంట కూడా. అందుకే ఇప్పుడు తన అలవాట్లను కాగితంపై పెడుతున్నారట. తమన్నా మనసులో కలిగే భావాలను పద్య రూపంలో చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారట. ఖాళీగా ఉన్నప్పుడు నిత్యం పుస్తకాలు చదువుతూ ఉంటారట. ఆమె రాసినవన్నీ ఓ పుస్తకం రూపంలో తీసుకొచ్చే ఆలోచన కూడా చేస్తున్నారట తమన్నా. తెలుగులో కల్యాణ్ రామ్ కథానాయకుడిగా చేస్తున్న 'నా నువ్వే' చిత్రంలో ఆమె కథానాయికగా చేస్తున్నారు.



తమన్నా

# మహిళా కబడ్డి



శివాజీ రాజా, భోలే శావళి, రామకృష్ణ గౌడ్, గాయని వరం తదితరులు

ఆర్.కె. ఫిలింస్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మహిళా కబడ్డి'. రచన స్మిత్ ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఇటీవలే మూడో షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రం కోసం ఉగాది పండుగపై ఒక ప్రత్యేక పాటను సంగీత దర్శకుడు భోలే షావళి సారథ్యంలో రూపొందించారు. ఈ పాటను మంగళవారం ఫిలించాంబర్‌లో 'మా' అధ్యక్షుడు శివాజీరాజా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా కెరీర్ ప్రారంభ దశలో ఈ బేనర్‌లో నటించాను. అప్పటి నుంచి మా ఇద్దరి మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. పండుగ సందర్భంగా ఉగాది పై చేసిన పాటను ఆవిష్కరించడం చాలా ఆనందగా ఉంది. బోలే షావళి అద్భుతంగా రాసి, కంపోజ్ చేయగా వరం అనే నూతన గాయని ఎంతో వినసొంపుగా పాడింది. ఈ పాటతో ఉగాది పండుగ ముందే వచ్చినట్టుగా అనిపిస్తోంది. ఈ పాటలా సినిమా కూడా అద్భుతంగా ఉండబోతుందని అర్థమవుతోంద'ని అన్నారు.

దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'మా బేనర్‌లో గ్యాప్ తర్వాత నేను దర్శకత్వం వహిస్తూ నిర్మిస్తోన్న చిత్రమిది. మహిళలు ఎందులో తక్కువ కాదనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఒక పల్లెటూరు అమ్మాయి భారతదేశం గర్వపడే స్థాయిలో కబడ్డి ఛాంపియన్‌గా ఎలా ఎదిగిందనేది కథాంశం. రచన స్మిత్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. శివాజీ రాజా కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిలిం చాంబర్ సెక్రటరీ ముత్యాల రాందాస్, ఏడిద శ్రీరామ్, గాయని వరం, సంగీత దర్శకుడు బోలే షావళి పాల్గొన్నారు.

# సంతోషంగా ఉన్నట్టు నటిస్తున్నాం

నాగార్జున హీరోగా రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా ' ఆఫీసర్'. మైరా సరీన్ కథానాయిక. ముంబాయిలో చిత్రీకరణ జరుపుకుంది. అక్కడ జరిగిన షూటింగ్ అప్‌డేట్స్‌ను నిత్యం నాగార్జున అభిమానులతో పంచుకుంటూనే ఉన్నారు. సోమవారంతో ఆ షెడ్యూల్ ముగిసింది. ఈ షెడ్యూల్‌లో మొత్తం పోరాట సన్నివేశాలే చిత్రీకరించారు. 99 శాతం షూటింగ్ పూర్తయినట్లు నాగార్జున మంగళవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇప్పటివరకు షూట్ చేసిన సన్నివేశాలు చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాయన్నారు. వర్మను, చిత్రబృందాన్ని మిస్సవుతున్నట్టు ట్వీట్‌లో స్పష్టం చేశారు. 'నాగార్జున మీరు మమ్మల్ని వదిలి హైదరాబాద్ వెళ్లిపోతున్నందుకు మేమంతా బాధను దిగమింగుకుని సంతోషంగానే ఉన్నట్లు నటిస్తున్నాం. మీరంటే మాకెంతో ఇష్టం.' అని రామ్‌గోపాల్ వర్మ రీ ట్వీట్ చేశారు. ఈ చిత్రం మే 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



నాగార్జున, మైరా సరీన్

# ఆనందంలో ముంచెత్తింది

– చంద్ర బోస్



'నేను నా సాహితీ ప్రస్థానంలో ఎన్నో పాటలు రాశాను, ఎన్నో పురస్కారాలు, అభినందనలు అందుకున్నాను. కానీ 'రంగస్థలం'లోని 'ఎంత సక్కగున్నావే' పాటకు వస్తున్న స్పందన మాత్రం అపూర్వం. దాదాపు 15 రోజులుగా నా ఫోన్ మోగుతూనే ఉంది. ప్రశంసల జల్లు కురుస్తూనే ఉంది' అని గీత రచయిత చంద్రబోస్ అన్నారు. ఆయన ఇటీవల రంగస్థలం సినిమాలో ఈ గీతాన్ని రాశారు. ఈ చిత్రంలో మొదట గీతంగా దీన్నే విడుదల చేశారు. ఈ సందర్భంగా వస్తున్న స్పందనపై చంద్రబోస్ మంగళవారం మాట్లాడారు. 'సినిమా ప్రముఖులు, స్నేహితులు, బంధువులు, పరిచయస్తులు అందరి నుండి అన్ని వర్గాల నుండి వస్తున్న ఈ అభినందనలు నన్ను ఆనందంలో ముంచెత్తాయి. మరో ఆశ్చర్యనందానికి గురి చేసిన విషయం మీతో పంచుకోబోతున్నాను. వంశీ కమల్ అనే అబ్బాయి ఈ పాటతో స్ఫూర్తి పొంది నా గురించి ఒక పాట రాశాడు. ఇదే పాట వరసలో. నాకు చాలా వినూత్నంగా అనిపించింది. నేను దీనికి అర్హుడినో కాదో గాని ఒక తెలుగబ్బాయి హృదయాన్ని కదిలించి కవిత్వం పలికించానన్న తృప్తి కలుగుతోంది' అంటూ ఆ పాట లింక్‌ను తన అభిమానులకు షేర్ చేశారు చంద్ర బోస్.

# సైటెక్
Science & Technology

scitechpage@gmail.com



**ప్రశ్న :** మనిషి చనిపోతే అస్తికలు నదిలో కలుపుతారు. పిండ పూజ చేస్తారు. ఇలా చేస్తే పితృదేవతలు స్వర్గంలో సంతోషిస్తారని చెబుతారు. ఇదెంతవరకు నిజం?

- పోరండ శంకరలింగం,
శ్యాయంపేట, పరకాల,
భూపాలపల్లి జిల్లా

# పిండపూజ చేస్తే పితృదేవతలు సంతోషిస్తారా?

**జవాబు:** మన వర్తమాన సమాజంలో భారతదేశంలో మూడు రకాలయిన నమ్మకాలు లేదా విశ్వాసాలు ఉన్నాయి. ఒకటి: మారుతున్న లేదా ప్రాయోగికంగా నిర్ద్వంద్వంగా తెలిసిపోయిన శాస్త్ర పరిశోధనా ఫలితాల ద్వారా నిగ్గుతేలిన నిజాల (వాస్తవాల) ఆధారంగా మనిషి ఏర్పర్చుకునే నమ్మకాలు. వీటిని శాస్త్రీయ విశ్వాసాలు లేదా శాస్త్రాధారిత విశ్వాసాలు అంటాము. ఇవి ఎపుడూ మారనే మారవన్న నిబంధన లేదు. పాత శాస్త్ర నియమాల స్థానే కొత్త నియమాలు బయటపడ్డపుడు తదనుగుణంగా ఈ శాస్త్రాధారిత నమ్మకాలు మారతాయి. ఇలాంటి దృక్పథం, మానసిక ధోరణి ఉన్నవాళ్లకు శాస్త్రీయ దృక్పథం (Scientific temper) వుందని అంటాము. మనం ప్రజలు కోరుకొనేది ఇలాంటి దృక్పథాన్నే. ఇలాంటి దృక్పథమే దేశంలోని ప్రజలందరిలో ఉన్నట్లయితే ఆ సమాజం అప్రతిహతంగా అభివృద్ధి చెందుతుంది. ప్రకృతి గురించిన సశాస్త్రీయ అవగాహనతో పాటు సమాజంలో ఉన్న అశాస్త్రీయతను కూడా వారు ప్రశ్నించగలుగుతారు. తద్వారా దేశంలో అన్యాయం తగ్గి ప్రజల మధ్య సమభావం, మానవతా దృక్పథం, సిసలైన దేశభక్తి, కష్టించే ప్రవృత్తి, నిస్వార్థ తత్పరత పెరుగుతాయి. తోటి మానవుడు, పర్యావరణం, సమతులాభివృద్ధి (Sustainable Development) మొదలయిన అంశాలే ఆ వ్యక్తి చేష్టల్ని, జీవన విధానాన్నీ నిర్దేశిస్తాయి. అలాంటి మనుషులున్న దేశాన్నే, ప్రపంచాన్నే సోషలిస్టులు, కమ్యూనిస్టులు కోరుకుంటారు. రెండవ రకమైన విశ్వాసం/ నమ్మకం : ఆచారానికి లేదా సంప్రదాయాని (Tradition) కి సంబంధించింది. ఈ రకమైన నమ్మకాలకు శాస్త్రం చెబుతుందన్న విషయాల పట్ల ఏమాత్రం పట్టింపు ఉండదు. తరతరాలుగా తమ కుటుంబంలోనో తోటి సమాజంలోనో జరిగే పద్ధతుల్ని ఆచరిస్తారు. మీరు చెప్పిన అస్తిక నిమజ్జనం, పిండపూజ ఇలాంటి కోవలోకే వస్తాయి. నిజానికి శవాన్ని దహనం చేశాక ఆ శవం తాలూకు భౌతిక స్వరూపానికి కారణమైన రసాయనిక పదార్థాలయిన నీరు, ప్రోటీన్లు, కణజాలాలు చాలామటుకు వాతావరణంలో కలిసిపోతాయి. ఇక మిగిలిన ఘన రూప పదార్థాలు బూడిద, బూడిదగా మారని కొన్ని బొక్కలు (ఎముకలు). ఈ ఎముకల రసాయనిక, భౌతిక ధర్మాలు బ్రతికున్నప్పుడు ఉన్న ఎముకల ధర్మాలకు ఏమాత్రం సరిపోవు. మరో మాటలో చెప్పాలంటే ఈ ఎముకలకు పగిలిపోయిన టీ కప్పు ముక్కలకు తేడా లేదు. ఈ ఎముకలు పూర్తిగా నీటిలో కరగలేని (sparingly soluble) కాల్షియం ఫాస్ఫేటు అనే లవణ పదార్థం. దీనిని $Ca_3 (PO_4)_2$ గా సూచిస్తారు. ఇక బూడిదలో ఉన్నదల్లా శరీరంలో ఉన్న లోహ పదార్థాల ఆక్సైడులు. ప్రధానంగా కాల్షియం ఆక్సైడు ($CaO$), సోడియం ఆక్సైడు ($Na_2O$), ఐరన్ ఆక్సైడు ($Fe_2O_3$), జింకు ఆక్సైడు ($ZnO$), కాపర్ ఆక్సైడు ($CuO$), పొటాషియం ఆక్సైడు ($K_2O$) మొదలైనవి వుంటాయి. ఫెర్రిక్ ఆక్సైడు దక్క మిగిలినవన్నీ క్షార ఆక్సైడులు. అంటే ఏమాత్రం తడి లేదా నీరు తగిలినా అవి వెంటనే హైడ్రాక్సైడులా మారి, ఆ నీటిని క్షార (Alkaline) లక్షణాన్ని సంతరిస్తాయి. దహనం తర్వాత మిగిలిన ఎముకలతో పోలిస్తే ఈ బూడిద మోతాదు చాలా తక్కువ. ఇందులో ఉన్న చిన్నా చితక ఎముకల్ని, కొంత బూడిదను చెంబులో నింపి అస్తికలు అని పేరు పెడతారు. ఈ పదారాన్ని దహన సంస్కారం చేసిన వ్యక్తి (సాధారణంగా పెద్ద కుమారుడు) కుటుంబ సమేతంగా వెళ్లి తమకు బాగా యిష్టమైన నదిలోనో లేదా ఆయా పురోహితులు సూచించిన నదిలోనో కలిపేస్తారు. ఆ తర్వాత పిండ ప్రదానం చేస్తారు. మాంసాహారులైతే మాంసం కలిపిన భోజనాన్ని, శాకాహారులైతే పప్పు నెయ్యి కలిపిన భోజనాన్ని ముద్దలు (పిండాలు)గా చేసి నది గట్టు మీదో, పొదల్లోనో ఆరుబయట పెడతారు. ఈ పిండాల్ని అక్కడక్కడ ఆకలితో అలమటిస్తున్న కాకులు, గద్దలు తింటాయి. అలా తినకపోతే అక్కడున్న కుటుంబీకులు తెగ బాధపడిపోతారు. అలా కాకులు తినడం సంభవిస్తే ఆ పిండ పూజ లేదా పిండ ప్రదానం జయప్రదమయినట్లు అర్థం.



ఇలాంటి ప్రవర్తనలు లేదా కార్యకలాపాలలో ఏమాత్రం విజ్ఞాన శాస్త్ర లక్షణాలు వుండవు. ఆ కాకులే పితృదేవతల ప్రతినిధులుగా భావిస్తారు. చనిపోయిన తర్వాత ఏమీ ఆ వ్యక్తికి సంబంధించిన చైతన్య రూపం వుండదు. ఆత్మలు, స్వర్గ, నరకాలకు ఏమాత్రం ఆధారాలు లేవు. ఇక ఇలా చర్చించుకుంటూ వెళితే ఎన్నో అశాస్త్రీయ అంశాలు బయటకొస్తాయి. అయితే ఇలాంటి ఆచారాల వల్ల సమాజానికి నష్టం లేదు. ఎవరి యిష్టాలు వారివి అని సున్నితంగా ఆ సంప్రదాయాల్ని, ఆచారాల్ని మన్నించవచ్చును. కేవలం ఆర్థిక నష్టాలు, నిష్క్రియాపరమైన కాల హరణం తప్ప సమాజపు గమనాన్ని గణనీయంగా దుష్పరిణామాల వైప మళ్లించే ధోరణి పెద్దగా వుండదు. పెళ్లిళ్లు, పండుగలు మొదలయినవన్నీ ఈ కోవలోకి వస్తాయి. కాబట్టి వీటిని సదాచారాలు, సత్కార్యాలు, సత్సంప్రదాయాలు అనలేము గానీ సింపుల్‌గా ఆచారాలని వదిలేస్తాము.

కానీ మూడవ నమ్మకాలున్నాయి. వీటిని మూఢనమ్మకాలు, ఛాందసత్వం, అంధ విశ్వాసాలు అంటాము. ఇలాంటి వాటివల్ల సమాజ గమనానికి ప్రమాదం. కులవ్యవస్థ, లైంగిక వివక్షత, మతవిద్వేషాలు, స్వార్థపరత్వం, అమానుషత్వం వంటివి ఇలాంటి విశ్వాసాల వల్ల పెరుగుతాయి. చేతబడి, బాణామతిని నమ్మడం, మనుషులకు అతీత శక్తులున్నట్లు విశ్వసించడం, వాస్తు, జ్యోతిశ్శాస్త్రం వంటి నమ్మకాల వల్ల సమాజం నిష్క్రియా పరత్వానికి చేరువవుతుంది. ఇలాంటి విషయాల పట్ల ఈ శీర్షికలో బాగానే చర్చించుకున్నాం.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email:
allikayala@gmail.com

# స్మార్ట్‌ఫోన్‌తో నడిచే ఫ్యాన్



కాదేదీ స్మార్ట్‌ఫోన్ ఉపయోగాని కనర్హం అన్నట్టుగా మారింది ప్రస్తుత పరిస్థితి. రకరకాల యాప్స్‌తో పాటు అనేక యాక్సెసెరీస్ అందుబాటులోకి రావడంతో స్మార్ట్ ఫోన్ ను రకరకాల పనులకు ఉపయోగిస్తున్నారు. టీవీ పెట్టడానికి రిమోట్ లా ఉపయోగించడమే కాకుండా ఫ్యాన్ గాను ఉపయోగించుకోవచ్చు. మొబైల్‌కు రెండు రెక్కలు అమర్చడం ద్వారా చల్లని గాలినీ ఆస్వాదించవచ్చు. కేవలం రెండు రెక్కలతో ఉన్న ఈ ఫ్యాన్ మొబైల్‌లో పెట్టుకునే ఛార్జింగ్ పెట్టే పోర్టుకు పెడితే చాలు. అది తిరిగి చల్లగా గాలి వస్తుంది. దీని ధర మూడు వందల రూపాయలు. ఈ రకమైన ఫ్యాన్ ఆన్లైన్ వెబ్ సైట్స్ అయిన మినీ ఇన్ ది బాక్స్ వెబ్‌సైట్‌లో, అమెజాన్‌లో ఇవి అందుబాటులో ఉన్నాయి.

# చాటింగ్‌కు బెస్ట్ యాప్స్

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లలో చాటింగ్ అనేది సర్వసాధారణం. మెసేజింగ్ చాట్‌లతో పాటు వీడియో కాలింగ్ వంటి సదుపాయాలున్న చాటింగ్ యాప్స్ ఇప్పుడు అనేకం వున్నాయి. అయితే... భద్రత విషయంలో ఈ యాప్స్ ను నమ్మలేం. వాటిలో కొన్నింటితో ఇబ్బందులు కూడా తలెత్తుతాయి. వీటిలో భద్రతకు ప్రాధాన్యతనిచ్చేవి కొన్ని మాత్రమే. మనకు తెలియని వాళ్లతో చాట్ చేసేటప్పుడు ఆ సంభాషణ ఎంత భద్రంగా వుంటుందో ఎవరికీ తెలియదు. దీనివల్ల అనేక సమస్యలూ తలెత్తుతాయి. మరి ముఖ్యంగా అపరిచితులతో చాట్ చేసేటప్పుడు అనేక అనర్థాలు జరుగుతుంటాయి. వున్నంతలో ది బెస్ట్ అనిపించుకున్న యాప్స్‌లో ముఖ్యమైనవాటి గురించి తెలుసుకుందాం...



**టిండర్(Tinder) :** ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా ఉపయోగిస్తున్న డేటింగ్ యాప్‌లలో ఇదొకటి. అపరిచితులతో చాట్ చేయడానికి దీనికి మించిన యాప్ మరొకటి లేదు. దీని ఇంటర్‌ఫేస్ వినియోగదారులకు సులభంగా ఉండడం వల్ల ఎక్కువమందిని ఆకర్షిస్తున్నది. అదే సమయంలో ఈ యాప్ వల్ల కొన్ని సమస్యలూ లేకపోలేదు. ప్రధానంగా స్పామర్స్ ఎక్కువగా ఈ యాప్‌ను టార్గెట్ చేయడం దీనికున్న ప్రధాన అవరోధం. అయినప్పటికీ 20 మిలియన్ల మంది ఈ యాప్‌ను వాడుతున్నారు. మీతో అవతలి వ్యక్తి చాట్ చేయాలంటే రైట్ సైడ్‌కు స్వైప్ చేయాలి. అవతలి వ్యక్తి కూడా అలాగే చేయాలి. ఈ యాప్‌లో పరస్పర అంగీకారం ఉంటేనే చాట్ కుదురుతుంది. ముఖ్యంగా లొకేషన్ యాడ్ చేసుకోవడం ద్వారా వినియోగదారు తనకు దగ్గరలో వున్నవారిని సెర్చ్ చేసుకోవచ్చు. టిండర్ యాప్‌ను లైక్ చేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటోందని ఆన్‌లైన్ మార్కెట్ డేటా సంస్థ 'యాప్ అన్నే' తెలిపింది. మిగిలిన డేటింగ్ యాప్స్‌తో పోల్చితే.. టిండర్‌లో త్వరగా రిలేషన్‌షిప్ చేసేందుకు అవకాశాలు ఉండడం, లోకల్‌గా ఉండేవారి సమాచారం వేగంగా తెలుసుకోడానికి అనువుగా ఉండడంతో యువత దీనిని ఉపయోగించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సదరు సంస్థ ప్రకటించింది.

**మొకొ (Moco) :** వాట్సాప్ లాంటి మెసేజింగ్ యాప్‌లలో సీక్రెట్ చాట్ అంటూ ఒక ఆప్షన్ వుంటుంది. తమ సంభాషణల పట్ల భద్రతను పాటించేవారు దీన్ని ఉపయోగించుకుంటుంటారు. అలా భద్రతను కోరుకునే వారికి ఈ మొకొ యాప్ బాగా ఉపయోగపడుతుంది. చాట్ రూమ్స్‌లో ఈ యాప్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. సెక్యూర్ చాటింగ్ కావాలంటే ముందుగా మీరు ఈ యాప్‌ను సైన్‌ఇన్ చేయాలి. ఇప్పటికే గూగుల్ ప్లే స్టోర్‌లో 10 మిలియన్ల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాడుతున్నారు. ఈ యాప్‌లో ప్రత్యేకత ఏంటంటే ప్రైవేటుగా చాట్ చేయడం మాత్రమే కాదు గ్రూప్‌లో కూడా చాట్ చేసుకోవచ్చు. టిండర్ మాదిరిగానే మీ లొకేషన్‌ను యాడ్ చేసి మీకు దగ్గర్లో ఉన్న పీపుల్ కోసం సెర్చ్ చేయవచ్చు.

**బాడూ (Badoo) :** ఈ యాప్ 190 దేశాల్లో 47 భాషల్లో అందుబాటులో ఉందంటేనే దీని పాపులరిటీ అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ప్లే స్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని వాడుతున్న వాళ్ల సంఖ్య 350 మిలియన్లకు చేరువైంది. దీనిలో ఉండే యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్ వల్ల ఎక్కువమంది ఆకర్షితులు అవుతున్నారు. దీన్నిసింగిల్ సైన్‌అప్ ద్వారా వాడుకోవచ్చు. డేట్ లేదా చాట్ చేసుకునే అవకాశం దీనిలో ఉంది.

**క్విప్ (Quip) :** అందుబాటులో ఉన్న డేటింగ్ యాప్‌లలో ఇదో ఉత్తమమైంది. సైన్‌అప్ చేసుకున్న తర్వాత నేరుగా అపరిచితులతో మీరు మాట్లాడే అవకాశం ఉంది.అంతేకాదు మనకు సంబంధించిన వాళ్లు ఆన్‌లైన్‌లో ఉన్నారో లేదో తెలుసుకునే అవకాశం కూడా దీనిలో ఉంది. మీ సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకోవడం ద్వారా మీకు దగ్గర్లో ఉన్న స్నేహితులను కనుగొనొచ్చు.

**అజర్ (Azar) :** అపరిచితులతో చాటింగ్, వీడియో కాలింగ్ లాంటివి చేసుకోవడానికి అజర్ యాప్ మంచి ఆప్షన్ ప్రస్తుతం ఈ యాప్ 190 దేశాల్లో అందుబాటులో ఉంది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను 100 మిలియన్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ముఖ్యంగా వీడియో చాట్ విషయంలో ఇది మంచి ప్రత్యామ్నాయం. టెక్ట్ మెసేజ్‌లకు కూడా ఇది మంచి యాప్. ఫేస్‌బుక్‌లా దీనిలో కూడా స్నేహితుల జాబితా తయారు చేసుకోవచ్చు.

చాటింగ్‌లో తమ సంభాషణలు సీక్రెట్‌గా వుండాలని కోరుకునే వారు ఈ యాప్‌లను ఉపయోగించ వచ్చు. వీటిని గూగుల్ ప్లే స్టోర్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ★




టిండర్ (Tinder)



# 24న నుబియా స్మార్ట్‌ఫోన్ విడుదల

జీటీఈ అనుబంధ సంస్థ నుబియా, నుబియా ఎన్3 పేరుతో అదిరిపోయే ఫీచర్లతో సరికొత్త స్మార్ట్ ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకురానున్నది. నుబియా ఎన్3 పేరుతో విడుదలయ్యే ఈ ఫోన్ ఈ నెల 24న చైనా మార్కెట్‌లో విడుదలవుతుంది. భారీ బ్యాటరీ, బిగ్ స్క్రీన్ కలిగి వుండడం ఈ స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకతగా కంపెనీ చెబుతోంది. మొత్తం మూడు రంగుల్లో ఫోన్ అందుబాటులో ఉండే ఈ ఫోన్ ధరను కంపెనీ ఇంకా ప్రకటించలేదు. ఆండ్రాయిడ్ ఓరియో అప్‌డేట్‌తో ప్రపంచ మార్కెట్లను అలరించనుందనే అంచనా ఉన్నప్పటికీ.. ఎప్పటి వరకు అందుబాటులోకి వస్తుందనే దానిపై నిర్దిష్టమైన సమాచారం లేదు. ఇక ఫీచర్ల విషయానికొస్తే... 18:9 ఐపీఎస్ ఎల్‌సీడీ, 5.99 అంగుళాల డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ నౌగాట్ 7.1, 4 జీబీ ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమొరీ, 128జీబీ వరకు విస్తరించుకోవచ్చు. అంతేకాకుండా 16 ఎంపీ సెల్ఫీ కెమెరా, ఆటో ఫోకస్‌తో వెనుక రెండు కెమెరాలు, 5000 ఎంఎహెచ్ బ్యాటరీ, ఫింగర్ ప్రింట్ లాక్ సిస్టమ్ వంటి ఫీచర్లతో ఆకర్షణీయంగా ఉంది. ★

# చిన్నారి



## నేనెవరిని?

చెత్తాచెదారం నివాసం..
తోకనుండు గరళం..
కుడితే బాధపడతాం..
కనపడితే చంపుతాం? నేనెవరిని?

జవాబు : తేలు

## జోక్:

తండ్రి : ఏంట్రా టింకూ! మదర్ టంగ్ అన్నచోట 'లేదు' అని రాశావు?

టింకు : నువ్వేగా నాన్నా మీ అమ్మకు బొత్తిగా నోట్లో నాలుక లేదు అంటుంటావు?!

## నీడ కనిపెట్టండి



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని బొమ్మలు, వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

# కప్ప చర్మంపై తడి ఆవిరైతే ఏమవుతుంది?




పిల్లలూ..! మీకు తెలుసా? నీటిలోనే కాకుండా నేలపై సంచరించే కప్పలాంటి ఉభయచరాల చర్మం పైపొర తడిగా, జిగురుగా.. పట్టుకుంటే జారిపోయే ధర్మం కలిగి ఉంటుంది. దీనివల్ల అవి వాతావరణంలోని ఉష్ణాన్ని గ్రహించి, పొడిబారి పోకుండా ఉంటాయి. కప్ప శరీరంపై ఉండే చర్మం దృఢంగా ఉండకుండా, పలుచగా ఉండడంతో ఆ చర్మానికి అంతగా రక్షణ లభించదు. అంతేకాదు పిల్లలూ.. 25 శాతం నుంచి 30 శాతం కన్నా వాటి శరీరంలోని ద్రవపదార్థాలు ఆవిరైతే అవి ప్రాణాలతో ఉండలేవు. అందువల్ల కప్పల చర్మం నిరంతరం శ్లేష్మాన్ని, ఇతర పదార్థాలను స్రవించే గ్రంథులను కలిగి ఉంటాయి. గ్రంథుల నుంచి స్రవించే ఈ స్రావాలు వాటి దేహంలోని నీటిని సమతుల్యతలో ఉంచుతాయి. అలాగే ఆ స్రావాలలో ఉండే విషంతో కూడిన సమ్మేళనాలు వాటిని తినేందుకు వచ్చే ప్రాణుల నుంచి, బ్యాక్టీరియా, ఫంగస్‌ల నుంచి రక్షణ కల్పిస్తాయి.



కప్పల చర్మంలో ఉండే గ్రంథుల ద్వారా సూర్యరశ్మి ప్రభావం వాటిపై పడకుండా ఒక తెరను కూడా ఏర్పరచుకోగలవు. ★



# నేను గీసిన బొమ్మ





జి. జాషువ,
5వ తరగతి, శ్రీచైతన్య టెక్నో స్కూల్, గుంటూరు.

# పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

# నేటి నుండి ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్





**బర్మింగ్‌హామ్ :** ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ బుధవారంనుండి ప్రారంభం కానుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్‌కు 3వ సీడ్ లభించింది. తొలిపోరులో శ్రీకాంత్ ఫ్రాన్స్‌కు చెందిన అన్‌సీడెడ్ లెవర్‌డెజ్‌తో ముఖాముఖి తలపడనున్నాడు. భారత్‌కే చెందిన మరో టాప్‌సీడ్ షట్లర్ సాయిప్రణీత్ 5వ సీడ్ దక్షిణ కొరియాకు చెందిన సన్ వుహూతోనూ... ప్రణయ్ రాయ్ చైనీస్ తైపేకి చెందిన 7వ సీడ్ చౌ టీసితో పోటీపడతాడు. మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు చెందిన నెంబర్ వన్ షట్లర్ పివి సింధూకు 4వ సీడ్ లభించింది. తొలిరౌండ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన అన్‌సీడెడ్ ఛౌఛువాంగ్‌తో తలపడనుంది.

మరో షట్లర్ సైనా నెహ్వాల్ నెంబర్ వన్ సీడ్ థాయ్‌లాండ్‌కు చెందిన థాయ్-జూ-ఇంగ్‌తో తలపడనుంది. ఆల్ ఇంగ్లండ్ పోటీలు మార్చి 14 నుండి 18 వరకు జరిగే ఈ పోటీల విజేతలకు లక్ష డాలర్ల ప్రైజ్‌మనీ లభించనుంది.

# మీడియాపై షమీ భార్య దాడి



**కోల్‌కతా :** ఇటీవలికాలంలో విలేకరుల నుండి ఎదురౌతున్న పలు ప్రశ్నల నేపథ్యంలో క్రికెటర్ షమీ భార్య జహాన్ హసీన్ అతిగా ప్రవర్తించారు. నగరంలోని సెయింట్ సెబాస్టియన్స్ స్కూల్ ఆవరణలో మంగళవారం జర్నలిస్టులు ఆమెను వీడియో చిత్రీకరించే క్రమంలో ఒక విలేకరి కెమెరా లాక్కొని పగలగొట్టారు. అదే సమయంలో గట్టిగా అరుస్తూ తన కారులో వెళ్లిపోయారు. గత కొన్ని రోజులుగా మీడియా ముందుకొచ్చి సావధానంగా సమాధానాలిచ్చిన జహాన్.. నేడు సహనం కోల్పోయి ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. మోడల్, ఐపిఎల్‌లో కోల్‌కత్తా నైట్ రైడర్స్‌కు ఛీర్ గర్ల్స్‌గా ఉన్న హసీన్‌కు షమీకంటే ముందే వేరే వ్యక్తితో వివాహమై ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చినట్లు తెలిసింది.

**షమీ ఫోన్లు సీజ్**

మహ్మద్ షమీకి సంబంధించిన ఫోన్లను కలకత్తా పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా భారత్‌కు తిరిగొచ్చే క్రమంలో తన భర్త దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో దిగి పాకిస్తాన్‌కు చెందిన ఒక మహిళ నుంచి నగదు తీసుకున్నాడనే భార్య హసీన్ జహాన్ ఆరోపణల నేపథ్యంలో బీసీసీఐని పోలీసులు సంప్రదించినట్లు తెలిసింది. 'అసలు షమీ దుబాయ్‌లో దిగడానికి సంబంధించి బీసీసీఐ వద్ద ఏమైనా ఆధారాలున్నాయా'అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# గెలిస్తే ఫైనల్‌కు...

- నేడు బంగ్లాతో చివరి పోరు
- రాత్రి 7.00 గం॥ల నుంచి

**కొలంబో :** శ్రీలంకలో జరిగే నిదహస్ టీ20 ట్రై సిరీస్‌లో భారతజట్టు చివరి, ఆఖరి లీగ్ మ్యాచ్‌ను బుధవారం బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఇప్పటికే బంగ్లాపై ఒకసారి గెలిచిన టీమిండియా నేటి మ్యాచ్‌లో విజయం సాధిస్తే నేరుగా ఫైనల్లోకి ప్రవేశించే అవకాశముంది. బంగ్లాతో మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకోకుండా జాగ్రత్తగా ఆడాల్సిన పరిస్థితి టీమిండియాకు ఏర్పడింది. ఎందుకంటే ఇటీవల శ్రీలంకతో తలపడిన బంగ్లాదేశ్ జట్టు 215 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన సంగతి తెలిసిందే. దీంతో చివరి లీగ్‌మ్యాచ్ కావడంతో భారతజట్టు సమిష్టిగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే భారతజట్టు శ్రీలంక, బంగ్లాపై ఒక్కో విజయాలను నమోదు చేసుకొని పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

# జాతీయ ఖోఖో పోటీలకు ఆంధ్రా విద్యార్థిని ఎంపిక



**ప్రజాశక్తి- కశింకోట (విశాఖపట్నం)**

జాతీయ స్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా కశింకోటలోని ఉపాధ్యాయ జూనియర్ కళాశాల విద్యార్థిని కొత్తపల్లి ఇందు ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ బి.సుదర్శనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమెను కళాశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఇంఫాల్‌లో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో ఇందు పాల్గొంటుందని తెలిపారు. ఇందు ఎంపిక కావడం పట్ల జిల్లా ఖోఖో సమాఖ్య అధ్యక్షులు దాడి జయవీర్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె.ఆలీషా, పీడీ కె.మంగరాజు, ఎం.జగన్‌మోహన్, త్రినాధ్ హర్షం వ్యక్తం చేశారు.

International Cricket Council

# అగ్రదేశాల కనుసన్నల్లో..

ఐసీసీ కొన్ని అగ్రదేశాల కనుసన్నల్లో నడుస్తుందనడంలో అతిశయోక్తి లేకపోలేదు. ముఖ్యంగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల చెప్పుచేతల్లోనే నడుస్తోంది. ఇటీవల క్రికెట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం అవగతమవ్వక తప్పదు. ఎందుకంటే డీమెరిట్ పాయింట్లు, మ్యాచ్ ఫీజుల్లో కోతలు మిగతా దేశాలపై విధించినట్లుగా అగ్రదేశాల క్రీడాకారులపై విధించకపోవడమే ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు... వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం...

## ఐసీసీ నిబంధనలు వాటికి మినహాయింపు...

## డీమెరిట్ పాయింట్లు, మ్యాచ్ ఫీజులో కోతలు ఇతర దేశాలపై...






భారత సారధి కోహ్లిని రెచ్చగొడుతున్న ఆసీస్ సారధి స్టీవ్ స్మిత్

**(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)**

ఇటీవలికాలంలో అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి (ఐసీసీ) మైదానాలకు, క్రికెటర్ల ప్రవర్తనా నియమావళికి డీమెరిట్ పాయింట్లు ప్రకటించడం మొదలుపెట్టింది. దీని కారణంగా ఆయా మైదానాలుగానీ, క్రీడాకారుడుగానీ 5 డీమెరిట్ పాయింట్లు పొందితే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకుండా నిషేధం విధిస్తోంది. అంతేగాక ఒక్కో డీమెరిట్ పాయింట్‌కు ఆయా క్రీడాకారులనుండి మ్యాచ్ ఫీజుల్లోనూ కోత విధిస్తోంది. దీని కారణంగా ఆయా మైదానాల్లో అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగకుండా నిషేధాలు విధించడం కూడా మొదలుపెట్టింది.



బౌలర్లను రెచ్చగొడుతున్న కివీస్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్

దీనికంతటికీ ఐసీసీలో అగ్రభాగం ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల సభ్యులే ఉండడం ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

ఐసీసీకి అధికమొత్తంలో నగదును సమకూరుస్తున్నది మాత్రం చిన్న దేశాలే. ఏ దేశంలోనైనా ఒక అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహించాలంటే ఐసీసీ అనుమతి తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక ఇటీవల ఆయా దేశాల్లో నిర్వహించే దేశీయ లీగ్‌లలో సైతం ఐసీసీ జోక్యం చేసుకొని అందులోంచి కూడా వాటా అడుగుతోంది. ఐసీసీకి బంగారుబాతులా కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్న మన దేశీయ ఐపిఎల్ అనక తప్పదు.

**డీమెరిట్ పాయింట్ల పద్ధతి...**

ఇటీవలికాలంలో ఐసీసీ డీమెరిట్ పాయింట్ల పద్ధతిని ప్రవేశపెట్టింది. ఈ విధానం వల్ల ఎక్కువ నష్టపోతుంది మాత్రం ఇతర దేశాల క్రీడాకారులతోపాటు... ఆయా దేశాల్లోని మైదానాలకే అనక తప్పదు. భారత్‌లోని ఫిరోజ్‌షా కోట్ల మైదానం... బంగ్లాదేశ్‌లోని షేర్-ఎ-బంగ్లా స్టేడియం, దక్షిణాఫ్రికాలోని జొహాన్స్‌బర్గ్ మైదానాలకు ఐసీసీ డీమెరిట్ పాయింట్లు ప్రకటించడమే. అంతేగాక ఇటీవలి కాలంలో క్రీడాకారుల ప్రవర్తనకు సంబంధించి కూడా ఈ పాయింట్ల పద్ధతిని, మ్యాచ్ ఫీజులో కోతలను ఐసీసీ ప్రవేశపెట్టింది. ఈ డీమెరిట్ పాయింట్లకు ఎక్కువగా బలౌతున్నది మాత్రం ఇతర దేశాల క్రీడాకారులే అనక తప్పదు. ఇలా మ్యాచ్‌లు ఆడకుండా సస్పెన్షన్‌కు గురైన క్రీడాకారులు చాలామంది ఉన్నారు. శ్రీలంకకు చెందిన చండీమాల్... ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన షెహజాద్... దక్షిణాఫ్రికాకు చెందిన రబాడ... వెస్టిండీస్‌కు చెందిన హోల్డర్... వీరికి డీమెరిట్ పాయింట్లతోపాటు... మ్యాచ్ ఫీజుల్లోనూ కోతలు విధిస్తోంది.



ఇంగ్లండ్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్‌ను కేవలం హెచ్చరికతో వదిలేస్తున్న అంపైర్



ఆసీస్ సారధి స్మిత్‌వైపు ఆగ్రహంగా చూసి నిషేధానికి గురైన రబాడ

## ఐసీసీపై డుప్లెసిస్ ఆగ్రహం



క్రికెటర్ల ప్రవర్తనకు సంబంధించి ఐసీసీ విధించే డీమెరిట్ పాయింట్లపై దక్షిణాఫ్రికా సారధి డుప్లెసిస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అందరినీ సమాన దృష్టితో చూడాల్సిన ఐసీసీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా మండిపడ్డాడు. ఇందుకు ఆసీస్ ఆటగాడు డేవిడ్ వార్నర్, తమ దేశ పేసర్ రబాడలపై చర్యల కారణాన్ని డుప్లెసిస్ విమర్శించాడు. వీరి విషయంలో సమ న్యాయం జరగలేదని ధ్వజమెత్తాడు. ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ వార్నర్ తొలి టెస్ట్‌లో డికాక్‌ను ఉద్దేశపూర్వకంగా దూషించినప్పుడు మాత్రం లెవల్ 2 కింద మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చారు. రెండో టెస్ట్‌లో రబడా అనుకోకుండా ఆసీస్ సారధి స్టీవ్ స్మిత్ భుజాన్ని తాకటంతో లెవల్-2 కింద నాలుగు డీమెరిట్ పాయింట్లు ఇవ్వడమే కాకుండా.. మ్యాచ్ ఫీజులో 65 శాతం కోత విధించింది. రబాడకు కూడా మూడు డీమెరిట్ పాయింట్లు ఇచ్చి ఉంటే ఆస్ట్రేలియాతో జరిగే మిగతా టెస్టులు ఆడే వాడని కానీ ఐసీసీ తమకు వ్యతిరేకంగా ప్రవర్తించిందని ఐసీసీని దక్షిణాఫ్రికా సారధి ఈ సందర్భంగా విమర్శించాడు. ఇక రబాడా విషయంపై ఐసీసీకి వ్యతిరేకంగా అప్పీల్‌కు వెళ్లినా లాభం ఉండదనే ఉద్దేశంతో ముందుకు వెళ్ళడంలేదని డుప్లెసిస్ ఆవేదన వ్యక్తం చేశాడు.

# చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

## గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపట్ల రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 15న చేపట్టే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు అనుబంధ సంస్థ) వెల్లడించింది. సమస్యల పరిష్కారానికై మంగళవారం నుంచి సమ్మెకు దిగారని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి వెంకట్రామయ్య, కె ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస వేతనాల చట్టం 1948ని గ్రామపంచాయతీ కార్మికులకు వర్తింపచేయడం లేదని వారు పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులకు రూ.1500ల నుంచి రూ.8,000 లోపు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. అది కూడా ప్రతి నెలా చెల్లించడం లేదని, 8 నుంచి 9 నెలల పాటు పెండింగ్ పెడుతున్నారని వివరించారు. గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నెం 151 ప్రకారం కనీస వేతనాల్ని ప్రభుత్వమే చెల్లించాలని, బకాయి జీతాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, ఎన్ఎంఆర్, పార్ట్‌టైం, ఫిక్సెడ్ పేతో సహా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గుర్తింపు కార్డులు, ఇపిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్‌తోపాటు గ్రామ కార్యదర్శులుగా ప్రమోషన్లు, హైకోర్టు తీర్పునకు అనుగుణంగా టెండర్లు లేకుండానే కార్మికుల్ని ఉద్యోగులుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ యూనిఫాం, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాదబీమా, పెన్షన్, గ్రాట్యుటీ, భద్రతా సౌకర్యాల్ని కల్పించాలని వారు కోరారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, అర్హులైన కార్మికులకు వాచ్‌మెన్, అటెండర్ పోస్టుల్లో ప్రమోషన్లు కల్పించాలని, దహన సంస్కారాలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.5వేల నుంచి రూ.20వేలకు పెంచాలని, ప్రభుత్వం ఇస్తున్న ట్రాక్టర్లను గ్రామపంచాయతీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకు పూర్తి బాధ్యత రాష్ట్రప్రభుత్వమే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

# 19న అంగన్‌వాడీల 'చలో విజయవాడ'

## పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

అంగన్‌వాడీ వర్కర్ల వేతనాల పెంపు, లబ్ధిదారులకు బయోమెట్రిక్ రద్దు తదితర సమస్యల పరిష్కారానికి ఈనెల 19న చలో విజయవాడకు ఏపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈమేరకు మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడ సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.18 వేలు వేతనమివ్వాలని, పదవీ విరమణ పొందినవారికి రూ.3 వేలు పెన్షన్, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమంలో అంగన్‌వాడీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూనియన్ ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్. సుప్రజ మాట్లాడుతూ జాబ్ చార్ట్‌లో లేని పనులు కూడా అంగన్‌వాడీలతో చేయిస్తున్నారని చెప్పారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె. స్వరూపరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రతి నెలా వేతనాలు ఇవ్వడంలేదన్నారు. అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లో కొన్ని ప్రాజెక్టుల్లో గతేడాది ఏప్రిల్ నుంచి వేతనాలు ఇవ్వడంలేదన్నారు. అలాగే గ్యాస్, సెంటర్ అద్దెలు, డిఎ, అమృత హస్తం బిల్లులు తదితర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తెలంగాణలో పెంచిన విధంగా మన రాష్ట్రంలో కూడా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు వి. వేమేశ్వరి, దుర్గ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జిల్లా వెనుకబాటు గుర్తించమంటే జైలుకు పంపుతారా?

- నేతల అక్రమ అరెస్టులపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆగ్రహం
- వామపక్షాలు, వైసిపి, కాంగ్రెసు పార్టీ నేతల సంఘీభావం
- ఒంగోలులో నిరసన ర్యాలీ




ఒంగోలులో సుందరయ్యభవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

**ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి**

ప్రకాశం జిల్లాను వెనుకబడ్డ జిల్లాగా గుర్తించాలని కోరితే అక్రమంగా అరెస్టు చేసి నాన్‌బయిల్‌బుల్ కేసులు పెట్టి జైలుకు పంపుతారా? అంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద సిపిఎం నేతలను, కార్యకర్తలను అక్రమంగా జైలుకు పంపిన నేపథ్యంలో పి.మధు మంగళవారం ఒంగోలు వచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. తొలుత సిపిఎం నేతృత్వంలో సుందరయ్యభవన్ నుంచి కలెక్టరేట్ వరకూ అఖిపలక్ష నేతలు నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీ అనంతరం రాష్ట్ర కార్యదర్శి పిమధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వరరావు జిల్లా జైలుకెళ్లి రిమాండులో ఉన్న జిల్లా నేతలను పరామర్శించారు.

అనంతరం అన్ని పార్టీల నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని అన్ని పార్టీలు కలిసి గొంతెత్తుంటే తట్టుకోలేని ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు. కలెక్టరేట్ వద్ద అక్రమ అరెస్టుల్లో మహిళల చీరలు కూడా లాగారన్నారు. జిల్లా కార్యదర్శితో పాటు 50 మందిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని విడుదల చేయాలన్నారు. లేకుంటే ఈ ఆందోళనను అన్ని పార్టీలతో కలిసి మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మూడేళ్లుగా సాగర్ నీరు లేక మాగాణి కూడా లేదన్నారు. ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదన్నారు. వాటికీ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. జిల్లా అభివృద్ధి కోసం న్యాయమైన డిమాండ్లతో ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం, రాత్రిపూట జడ్జీల వద్ద హాజరుపరిచి నిబంధనలకూ విరుద్ధంగా 10గంటల తర్వాత జైళ్లకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్‌పిలు కూడా వీటిపై ఆలోచించాలన్నారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల్లో 8వ జిల్లాగా చేర్చాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించడంతోపాటు పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. వారం రోజుల్లో జిల్లా వెనుకబాటు వ్యవహారాన్ని తేల్చాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను అపలేరని హెచ్చరించారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సిపిఎం నేతల అరెస్టులను చూస్తే రాష్ట్రంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి వచ్చిందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. కాంగ్రెసు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశానికి ఇలాంటి పనులు కొత్తేమీ కాదన్నారు. సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నేత నాంచారులు అక్రమ అరెస్టులను ఖండించారు. అభివృద్ధి వేదిక నాయకులు షంషేర్ అహ్మద్ మాట్లాడుతూ న్యాయబద్ధంగా అడిగినందుకే నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెట్టడం ఆందోళనకరమన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి. వెంకటేశ్వరరావు, జిల్లా అభివృద్ధి వేదిక నాయకులు గోపాల్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పెంట్యాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

**మండలిని స్తంభింపజేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు**

జిల్లా వెనుకబాటుపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రమణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డి సభను అరగంటకుపైగా స్తంభింపచేశారు. జిల్లాను వెనుకబాటుగా గుర్తించాలని డిమాండు చేశారు. సభలో చర్చకు పట్టుబట్టారు. వీరికి జిల్లా ఎమ్మెల్సీలు కరణం బలరాం, మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా మద్దతు పలికారు. దీనిపై మంత్రి సోమిరెడ్డి వివరణ ఇస్తూ సమావేశాలు ముగిసేలోపు చర్చకు అవకాశం ఇస్తామన్నారు. అనంతరం అరెస్టులపైనా చర్చ సాగింది. అరెస్టులపై సభలో నిరసనలు వ్యక్తమయ్యాయి. కలెక్టర్‌తో మాట్లాడి అరెస్టు అయిన సిపిఎం నేతలను విడుదల చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్సీలు తెలిపారు.

# పోలవరంపై 'భేటీ'

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

పోలవరం నిర్మాణంపై మంగళవారం ఢిల్లీలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ అధికారులు, కేంద్ర జల సంఘం అధికారులు, ఏపి జలవనరుల శాఖ కార్యదర్శి శశి భూషణ్ కుమార్, పోలవరం చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పోలవరం నిర్మాణానికి సంబధించి వివిధ అంశాలను చర్చించారు. సమావేశ అనంతరం శశి భూషణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన డిపిఆర్ కేంద్రానికి గత ఆగస్టులో అందజేశాం.

సిడబ్ల్యుసిలో పోలవరం డిపిఆర్ పరిశీలన చివరి దశకు వచ్చింది. కేంద్రం నుంచి వచ్చే నిధుల కన్నా రాష్ట్ర ప్రభుత్వమే అధికంగా ఖర్చు చేసింది. త్వరగా నిధులు విడుదల చేస్తే ప్రాజెక్టు నిర్మాణం వేగవంతమవుతుంది. పోలవరం నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్‌పై ఉన్న అభ్యంతరాలపై వివరణ ఇచ్చాం. నూతన డిపిఆర్‌లో డామ్ నిర్మాణం,హెడ్ వర్క్స్, రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్, భూసేకరణ, నష్ట పరిహారం, పునరావాసం అన్ని అంశాలు పొందుపరిచాం. నవయుగ కంపెనీ కాంట్రాక్టర్‌గా వచ్చిన తరువాత ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. అందరి కషితో పోలవరం ప్రాజెక్టు 2019లోపు పూర్తవుతుంది. పోలవరం పనుల్లో పురోగతికి అనుగుణంగా కేంద్రం నిధులు కేటాయించాలి. పోలవరం పనులు వేగవంతంగా ముందుకు వెళ్లాలంటే సవరించిన డిపిఆర్ అవసరం" అని ఆయన తెలిపారు.

# వికలాంగులకు ప్రత్యేక ప్రయోజనాలు

## గుంటూరు జిల్లాలో రెండోరోజు పాదయాత్రలో జగన్

**ప్రజాశక్తి - బాపట్ల**

తాము అధికారంలోకి వస్తే వికలాంగుల కోసం ప్రత్యేకంగా సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పిస్తామని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రకటించారు. ఆయన చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర గుంటూరు జిల్లా బాపట్ల నియోజవర్గంలో రెండో రోజైన మంగళవారం కొనసాగింది. స్థానిక ఎబిఎం కాంపౌండ్‌లో మంగళవారం రాత్రి బస చేసిన ఆయన బుధవారం ఉదయం పాదయాత్రకు బయలుదేరే ముందే ఎనిమిది గంటలకు నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. 8.30 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. చిల్లరగొల్లపాలెం చేరుకున్న అనంతరం అక్కడివారితో కొంతసేపు మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం ఆధ్యక్షులు అంకేపల్లి సాంబయ్య, మరికొందరు నాయకులు జగన్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. జీవాలను మేపడానికి ప్రభుత్వ బంజరు భూములను కేటాయించాలని, ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ కోసం జీవాల సొసైటీలున్న గ్రామాల్లో షెడ్లు నిర్మించాలని, గొర్రెలు చనిపోతే ఒక్కోదానికి రూ.5 వేలు, పెంపకందారుడు మరణిస్తే రూ.10 లక్షలు చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా జగన్‌కు గొర్రెపిల్లను బహూకరించారు. కెబి పాలెం అడ్డరోడ్డు వద్ద వికలాంగుల సంఘం నాయకులు చల్లా రామయ్య, మరికొందరు వికలాంగులుండగా వారివద్దకు జగన్ వెళ్లారు. తాము అధికారంలోకి వస్తే పించన్లతోపాటు ప్రత్యేక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ముస్లిం నాయకులు కలిసి నాలుగు శాతం రిజర్వేషన్, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు, వడ్డీలేని రుణాలకోసం వినతిపత్రాలిచ్చారు. పాదయాత్రలో భాగంగా పొలాల్లో పని చేస్తున్న వ్యవసాయ కూలీలను కలిశారు. అప్పికట్లలో మధ్యాహ్న భోజనం అనంతరం ఈతేరు, చుండూరుపల్లిలో పాదయాత్ర సాగింది. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఈతేరు-చుండూరుపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన తాత్కాలిక విశ్రాంతి గృహానికి చేరుకు న్నారు. బుధవారం ఉదయం బాపట్ల నియోజవకర్గం చుండూరుపల్లి ద్వారా పొన్నూరు నియోజకవర్గం ములు కుదురుకు పాదయాత్ర చేరుకోనుంది..

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68